
26-8-66




ఆంధ్రసచిత్రవార

# పత్రిక

35పైసలు


తప్పక చూడండి!
రాజలక్ష్మి ప్రొడక్షన్స్ సమర్పించు
విజయలక్ష్మి పిక్చర్స్
గూఢచారి 116
ఎం. మల్లికార్జునరావు • నిర్మాతలు సుందరలాల్ నహతా, డూండీ



Roopkala
ఉన్నత పాత్ర కల్పనలకు
ఉదాత్త రూప కల్పన రూపొందించిన
భారత్ ఫిలిమ్స్
భక్తపోతన
నిర్మాత
స్క్రీన్‌ప్లే డైరెక్షన్
టి.వి.విశ్వేశ్వరరావు • జి.రామినీడు
నవయుగ
VANI PUBLICITIES

# ఆంధ్ర సచిత్ర వారపత్రిక

## 1966 దీపావళి కథల పోటీ

ఎప్పటివలే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించపోతున్నదని తెలుపటానికి సంతోషిస్తున్నాము. కథకులందరూ ఎప్పటివలే మాతో సహరించి ఈ పోటీని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

## మొదటి బహుమతి రు. 1100

## రెండవ బహుమతి రు. 750

## మూడవ బహుమతి రు. 500

### నిబంధనలు

1. కథలు స్వంత రచనలయి ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనేనని, దేనికీ అనువాదంకాని, అనుసరణకాని కాదనీ హామీరాసి పంపాలి. ఈ హామీ వేరే కాగితంమీద కాక కథ వ్రాతప్రతిమీదనే రాసిఉండాలి.
2. కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.
3. వ్రాత ప్రతిమీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒకవైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయిత పేరు, పూర్తి చిరునామా కూడా వ్రాత ప్రతిమీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజికి రెండురెట్లు) పేజిలకు మించరాదు.
4. కవరుమీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టివీధి, మద్రాసు—1' కి పంపాలి.
5. పోటీ గడువు తేదీ 30—9—1966. ఆ తేదీ తర్వాత మా కార్యాలయం చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.
6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచికగా 11—11—1966తేదీకల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.
7. పోటీ తుది నిర్ణయం ఆంధ్ర సచిత్ర వారపత్రిక సంపాదకుడిదే. ఈ విషయములు ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపటానికి వీలులేదు.
8. వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపటానికి సాధ్యంకాదు. పోటీలో పాల్గొనే వారు తమ రచనలతో తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంపనవసరంలేదు.
9. పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించేముందు తెలుపుతాము.

# ఉత్తరాలు

### సీరియల్

మా అభిమాన ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించిన "లేళ్లపల్లి వెంకట లక్ష్మీనారాయణ" గారి ఉద్యోగాపహరణం చాలా చక్కగా, వాస్తవానికి అతి దగ్గరగా ఉంది. నిరుద్యోగపర్వంలో వివరించినట్లుగా నిరుద్యోగిగా నేను నాల్గు సంవత్సరాలు బాధపడ్డాను. రచయిత నిరుద్యోగులయొక్క అనుభవాలను, మనస్తత్వాలను చక్కగా చిత్రీకరించారు. నిరుద్యోగిగా నా అనుభవం ఏపాటిదంటే, ఈ నాల్గు సంవత్సరాలలో సూర్యోదయం ఎలా ఉంటుందో చూడలేదు. పగలు 10 గం. కు ముందు ఎప్పుడూ లేచే వాడ్ని కాదు. లైబ్రరీకి పేపరు చూడటానికి 10 గం. తరువాత వెళ్లేవాడ్ని. సాయంత్రం షికారు కొంచెం చీకటిపడిన తరువాత నిరుద్యోగులందరము కలసి వెళ్లేవాళ్లము. ఇవన్నీ నాకు బాగా అనుభవాలు. ఇలాంటి వాస్తవాలను ప్రచురించి, గతం మా కళ్లకు గట్టేనట్లు చూపుతున్న రచయితకు నా అభివందనలు.

చెంబూరి లక్ష్మణరావు (భువనేశ్వర్)

* * *

### ఊమెన్ కార్టూన్

15—7—66 తేదీ మా సంచికలో నేను 3—6—66 సంచికలోని కార్టూనుపై వ్రాసిన అభిప్రాయంపై పి. చలమాజీరావు (విశాఖ) గారి విమర్శ చూసి కడు అచ్చెరు వందాను. బహుశా ఆయన ఆ కార్టూనును చూడకుండా కేవలం నా అభిప్రాయాన్ని దృష్టిలో నుంచుకొని అట్లా వ్రాసి వుంటారని తలుస్తాను.

ఆ కార్టూన్లో అయూబ్ ఖాన్ "ఖాండేశ్రస్త" పొజిషనులో వుండి "కదంతాల్" చేస్తున్నాడు. ఆ సమయంలో రైఫిల్ ఎల్లప్పుడూ ఎడమ చేతిలో మాత్రమే వుంటుంది. కానీ కుడి చేతిలో మాత్రము కాదు. సోదర పాఠకుడు శ్రీ చలమాజీరావు గారు నా అభిప్రాయంతో ఏకీభవిస్తారని తలుస్తాను.

క్రొవ్విడి రాయుడు (ఏలూరు)

# ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 26—8—'66

పరాభవనామ సం॥ నిజ శ్రావణ మాసం శు॥ ఏకాదశి

సంపుటము : 58 సంచిక : 52

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14—1—1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

| | పోస్టుద్వారా రూ. పై. |
|---|---|
| సంవత్సర చందా | 19.25 |
| 6 మాసముల చందా | 9.62 |
| 3 మాసముల చందా | 4.80 |

ఇతర దేశాలకు
ఓడమీద (Sea Mail)

| | |
|---|---|
| సంవత్సర చందా | 32.00 |
| అర్ధసంవత్సర చందా | 16.00 |




# మనలోమాట

సెప్టెంబర్ నెలకి ముప్పయిరోజులే ఉన్నా 'దీపావళి కథలపోటీ' ప్రకటనలో పొరపాటున 31—9—66 అని పడింది! ఈ వారం ఈ పొరపాటుని దిద్ది గడువు తేదీ 30—9—66గా మార్చాము.

* * *

చైనాలో పెద్ద మార్పులు కొన్ని జరుగుతున్న సంగతి అందరికీ తెలిసినదే. 'పార్టీ శుద్ధి కార్యక్రమం' అనే పేరుతో కొందరు నాయకులు తమకి పోటీగా ఉంటున్నవారిని, ఉంటారనిపించే వారినీ పదవుల నుంచి తొలగిస్తున్నారని మనం ఊహించవచ్చు. ఈ కార్యక్రమాన్ని వివరించే వ్యాసాన్ని ఒక దానిని ఈ సంచికలో వేస్తున్నాము. ఇటీవల మావ్‌త్సెటుంగ్ నదిలో ఈదినప్పుడు ఆ నదీ జలం రుచే ఎక్కువ అయిందిట! పింగ్‌పాంగ్ ఆట నుంచి పారిశ్రామిక ఉత్పత్తి దాకా ఆయన సిద్ధాంతాలని పాటించి మంచి ఫలితాలని సాధించారుట ఎందరో....

* * *


'జయదేవ్' తమ కార్టూన్‌లలో 'ఇంతులం సంగతి' తెలపటానికి ప్రయత్నించారు, 'ఎవరికి తెలియదులె'— అంటూనే....

* * *

శ్రీ శ్రీకృష్ణ యూరోప్ పర్యటనలో ఉన్నందువల్ల కొన్ని వారాలపాటు న్యూఢిల్లీలేఖ ప్రచురించడానికి వీలుపడదు...

# విషయానుక్రమణిక

ముఖచిత్రం : సతీ జమున


ఎలుక మాంసం ప్రోటీన్లు గల ఆహారం, అది మనుషులకు సరిపడుతుందని అన్నారు — వార్త
ఆహార మంత్రి వస్తున్నారు మనం తప్పించుకోవాలి
ఇండొనేసియా - మలేసియా సుహృద్భావం
ఆపు! ఆపు!
సుకర్నో
అది పులి కాదూ?
కాదు గాండ్రెపిల్లి
తిరిగి ఆయుధ బలాన్ని పుంజుకుంటున్న పాకిస్తాన్
పాకిస్తాన్ ఆయుధాల్ని తిరిగి సమకూర్చుకుంటున్నదన్న విషయంపై భారతదేశం భయాన్ని పోగొట్టే అమెరికా యత్నం
నాగా నాయకులతో ఇందిరా గాంధీ మళ్ళీ చర్చలు జరిపారు
గిరగిరా తిరిగే ప్రయాణాలు
నాగా
చర్చలు
OOMMEN

# చైనాలో 'పార్టీశుద్ధి' కార్యక్రమం

చైనాలో జరిగిన 'ఏరివేత', రష్యాలో జరిగిన ప్రక్షాళన అంత ప్రముఖంగాకనిపించకపోయినా, 1921 లో చైనా కమ్యూనిస్టు పార్టీ మొదటి సమావేశం రహస్యంగా జరిగిన నాటినుండి పార్టీలో ప్రత్యర్థి వర్గం ఉంటూనే ఉంది. 1927 లో మావ్ సేటుంగ్‌నే పొలిట్ బ్యూరో నుండి బర్తరఫ్ చేయటం జరిగింది. అయితే ఆ మరుసటి సంవత్సరమే ఆయన ప్రత్యర్థి విలింసానను తొలగించి తిరిగి పొలిట్ బ్యూరోలో ప్రవేశించ గలిగారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం జరిగిన "ఏరివేత"లలో 1955—59 లలో జరిగినవి చాల ముఖ్యమైనవి. 1955 లో ప్రభుత్వ ప్రణాళికా సంఘం అధిపతి కావోకాంగ్‌ను బర్తరఫ్ చేసి రహస్యంగా విచారించారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. 1959 లో అప్పటి చైనా రక్షణమంత్రి మార్షల్ పెంగ్‌తెహ్‌హుయ్‌ను పార్టీ వ్యతిరేక వర్గానికి నాయకత్వం వహించిన నేరంపై అరెస్టు చేశారు. ఆయన స్థానే లిపిన్‌యావోను నియమించారు. చైనా ప్రారంభించిన 'గ్రేట్‌లీప్' (పెద్ద గెంతు) కార్యక్రమాన్ని విమర్శిస్తూనూ, చైనా రష్యా విభేదాల అభివృద్ధిని నిరసిస్తూనూ మాస్కోకు లేఖ వ్రాశారని పెంగ్‌పై నేరారోపణ చేయటం జరిగింది. అప్పట్లో చైనాకు ఆధునిక ఆయుధాలు సరఫరా చేస్తున్న దేశాలలో ప్రధానమైనది రష్యా. మూడవ 'ఏరివేత' కార్యక్రమం యిప్పుడు జరుగుతున్నది. విశ్వ విద్యాలయాలలోనూ, రాష్ట్ర పాలనంలోనూ పాఠశాలలలోనూ పీకింగ్‌లోనూ ఈ 'ఏరివేత' కార్యక్రమం అమలు జరుగుతున్నది.

## క్రొత్త 'ఏరివేత' ఎందుకు

ఒకప్రక్క రష్యా సంస్కరణవాదులు మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాలకు దూరమై పోతుండడం చూచిన మావ్ సేటుంగ్, 1930—40 మధ్య తనకు గలిగిన విప్లవానుభవం ప్రాతిపదికపై రూపొందించిన సూత్రాలకే చైనా పార్టీ జారి అంటి పెట్టుకుని ఉండేట్లు చూడాలని ఆదుర్దా పడుతున్నారు. మావ్ వ్రాతలపై నిరంతరం ఆధారపడి ఉండటం, సాంకేతిక కారణాల మీద రాజకీయ కారణాలకు ప్రాధాన్యత యివ్వటం, పరిసరాలకన్నా మనిషికి ప్రాధాన్యత యివ్వటం, స్వల్ప కాలీనమైన రాజకీయాల కన్నా సిద్ధాంతాలకు ప్రాధాన్యత యివ్వటం, నిరాడంబరమైన జీవితాన్ని గడుపటం మున్నగునవి మావ్ రూపొందించిన సూత్రాలలో ఉన్నాయి. ఈ నిరాడంబర జీవిత మనేది గెరిల్లా వీరుడుగా మావ్ గడించిన అనుభవానికి సంబంధించినది దీనినే 'గెరిల్లా విధానం' అని కూడ అంటారు. ఈ సూత్రాలు సైన్యాన్ని యితరులకు ఆదర్శప్రాయం చేసే స్థానంలో ఉంచుతాయి. అయితే సైన్యం ఖచ్చితమైన పార్టీ అజమాయిషీ క్రింద ఉంటుంది. మావ్ రచనలను చదివి అమల్లు పరచేవాడు మంచి సిపాయి.

ఏకార్మిక కర్షకుల పేరు మీద అయితే విప్లవాలు జరిగాయో ఆ కార్మికులనూ, కర్షకులనూ రష్యాలోనూ, ఇతర యూరోపు దేశాలలోను మేధావులు మోసం చేశారని మావ్ అభిప్రాయం. కార్మికులు, కర్షకులు, సిపాయిలు నిజమైన విప్లవ మేధావులనీ, వారి అవసరాలకు ఉపయోగపడని మేధా సంపత్తి ఎంత గొప్పదైనా పనికి మాలినదే ననీ మేధావులకు గుర్తు చేయాలనీ ఆయన సంకల్పం. అమలులోకి వచ్చేసరికి, మద్దతుదారులను ప్రత్యర్థుల నుండి వేరు చేయుటానికి ప్రజలను తమ పంథాలో పెట్టుకోటానికి ఇది చాలా వీలైన పద్ధతి.

మేధావుల ఆలోచనా సరళిలోనే ప్రక్షాళన చేయటం మావ్ ప్రధానోద్దేశం. పెకింగ్ మేయర్ పెంగ్‌చెన్, సాంస్కృతిక శాఖ మంత్రి ల్యూటింగ్‌యీ, సైనిక సిబ్బంది ప్రధానాధికారి లోజ్‌యిచింగ్‌లను బర్తరఫ్ చేయటం ఈ ప్రధాన లక్ష్యానికి ముందు జరిగిన సంఘటనలు. పెకింగ్‌లో పత్రికల వారిలో నేమి, విశ్వ విద్యాలయాలలో నేమి, యితరత్రానూ, సంస్కరణభావాలు అధికంగా ఉన్నందునే పెంగ్‌ను తొలగించటం జరిగింది. పెంగ్ సిద్ధాంత వాదిగా ప్రసిద్ధికెక్కిన వ్యక్తిత్వ సహచరులను మద్దతు చేయటానికి కారణం వారితో ఏకీభవించటం కాదు. వారి ఎడల గల విధేయత.

చైనా విద్యా విధానాన్ని సంస్కరించటం జరిగింది. ఈ సంస్కరణల వల్ల సెకండరీ విద్యా వ్యవస్థలోనికి కార్మికులనూ, రైతులనూ, సిపాయిలనూ జొప్పించటం జరిగింది. విద్యను వ్యవసాయంతో కానీ, లేక పరిశ్రమలతో గానీ జత చేశారు. పార్టీ సిద్ధాంతానికి, చైనాలోని ఆలోచనా సరళిని దృఢంగా జతచేయుటానికే యిలా చేయటం జరిగిందని స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

## ప్రాథమిక చర్యలు

సెప్టెంబర్: 1965· చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రసంఘం సమావేశం జరిగింది. అధ్యక్షుడు మావ్ స్వయంగా 'ఏరివేత' కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారు. ("లిబరేషన ఆర్మీ డైలీ" 1966 జూన్‌లో యీ సమావేశం విషయం వెల్లడించింది)

నవంబర్: 1965: రచయిత, చరిత్రకారుడూ, పెకింగ్ డిప్యూటీ మేయరూ అయిన వ్యూహాన్ వ్రాసిన నాటకాన్ని పాంఘై పార్టీ పత్రిక విమర్శించింది. పెద్ద గెంతునూ, తదితర విధానాలనూ మితవాద సరళిలో విమర్శించటానికి చారిత్రక సంఘటనలను ఈ నాటకంలో అడ్డు పెట్టు కున్నాడని విమర్శించటం జరిగింది.

డిసెంబర్: 1965: వ్యూహాన్‌పై లిబరేషన్ ఆర్మీ జర్నల్‌కూ, పీపుల్స్ డైలీకి మధ్య చర్చ జరిగింది. అందు టెంగ్‌టో ఆయనను సమర్థించారు.

జనవరి 16. 1966: కార్మికుల కొరకూ కర్షకుల కొరకూ, సిపాయిల కొరకూ, వ్రాయవలసిందనీ, ఆధ్యాత్మిక వాదులను కోరటం జరిగింది. వర్గ పోరాటం, ఉత్పత్తి కొరకు పోరాటం, శాస్త్రీయ పరిశోధనల కొరకు పోరాటం అనే మూడు బృహత్తర విప్లవోద్యమాలను గురించి వ్రాయ వలసిందని కూడా అర్థించటం జరిగింది.

జనవరి 18. 1966: సైన్యంలో రాజకీయ కార్యక్రమంపై జరిగిన 20 రోజుల సమావేశం సమాప్తమైంది. మావ్ ఆలోచనా సరళియే ఏకైక మార్గదర్శి. సైన్యం పూర్తిగా పార్టీ నాయకత్వం క్రింద ఉండాలి.

## ప్రత్యర్థులపై దాడి

ఏప్రిల్, 10. 1966: మూడు నెలలు గడిచిన తరువాత పీపుల్స్‌డైలీ వ్యూహాన్‌ను నిందించింది. 1959 లో ఆయన మితవాదుల వైపు తిరిగి పోయారని ఆరోపించింది.

ఏప్రిల్ 14. 1966: మావ్ ఆలోచనా సరళిని అంటి పెట్టుకొని ఉండాలని సాంస్కృతిక శాఖ డిప్యూటీ మంత్రి పిలుపు నిచ్చారు.

ఏప్రిల్, 14. 1966: చైనా సైన్స్ అకాడమీ అధ్యక్షుడు, మావ్‌కు సన్నిహితుడూ అయిన కుయోమోజో, మావ్ సిద్ధాంతాలను తగినంతగా ఆకళింపు చేసుకోనందున తన రచనలన్నిటినీ తగుల బెట్టాలని అన్నారు. కార్మికుల నుండీ, కర్షకుల నుండీ, సిపాయిల నుండీ నేర్చుకోవాలనే దృఢ సంకల్పానికి తాము వచ్చామనీ, వారిని తమ ఉపాధ్యాయులుగా వుండమని కోరదలచామనీ ఆయన అన్నారు. ఈ ప్రకటన మిగిలిన మేధావుల నుండి ఆత్మవిమర్శ రాబట్టటానికి ప్రోత్సాహం కలిగించే ఉద్దేశంతో చేసినదై వుండవచ్చు.

ఏప్రిల్, 16. 1966: వ్యూహాలను మద్దతు చేశాడనే ఆరోపణపై తన మాజీ డైరెక్టర్ టెంగ్‌టోను పీపుల్స్ డైలీ విమర్శించింది.

ఏప్రిల్, 18. 1966: నవచైనా ఏర్పాటు చేసిన నాటి నుండీ సాహితీ పరుల కళాకారుల వర్గాలలో పార్టీ వ్యతిరేకభావం ఒకటి వచ్చిందనీ ఇది సోషలిస్టు వ్యతిరేక భావమనీ, మావ్ ఆలోచనలకు విరుద్ధమైనదనీ లిబరేషన్ ఆర్మీ జర్నల్ ప్రకటించింది.

ఏప్రిల్, 20. 1966: ఇదే ఆరోపణను పీపుల్స్ డైలీ పునరుద్ఘాటించింది.

ఏప్రిల్, 30. 1966: మహత్తర చారిత్రక ప్రాధాన్యంగల సోషలిస్టు సాంస్కృతిక విప్లవాన్ని ప్రారంభింశ మన్నట్లు ప్రధాని చౌఎన్‌లై వెల్లడించారు. విద్యారంగంలోనూ పత్రికా వ్యాసంగ రంగంలోనూ గల బూర్జువా ఆదర్శాలను తొలగించటానికి పోరాటం ప్రారంభించాలనీ ఆయన పిలుపు నిచ్చారు.

మే, 4. 1966: 'లిబరేషన్' ఆర్మీ జర్నల్

# చైనాలో 'పార్టీశుద్ధి' కార్యక్రమం

పార్టీ వ్యతిరేకపు ఎత్తుగడలనుగురించి ప్రస్తావించింది. 'ఎర్రజెండాను వ్యతిరేకించటానికి వారు ఎర్ర జెండాలను వూపుతున్నారు. మార్క్సిజాన్ని మావ్ సిద్ధాంతాలను వ్యతిరేకించటానికి వారు అదే ముసుగు ధరిస్తున్నారు.' అని పత్రిక ప్రకటించింది.

## పీకింగ్ ముఠాపై దాడి

మే, 8. 1966: టెంగ్‌టో, తదితరుల రచనలను ప్రచురించినందుకు 'పీకింగ్ డైలీ' 'పీకింగ్ ఈవినింగ్ న్యూస్', 'ఫ్రంట్ లైన్' పత్రికలను 'క్వాంగ్ మింగ్ డైలీ' విమర్శించింది.

మే, 11. 1966: పీకింగ్ ప్రణాళికా రచయితల వర్గంవారు పార్టీ కేంద్ర సంఘం మీద పెద్ద ఎత్తున దాడి చేయటానికి పథకం తయారు చేశారని పీకింగ్ రేడియో ఆరోపించింది.

మే 24, 1966: టెంగ్‌టోనూ, ఆయన సహచరులనూ, 'లిబరేషన ఆర్మీ జర్నల్' విమర్శించింది. "మీరు మీ యజమానుల ఆదేశంపై ఈ క్షణాన కూడ సోషలిస్టు వ్యతిరేకమైన, పార్టీ వ్యతిరేకమైన నేరాలను కొనసాగించటం లేదా" అని ఈ పత్రిక ప్రశ్నించింది.

మే, 25. 1966: మూడు పీకింగ్ పత్రికల సంపాదక వర్గాలను రద్దు చేయటం జరిగింది. ఆ పత్రికల డైరెక్టర్లను బర్తరఫు చేశారు. 'ఫ్రంట్‌లైన్' ను నిలిపి వేశారు.

జూన, 1. 1966: 'రాక్షసు లందరినీ తుడిచి పెట్టాలి' అని 'పీపుల్స్ డైలీ' అభ్యర్థించింది. బూర్జువా వర్గానికి చెందిన నిపుణులు, విద్యా వేత్తలు, అధికారులూ అందరినీ రూపుమాపాలని ఈ పత్రిక కోరింది. సోషలిజం జయిస్తుందా, పెట్టుబడి దారీ వ్యవస్థ జయిస్తుందా ఆ విషయం ఇంకా స్థిరపడలేదని ఈ పత్రిక ప్రకటించింది.

జూన, 3. 1966: పీకింగ్ మేయరు ప్రథమ కార్యదర్శి అయిన పెంగ్‌చెనను తొలగించారు. లిహుసె ఫింగ్‌ను ప్రథమ కార్యదర్శిగా నియమించారు. వ్యూటేహను రెండవ కార్యదర్శి చేశారు. పార్టీకి వ్యతిరేకంగానూ సోషలిజానికి వ్యతిరేకంగానూ ఉన్న పీకింగ్ పార్టీనీ, విశ్వవిద్యాలయ అధిపత్యాన్ని పునర్నిర్మించటం జరిగింది. అర్ధరాత్రి వేళ విశ్వ విద్యాలయంపై విరుచుకుపడటం జరిగింది. 'ఏరివేత' కార్యక్రమంలో సహాయపడేందుకు గ్రామీణ ప్రాంతాలలోవున్న వందలాది గ్రాడ్యుయేట్లను పిలువనంపటం జరిగింది.

## ప్రత్యర్థివర్గంపై విజృంభణ

మే, 11. 1966: అల్బేనియన ప్రతినిధి వర్గం గౌరవార్థం ఇచ్చిన విందులో మావ్ తిరిగి బహిరంగంగా పాల్గొన్నారు.

మే, 19. 1966: ఈ సాంస్కృతిక విప్లవం, విద్యా విషయకమైన ప్రశ్న కానేకాదు. వర్గ పోరాటానికి సంబంధించిన జీవన్మరణ సమస్య ఇది. నాయకత్వం కొరకు కార్మికులకూ, బూర్జువాలకూ మధ్య జరుగు తున్న భయంకరమైన పోరాటం ఇది అని సియోల్ రేడియో ప్రకటించింది.

మే, 27. 1966: పార్టీ మీద, సోషలిజం మీద విషపూరితమైన అమ్ములువేశాడని షంటుంగ్ రాష్ట్రపు వైస్ గవర్నర్‌ను విమర్శించటం జరిగింది.

జూన్, 2. 1966: రాజకీయ కార్యక్రమం విషయంలో చైనా సైన్స్ అకాడమీ మహాసభ జరిగింది. శాస్త్రీయ సాంకేతికాభి వృద్ధికి మావ్ సిద్ధాంతాలే ప్రాతిపదిక అని ఏకగ్రీవంగా ఆమోదించటం జరిగింది. శాస్త్రీయ ప్రయోగాలను ఉత్పత్తితో జతపరచాలనీ, కేవలం విద్యా విషయకమైన బూర్జువా పరిశోధనలను వ్యతిరేకించాలనీ నిర్ణయం జరిగింది.

జూన, 4. 1966: పార్టీ అధ్యక్షుడు మావ్ సేటుంగ్‌ను ఎవరు వ్యతిరేకించినా వారిని పార్టీ మొత్తమూ, దేశంయావత్తూ ఖండించగలదని పీపుల్స్ డైలీ పత్రిక ప్రకటించింది. వారి గతి అధోగతియేనని ఈ పత్రిక పేర్కొన్నది.

జూన్, 10. 1966: ప్రస్తుత పోరాటం విముక్తి లభించిన నాటి నుండి జరిగిన పోరాటాలలో కెల్ల విశేషమైనదని షాంఘైరేడియో ప్రకటించింది.

జూన, 12. 1966: నాన కింగ్ విశ్వవిద్యాలయ అధ్యక్షునీ, విశ్వ విద్యాలయ పార్టీ కార్యదర్శిని బర్తరఫు చేయటం జరిగింది. ఆతరువాత (దాదాపు 20 విశ్వ విద్యాలయాలలో) 'ఏరివేత' కార్యక్రమం అమలు జరిగింది.

జూన, 13. 1966. ఉన్నత విద్యా ప్రవేశ పద్ధతిని సంస్కరించటం జరిగింది. పాఠశాలలోనూ, విశ్వ విద్యాలయాలలోనూ సాంస్కృతిక విప్లవాన్ని నిర్వహిస్తున్న సమయంలో 1966లో ఆరు నెలల పాటు విద్యార్థులను సమోదు చేసుకోవటాన్ని నిలిపి వేశారు.

జూన, మధ్య రాష్ట్రీయ అధికారుల నెక్కువ సంఖ్యలో విమర్శించటం జరిగింది.

జూన, 15. 1966: పీకింగ్ పబ్లిషింగ్ హౌస్ గుట్టును బట్ట బయలు చేశారు. దానిపై దాడి చేశారు.

జూన, 17. 1966: విద్యా సంస్కరణల ఎడల హర్షం ప్రకటిస్తూ, కొత్త సూచనలు చేస్తూ పాఠశాల విద్యార్థులు ఉత్తరాలు వ్రాశారు.

ఈ సూచనలలో ఈ క్రిందివి ఉన్నాయి:

(1) మూడు బృహత్తర విప్లవోద్యమాలలోనూ సీనియర్ స్కూల్ గ్రాడ్యుయేట్లు కార్మికుల, కర్షకుల, సిపాయిల ఆమోదం పొందాలి. వారి నుండి సిద్ధాంత సంబంధమైన గ్రాడ్యుయేషన సర్టిఫికేట్‌లు పొందాలి.

(2) ఇతోధిక విద్యా బోధనకు కర్షక, కార్మిక, సైనిక విప్లవ వాదులను సమోదు చేయాలి.

(3) పరిశ్రమలను గురించిన బోధనకు సగభాగం, చదువుకు సగభాగం, లేక వ్యవసాయ బోధనకు సగభాగం కేటాయించే విద్యా వ్యవస్థను సత్వరంగా పెంపొందించాలి.

## నాయక ప్రవచనం

జూన, 18. 1966: పీకింగ్ పత్రికలకు రక్షణ మంత్రి లిన్ పియావో వ్రాసిన లేఖలో ఇలా అన్నారు: "చైనాకు, సమైక్యమైన ఆలోచనా సరళి, విప్లవాత్మక మైన ఆలోచనా సరళి, సరియైన ఆలోచనా సరళి అవసరం. అదియే మావ్ సేటుంగ్ ఆలోచనా సరళి. ఈ విధమైన ఆలోచనా సరళితో మాత్రమే మనం తీవ్రమైన విప్లవోత్సాహాన్నీ, సరియైన, దృఢమైన రాజకీయ మన స్తత్వాన్నీ నిలబెట్టుకోగలం."

"మావ్ సేటుంగ్ ఆలోచనా సరళి కార్మిక ప్రజల నుండి హఠాత్తుగా అభివృద్ధి చెందినదికాదు. మార్క్సిజం — లెనినిజం నుండి సంక్రమించిన భావాలనూ, మహత్తర విప్లవ ప్రాతిపదికపై అధ్యక్షుడు మావ్ సేటుంగ్ అత్యంత సమర్థంగా రూపొందించగా లభించిన ఆలోచనా సరళి ఇది.

జూన, 20. 1966: ఉత్తర వియత్నామీలకు ఇచ్చిన విందులో విదేశాంగ మంత్రి చెన్‌యీ ప్రసంగించారు.

"ఒక్క సారిగా ముందుకు దుముకాలని చైనా సంకల్పించింది. ఇప్పుడీ కార్యక్రమం సగంలో ఉంది. విప్లవ మేధావులైన కార్మిక, కర్షక, సైనిక బాహుళ్యంపై మనం విశ్వాసం ఉంచాం. ఇది వరకు కన్నా మన దేశం సమైక్యంగా, సంఘటితంగా ఉందనే విషయాన్ని, విప్లవం ప్రారంభించ బడిందనే వాస్తవమే వెల్లడిస్తుంది."

జులై, 1. 1966: చైనా కమ్యూనిస్టు పార్టీ 45 వ వార్షికోత్సవం జరిగింది. లియుషావోచి, చౌ ఎన లై, లినపియావో టెంగ్‌సియావో, పెంగ్ మున్నగు వారంతా మావ్ ఆలోచనా సరళిని ప్రశంశించారు. దీనిని బట్టి ఉన్నత స్థాయిలో 'ఏరివేత' కార్యక్రమం పరిసమాప్తమైందని భావించవచ్చా?

జులై, 1. 1966: వార్షికోత్సవ సందర్భంగా పీపుల్స్ డైలీ తన సంపాదకీయంలో ఈ విధంగా వివరించింది.

'1949 లో పీపుల్స్ రిపబ్లిక్‌ను స్థాపించిన నాటి నుండి 'మార్క్సిజం — లెనినిజం', సంస్కరణ వాదంతో మూడు పోరాటాలు జరిపింది.'

(1) 1953 —55: స్థిర పడిన సోషలిస్టు సూత్రాలకు వ్యతిరేకంగా కావోకాంగ్ జావోషుషేహ్‌లు పార్టీ వ్యతిరేక ఒప్పందం కుదుర్చుకున్నారు. 1954 లో జరిగిన 7 వ కేంద్ర సంఘం సమావేశంలోనూ, 1955 లో జరిగిన పార్టీ సమావేశంలోనూ అధికారం స్వాధీనం చేసుకోవటం కొరకు జరిగిన ప్రయత్నాలను పటాపంచలు చేయటం జరిగింది.

(2) పారిశ్రామికంగా పెద్దగెంతు వేయాలనే విషయంలోనూ వ్యవసాయ కమ్యూన్ల విషయం

(53 వ పేజీ చూడండి)


'నా
చర్మసౌందర్యం
కోసం లక్స్
నాకు ప్రీతి'
అన్నది జమున
LUX
TOILET SOAP
తెలుపులోను నాలుగు నావెన్నెల రంగుల్లోను వున్నది
లక్స్ టాయ్‌లెట్ సబ్బు
సినిమా తారలకు సౌందర్యమునిచ్చే
శుద్ధమైన సొమ్మమగు సబ్బు

'అభినయం'



'భావకలాపం'



# కూచిపూడి తార

# కుమారి యడవల్లి రమ

రంగపూజ



లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేసేవాళ్ళూ, అందుకై జీవితాన్ని అర్పితం చేసిన వాళ్ళూ మనకి అధికంగా కనిపించక పోయినా అక్కడక్కడ కనిపిస్తూనే ఉంటారు. కూచిపూడినాట్యంలో అనన్యసాధారణ ప్రతిభను సంతరించుకున్న కుమారి యడవిల్లి రమను గురించి అనుకున్నప్పుడు చప్పున యీ విషయం జ్ఞాపకం వస్తుంది.

రమను గురించి చెప్పేముందు కూచిపూడి నాట్య విశిష్టతను గూర్చి యిక్కడ రెండు ముక్కలు చెప్పవలసి ఉన్నది.

కృష్ణాజిల్లాలోని కూచిపూడి గ్రామానికి లలితకళా ప్రపంచంలో వొక ప్రత్యేకమయిన స్థానం ఉన్నది. శాస్త్రీయ నృత్యంలోని వొక పద్ధతికి యిది సార్థక నామంగా స్థిరపడి పోయింది. అతి ప్రాచీన కాలం నుంచి వివిధ రూపాలలో భాగవత మేళం వొకటి కూచిపూడిలో వుంది. సుమారు ఆరు శతాబ్దాల కిందట సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్యానికి యిప్పటి స్వరూపాన్ని ప్రసాదించారు. ఇప్పటికీ యిది ఇతర నవీన నాట్యపద్ధతులకు లోనుకాకుండా, తన స్వచ్ఛతను కాపాడుకుంటూ వస్తున్నది. కూచిపూడి నాట్యంలోని క్లిష్టమయిన పద విన్యాసం, అతి సున్నిత మయిన అభినయ కౌశలం, నాట్య స్వరూపం దానికొక విశిష్టతను సమకూర్చుతున్నవి.

క్లిష్టతరమైన యీ నాట్య విద్యాభ్యాసం

'తరంగం' భామనే సత్యభామనే



మొన్నమొన్నటి వరకు పురుషులకు మాత్రమే పరిమితమయి ఉండేది. ఇపుడీ విద్య నేర్చుకునేందుకు స్త్రీలు కూడా కుతూహలం కనబరుస్తూ ముందుకు వస్తున్నారు. అలా నేర్చుకుని ప్రావీణ్యతను సంపాయించుకున్న వారిలో కుమారి యడవిల్లి రమను ముఖ్యంగా పేర్కొనవలసి ఉన్నది.

* * *

1946 ఆగస్టు 10వ తేదీన కుమారి రమ విజయనగరంలో స్వర్గీయ యడవిల్లి ప్రకాశరావుగారింట జన్మించింది. 1961లో నాట్యాచార్యుడు శ్రీ వెంపటి సత్యంతో పరిచయ మేర్పడి ఆయన వద్ద యీ నృత్యకళను అభ్యసించాలన్న తలంపు కలిగింది. శ్రీ సత్యం కూడ రమలోని అభిరుచిని, ఆసక్తిని గుర్తించి, ఎంతో శ్రద్ధతో కూచిపూడి నృత్యశాస్త్రాన్నినేర్పారు..రమ అకుంఠిత దీక్షతో సాధన చేసి, విశిష్టమయిన ప్రావీణ్యం సంపాయించుకున్నది. రమ ఉన్నతికి కారణభూతులయిన వారిలో ఆమె తల్లి శ్రీమతి సూర్యకాంతం కూడ వున్నారు.. ఆమె ప్రోత్సాహ, ప్రోద్బలాలు కుమారి రమను ఉత్సాహపరచి, చక్కని వర్తకిగా తయారు చేసినవి.

1964 ఫిబ్రవరి 6 వ స్థానిక రాజా అణ్ణామలై మందిరంలో రమ 'అరంగేట్రం' జరిగింది. అరంగేట్రం తర్వాత తొలిసారిగా ఏలూరులోని త్యాగరాయ గానసభలో ప్రదర్శన యిచ్చింది. అప్పటి నుంచి యిప్పటి వరకు ఆంధ్ర, మద్రాసు, బెంగాల్, ఒరిస్సా రాష్ట్రములలో కలిపి మొత్తం 56 ప్రదర్శనలు జరిపింది కుమారి రమ. రంగపూజ, స్వరజతి, కృష్ణశబ్దం, కృతి, తరంగం, (బాలగోపాల) తిల్లాన, దశావతారాలు, సత్యభామా స్వాంతనం—కూచిపూడి నాట్య సాంప్రదాయంలోని విభాగాలు. వీటిలో బహు క్లిష్టమయినది తరంగ నృత్యం. ఇత్తడి పళ్లెం అంచులపై నిలబడి అభినయం కనపరచాలి. సుమారు 45 నిమిషాలు పాటు ప్రదర్శింపబడే యీ నృత్యాన్ని ఎంతో నేర్పుతో చేస్తుంది రమ.

"నేను నేర్చుకున్నది చాలా స్వల్పమండీ! నేర్చుకోవలసింది ఇంకా ఎంతో వుంది. ప్రస్తుతం త్యాగరాయ కృతులు. పంచరత్నాలను కూచిపూడి పద్ధతిలో ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తున్నానండీ!" అన్నది కుమారి యడవల్లి రమ. ఈమె నృత్యాలకు సంగీత సారథ్యం వహించేదీ, గొంతును ఎరువిచ్చేది రమ సోదరి కుమారి స్వర్ణకుమారి. ఈ అమ్మాయి కంఠంలో చక్కటి మాధుర్యం ఉన్నది.

కూచిపూడి తెలుగువారి కళ. తెలుగువారి స్వంతం. మరుగున పడిపోతున్న యీ కళను ఉద్ధరించ నడుం కట్టిన వర్తకి కుమారి యడవిల్లి రమ తెలుగువారికి గర్వకారణం. చిన్నిబ్రదర్స్ వారు నిర్మిస్తున్న "సతీ సుమతి" చిత్రంలో రమ ఒక చక్కటి నృత్యం చేసింది. సుమారు తొమ్మిది నిమిషాలు పాటు వుండే యీ క్లాసికల్—చూపరులను విశేషంగా ఆకర్షిస్తుంది.

—మోహన్ కుమార్

'బాల కనకమయ' త్యాగరాజ కీర్తన



# అర్ధాంగి



ఉన్నవ విజయలక్ష్మి

జ రి గి న క థ

సుదర్శనానికి వైద్యం చేయడానికి అయిష్టాన్ని ప్రదర్శించిన డాక్టర్ హరీష్‌ను నొప్పిస్తుంది మంజుల. హరీష్ తల్లి మంజుల పుట్టినరోజు కానుకగా నిర్మల్ పెయింటింగ్ ప్రెజెంట్ చేస్తుంది. హరీష్, మంజుల పరిచయాన్ని చూసి అసూయపడ్తాడు శంకరం. గోపాలం సుదర్శనం గురించి చెప్పిందంతా విన్నతర్వాత ఆయనపై అసహ్యం కలిగినా తన ధర్మాన్ని నిర్వర్తించడానికే నిశ్చయించుకుంటాడు హరీష్. శంకరం వేరొక యువతితో ప్రేమకలాపాలు జరుపుతూ ఆస్తికోసం మంజులను వివాహం చేసుకోడానికి వేసిన పథకాన్ని విన్న హరీష్ మంజులలు ఆశ్చర్యచకితులవుతారు.

## 5

ఒక్క మాటైనా మాట్లాడకుండా మూలగా ముడుచుకు కూర్చున్న మంజులని చూస్తూ, కారు స్టార్ట్ చేసి, "రాస్కెల్. ఎంత నాటకం ఆడుతున్నాడు" అన్నాడు పళ్ళు కొరకుతూ.

ఇంతవరకూ నిగ్రహించుకుంటూ వచ్చిన దుఃఖం మరి ఆగలేదు. తల బాగా వంచేసు కొని కొంగులో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న మంజులని ఎలా ఓదార్చాలో తెలియలేదు అతనికి. అలాగని, చూస్తూ కూర్చోవడమూ చేత కాలేదు.

"అసలు మీరిక్కడెందుకున్నారు? హాయిగా మీ అమ్మా వాళ్ల దగ్గరికి వెళ్లి పోకపోయారా?" అన్నాడు చివరికి.

"అమ్మ! అంత అదృష్టం నాకుంటే, నేనిక్కడెందుకుంటాను" అంది అలా వెక్కి వెక్కి పడుతూనే.

అతను ఆశ్చర్యపోలేదు. కాని మంజుల పట్ల జాలితో అభిమానంతో అతని హృదయం నిండిపోయింది. "ఈమెకి నా అన్నవాళ్ళు ఎవరూ లేకనే, ఇన్ని అవమానాలనీ అత్యాచారాలనీ సహిస్తూ ఇక్కడే వుందన్న మాట. లోకంలో దురదృష్టాలు ఎన్ని రకాలుగా వుంటాయి. ఇప్పుడీ అభాగ్యురాలిని ఓదార్చటం ఎలా? ఓదార్పు మాట ఎలా వున్నా తన కర్తవ్యం ఏమిటి? ఎలాంటి సలహా ఇవ్వాలి". ఎంతకీ ఆలోచన తెగలేదు. అయినా ఏదో మాట్లాడాలి అనుకొని,

"మీ నాన్నగారున్నారు కదా..." ఎలాంటి సమాధానం వినాల్సి వస్తుందోనని అర్ధోక్తి లోనే ఆపేసి భయంగా ఆమె ముఖంలోకి చూశాడు.

అప్పటికి దుఃఖాన్ని దిగమింగుకుని, కొంగుతో కళ్ళు మొహం తుడుచుకుంటూ, "ఇక్కడెక్కడైనా కాస్సేపు ఆపండి. మీతో చాలా విషయాలు చెప్పాలి." అంది ఒక నిశ్చయానికి వచ్చిన దానిలా.

కారు పబ్లిక్ గార్డెన్‌లోకి వెళ్లాక, ఇక్కడ ఆపనా అన్నట్లు చూశాడు. ఇద్దరూ దిగి నిర్మానుష్యంగా వున్న స్థలం కోసం చూసుకుంటూ నడుస్తున్నారు. ంటెన్ దగ్గర ఆగి చేతో కాసిని నీళ్ళు తీసుకుని చెక్కిళ్ల మీద ఎండిపోయిన కన్నీటి చారి కలని కడిగేసుకుని కర్చీఫ్‌తో తుడుచుకుంది మంజుల. హరీష్ ఆగి చిప్స్ ప్యాకెట్లూ ఐస్క్రీం కప్పులూ కొన్నాడు.

నోటి దగ్గిర పెట్టుకున్నది తినాలనే ధోరణి లేనట్లు పరధ్యానంగా ఎటో చూస్తూ కూర్చున్న మంజులనే ముగ్ధుడై చూస్తున్నా డతను. చెట్టుకొమ్మల లోంచి దూసుకు వస్తున్న పల్చటి నీరెండ, ఎటు చూసినా కంటికి ఆహ్లాదంగా అతి ప్రశాంతంగా వున్న పరిసరాలు, వాటి మధ్య తన చేతికి అందే టంత దూరంలో లోకోత్తర సౌందర్యరాశి మంజుల మందంగా వీస్తున్న చల్ల గాలికి అందంగా ఆమె నుదుటి మీద కదులాడుతున్న ముంగురులను సవరించాలనీ, పల్చటి ఆమె చెక్కిళ్లను తన రెండు చేతులతోనూ మృదు వుగా నిమరాలనీ..ఛ. తన వూహకి తనే సిగ్గు పడ్డాడు. అంతలోనే మరో చిలిపి వూహ వచ్చింది.

"అడుగో మీ బావ."

"ఎక్కడా?" కెవ్వుమని బెదురుగా ఇటూ అటూ చూసింది మంజుల.

"అబ్బ. ఎంత భయం బావంటే?"

"ప్రక్కన మీరుండగా నా కెవరి భయమూ లేదు. పరధ్యానంగా వుండటం వల్ల వులిక్కి పడ్డానంతే. అసలింతకీ బావ ఎక్కడ కనిపించాడు. ఆ అమ్మాయి కూడ వుందా?"

"కాదేమోలెండి. దూరాన్నించి నాకు అలా అనిపించింది." ఎంత జాగ్రత్తగా వున్నా కళ్లు మాత్రం నవ్వు దాచుకోలేక పోయాయి.

"ఊహు." తల వూగిస్తూ గునిసింది మంజుల.

"ఇంతకీ మీరు చెప్తానన్నది ఏమైనా వుందా లేదా? అంత ఏడుపు క్షణంలో మాయమయి పోయిందే?"

"ఏడుపా? ఛీ. మా బావ అన్నమాటలకి బాధ పడ్డాననుకున్నారా? మే మిద్దరం ఒకళ్ల నొకళ్లు ఎంతగా ద్వేషించుకుంటామో అతని కంటే నాకే బాగా తెలుసు.. అయినా మరీ యింత దిగజారి పోయాడనుకోలేదు. అందులోను మీతో కలిసి అటువంటి మాటలు వినవలసి రావడంతో మరీ అవ మానంతో తలెత్తుకో లేకపోయినట్లయింది."

"మీ అమ్మగారు పోయి చాలా రోజుల యిందా?"

"ఆ. దాదాపు పదిహేను సంవత్సరాలవు తుంది. అప్పటికి నాకు నాలుగేళ్ళు. అమ్మ

మొహం కూడ జ్ఞాపకం లేదు...మొదటి నుండి చెప్తా వినండి. నేను పుట్టినప్పుడు వేడుకలు అవీ ఘనంగా చెయ్యలేదని, మా నాన్నగారికి వాళ్ళకి ఘనంగా మర్యాదలు జరగలేదని కోపం వచ్చి, తమ్ముడు పుట్టి నప్పుడు మా అమ్మని పంపించలేదుట. అమ్మమ్మే అక్కడికి వచ్చింది. భగవంతుడు చిన్నచూపు చూడంతో కాన్పు కష్టం అయి అమ్మ పోయింది. ఆ కబురు వింటూనే తాతగారు కూడ వచ్చారు. అప్పటికే, తమ్ముడు కూడ పోయాడు. తరువాత అమ్మమ్మా వాళ్ళు బయలుదేరి వచ్చేస్తూ నన్ను కూడ తమతో పాటే తీసుకెళ్ళి పెంచుతామని చెప్పారుట.

ఏదో అప్పో సప్పో చేసి కోరినంత కట్నం యిచ్చి పెళ్ళి ఎలాగో చేశారు కాని, తరువాత వాళ్ల అంతస్థుకి తగినట్లు ఏ ముద్దూ ముచ్చటూ జరపలేదని మా నాయనమ్మకి వాళ్లకీ కోపంగా వుండేదిట. అయినా మా అమ్మని మాత్రం ఏమి అనేవారు కాదు. రాను రాను మామయ్యా మరీ రెండు చేతులా సంపాదిస్తున్నా ఒక్కసారైనా మా అమ్మకి శుభమైన చీరైనా పెట్టలేదని వాళ్లకి కష్టంగా వుంటూండేది. అమ్మ మనసులో బాధ పడినా పైకి ఎవరికీ చెప్పలేకపోయేది. పెట్టుపోతల కారణంగానే వాళ్లకీ వీళ్లకి మధ్య బాంధవ్యం అంతంత మాత్రంగానే వుండేది. ఆ కోపంతోటేనేమో, నన్ను తీసుకెళ్ళి పోతామనగానే సరే అన్నారుట వాళ్ళు."

"నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుని ఆ భార్య పిల్లల దోరణి లోపడిపోతే దానిని మరిచి పోతావు. ఇప్పుడే యింత డబ్బయినా పొలం అయినా పిల్ల పేర వ్రాయి" అని తాత గారు మా నాన్నగారిని అడిగారుట. మొదట ఇష్టం లేకపోయినా, నాయనమ్మా వాళ్ళూ వద్దంటున్నా, కూతుర్ని అనే అభిమానం చంపుకోలేక సరే అన్నారుట మానాన్న.

"ఆ తరువాత్ర అమ్మ నగల గురించి పేచీ వచ్చింది. చెప్పానుగా వాళ్ళు బాగా వున్న వాళ్లని. అమ్మకి బోలెడు నగలు పెట్టా రుట. అవన్నీ నాకు రావాలని మా తాత గారు, వాళ్ళు పెట్టినవి వాళ్లే తీసుకుంటా మని ఆ తాతగారు కొంచెం సేపు వాదులాడు కున్నాక, అవన్నీ నాకే అని స్థిరపడింది. అయితే నేను పెద్దదాన్నయే దాకా అవి ఎక్కడ వుంచాలా అన్న సమస్య వచ్చింది. ఎవరి దగ్గరుంటే వాళ్ళే తినేసా రేమోనవి



రెండో వాళ్ళకి భయం. చివరికి అవి అమ్మి వేసి నాపేర పొలం కొంటానన్నారుట మా నాన్న. అలాగే ఆ నగలమ్మిన డబ్బూ, వాన్న ఇస్తానన్న డబ్బూ కలిపి ఆరు ఎకరాల పొలం కొని నాన్నే నాకు గార్డియన్‌గా వుండి, నెలనెలా ఖర్చుల కొంచెం డబ్బు పంపిస్తూ వచ్చారు. వీళ్ళు నన్ను పెంచిన మాట వాస్తవమే కాని, డబ్బు మాత్రం ఒక్క పైసా కూడ నాకు పెట్టలేదు.

మరి చిన్నతనంలో ఏ విషయం నాకు అర్థం అయేది కాదు కాని, జ్ఞానం వచ్చిన దగ్గర నుండీ అన్ని విషయాలూ క్రమంగా తెలుస్తూ వచ్చాయి. తెచ్చిన జీతం అమ్మమ్మ చేతిలో పోసి దాంతోటే సంసారం గడపమనే వాడు మామయ్య. అందులో, వింతేమీ లేదు. నెల జీతంతోటే గడుపు కుంటున్న సంసారాలు లక్షల కొద్దీ వుంటాయి. వచ్చిన చిక్కేమిటంటే, ఎలాగో కష్టంగా సర్దుకుపోయేటందకు వీలుండేది కాదు. అన్నీ దర్జాగా జరగాలి. ఏ విషయం లోనయినా కాస్త లోపం జరిగిందంటే పెద్ద గొడవ చేసేవాడు మామయ్య. అతని కన్న ఎక్కువగా అమ్మమ్మని నోటికొచ్చినట్లు కేకలేసి చివరికి ఏడుస్తూ పడుకునేది అత్తయ్య. నిద్ర లేచింది మొదలుకొని మళ్ళీ పడుకోబోయే దాకా, రోజు ఎలా గడుస్తుందా, ఏం గొడవలు జరుగుతాయో అనే భయంతోటే ప్రతిక్షణం గడుపుతుండే వాళ్ళం. అందుకే వండిన ఆధరవులు దగ్గర నుంచి పాలు పెరుగు అన్నీ కూడా మామయ్య అత్తయ్య బావ వాళ్ళ ముగ్గిరికే సరిపోగా మిగిలితేనే మా దాకా వచ్చేవి. అవి నాకూ తాతగారికీ వేసేసి తను ఎప్పుడూ చారూ అన్నం తింటుండేది అమ్మమ్మ. మామయ్య ఎన్నిసార్లో చూసి కూడ చూడ నట్లు వెళ్ళి పోయేవాడు.

ఇంట్లో ఎంత ఇబ్బంది పడుతున్నా, అత్తయ్యకి మాత్రం ధన లోపం మచ్చుకైనా వుండేది కాదు. ఖరీదైన చీరలు నగలు సినిమాలు షికార్లు ఒకటేమిటి కావలసిన వన్నీ దర్జాగా అనుభవిస్తూండేది. అమ్మమ్మ బ్రతికున్నన్నాళ్ళు ఒక్క పని అయినా చేసి ఎరుగదు ఆవిడ. అమ్మమ్మని వంట మనిషిలా చూస్తూ కావలసిన వన్నీ ఆజ్ఞాపించి చేయించుకోడమే కాని ఆవిడ కష్టం సుఖం ఏమీ పట్టించుకోలేదు. చెట్టంత మామ గారిని గూడ అత్తయ్య ఏ నాడూ లెక్క చెయ్యలేదు.

# అర్ధాంగి

ఒకరోజు నాకు బాగా జ్ఞాపకం. నేను గదిలో కూర్చుని చదువుకుంటున్నాను. ప్రక్కగది లోంచి మామయ్య వాళ్ళ సంభాషణ వినిపించింది.

"పొద్దుట నువ్వు మరీ అన్ని లెక్కలు అడగకుండా వుండవలసింది. ధరలు మండి పోతున్నాయి. ప్రతీదీ నిముష నిముషానికీ ప్రియం అయిపోతోంది. అలాంటప్పుడు డబ్బు చాలలేదని వాళ్ళు అనడంలో తప్పు లేదు. అయినా నేనేదో చెప్పే లోపునే నువ్వు కలగజేసుకోడం బాగుండలేదు. నాన్నగారు చాల బాధపడ్డారు" అంటున్నాడు మామయ్య

"మీ సంపాదన మీద బ్రతుకుతున్న వాళ్ళకి అర్థంలేని పౌరుషం కూడ ఎందుకు. అయినా నేనన్నదాంట్లో మాత్రం తప్పే ముంది. ఈ నెల నించీ చేసిన ఖర్చంతా అణా పైసలతో పద్దు వ్రాయమన్నాను. మనకి ఆవిడ పెడుతున్న కూర అన్నానికి ఎంత డబ్బు చాలకపోవడం ఏమిటి?" అంది అత్తయ్య.

"సరేలే. అలాంటి విషయాలన్నీ నేను చూసుకుంటాను. నువ్వు కలగజేసుకోకు" అంటున్న మామయ్య గొంతులో ఏమూలో బాధ వ్యక్తం అయింది.

"మధ్యలో నాకేమిటి? మీ డబ్బు మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. పాడు చేసుకున్న నిర్వాకం చేసుకున్న మీరే అనుభవిస్తారు" అని భళ్ళున తలుపులు తెరుచుకుని వచ్చేయబోయింది అత్తయ్య.

"ఉండు జానకీ. ఇందులో పెట్టిన డబ్బేదీ" అన్నాడు మామయ్య.

"ఆ రెండు వందలూ నేను సిల్కు షాపులో జమ కట్టించాను. ఇప్పటికే నెల పైన అయిపోయింది, యింకా ఆలశ్యం అయితే బాగుండదని ఇంతకుముందే శంకరం చేత పంపించాను. మీరు స్నానం చేస్తున్నారని చెప్పలేదు." అని మామయ్య సమాధానానికైనా ఎదురు చూడకుండా వెళ్ళి పోయినట్లుంది అత్తయ్య. మరి తరువాత మాటలు వినిపించలేదు.

ఆ విన్న నాలుగు మాటలు మాత్రం నామనస్సులో నాటుకుపోయాయి. అత్తయ్య మరీ అంత రాక్షసిలా మామయ్య కాళ్ళు చేతులు బంధించేయక పోతే అతను ఇంకా మంచివాడుగా వుండేవాడని పించింది. అసలు తను నన్ను ఎంతో ప్రేమగా చూసుకునే వాడు. ఎప్పుడూ ఓ గాను గుడ్డయినా కొని పెట్టకపోయినా ఇంట్లో వున్నంతసేపూ నాతోనే కబుర్లుచెప్తూ ఎంతో సరదాగానూ చనువుగానూ వుండేవాడు. అందుకే నాకు మొదటి నుంచీ మామయ్య అంటే అభిమానం ఎక్కువ. పై సంభాషణ విన్న తరువాత అతని స్థితికి జాలి కూడ కలిగింది. అందుకే ఆ సంగతులేవీ అమ్మమ్మకి చెప్ప కూడదనుకున్నాను. చెప్తే ఏదో వంకని ఆవిడ కోడల్ని దెప్పటం, దానికోసం ఆవిడ మామయ్యతో పోట్లాడటం, అతను బాధ పడటం ఇవన్నీ జరుగుతాయి. నేను విన్నది విన్నట్లు మరిచిపోతే ఏ గొడవా వుండదు అనుకున్నాను.

కాని ఆ మధ్యాహ్నం మరో చిత్రమైన సంఘటన జరిగింది. రోజూ మధ్యాహ్నం అందరి భోజనాలు అయింతరువాత వంటిల్లు కడిగేసి, అక్కడే ఓ మూల కొంగు పరుచుకుని పడుకునేది అమ్మమ్మ. నేను స్కూలు నించి వచ్చాక నాకు అన్నంపెట్టి పంపించి అప్పుడు ఇవతలికి వచ్చేది. అలాంటి సమయంలోనే అయివుండొచ్చు, తాతగారు కూడ చూడకుండా అత్తయ్య అమ్మమ్మ పెట్టె తెరిచి చూసింది కాబోలు. సాయంత్రం నేను స్కూలునించి వచ్చేసరికే అత్తయ్య ఎలాగో వుంది. అమ్మమ్మని అడిగితే, "ఆవిడకిది కొత్త ఏమిటి? అయినా ప్రొద్దున్నే ఏదో భాగవతం అయిందిగా పెద్దవాళ్ళనే గౌరవం అయినా లేకుండా నోటికి వచ్చింది అనేయడం, తరువాత మూతి ముడుచుకుని కూర్చోటం ఆవిడికి మామూలేగా" అంది.

మరి కాస్సేపటికి మామయ్య ఆఫీసు నించి వచ్చాడు. అతను గదిలోకి అయినా వెళ్ళక ముందే అత్తయ్య ఎదురు వెళ్ళి,

"ఎంత డబ్బు దాచుకోకపోతే ఇచ్చిన డబ్బంతా పదిరోజులకే ఎలా అయిపోతుంది. ఏమయినా అంటే నా నోరు మంచిదికాదు అంటారు. చూడండి నెలనెలా మీ వాళ్ళు వెనకేసుకుంటున్న డబ్బు." అంటూ కొంగు ముడివిప్పి నాలుగువందల రూపాయల నోట్లు మామయ్య చేతిలో పెట్టింది. మామయ్య కొయ్యబారిపోయాడు. నా కంత కన్నా తలకొట్టేసినట్లయింది.

ఈలోగా గొడవ విని వంటింట్లో ఏదో పని చేసుకుంటున్న అమ్మమ్మ వచ్చింది. సంగతి తెలుసుకుని నెత్తీనోరూ కొట్టుకుంటూ,

"అయ్యొయ్యో. అది మంజాల డబ్బే.

తీర్లు మరీ బోసిమెడతో తిరుగుతోంది. ఏదైనా గొలుసు వేయిద్దామని వాళ్ల నాన్న పంపిన దాంట్లో నెలకో ఐదూ పదీ దాస్తున్నాను. అది నీ కంట ఎక్కడ పడింది.'' అంది.

''పెట్టెలన్నీ తీసి వెతికితే కనిపించకేమవుతుంది. అయినా మేము లేనప్పుడు మారు తాళాలతో మా పెట్టె తీయడం తప్పుకాదూ. నీ కలాంటి అనుమానం ఉన్నప్పుడు మా ఎదురుగానే తీయాల్సింది'' అంటూ చింత చచ్చినా పులుపు చావని తాతగారు, అప్పుడే ఎక్కడ నించో వస్తూ, అత్తయ్య మీద ఎగిరారు.

''చేసిన తప్పు బయటపడిన తరువాత కూడ ఎందుకా కోపం. మీరు కావాలన్నప్పుడల్లా ఏదో విధంగా ఇస్తూనే వున్నారుగా. ఇంకా ఎందుకు ఇలా దొంగతనంగా దాచుకోటం. డబ్బు అయిపోయిందని అబద్ధాలాడటమూను. ఇదంతా ఎవరికిపెట్టాలని?'' అని అత్తయ్య ఎదురు ప్రశ్నించింది నిర్భయంగా.

''ఇదుగో ఆ డబ్బు సంగతి ఆయనకేం తెలియదు. మంజు డబ్బు తీసుకుంటున్న దాన్ని నేను. ఏ కొంచెమో మిగిల్చి అది జాగ్రత్త చేస్తున్న దానిని నేను ఆయనకే విషయాలేం తెలియవు. ఏం సుదర్శనం, మాట్లాడవేం. నీకూ నా మీద అనుమానంగా వుందా? ఏ ప్రమాణం చెయ్యమన్నా చేస్తాను. అది నువ్విచ్చిన డబు కాదు.'' అంది అమ్మమ్మ ఏడుపు గొంతుతో అప్పటికీ మామయ్య ఏమీ మాట్లాడలేదు.

''సరే నీకంత అనుమానంగా వుంటే తీసుకో అది.'' అన్నారు తాతయ్య

చటుక్కున మామయ్య చేతిలో డబ్బు లంజాకుని లోపలికి వెళ్లిపోయింది అత్తయ్య. మౌనంగా ఆమె ననుసరించాడు మామయ్య చేసేది లేక గదిలోకి వెళ్లిపోయి కోరలు తీసిన పాములా బుసలు కొడుతూ పచార్లు చేయసాగారు తాతయ్య.

అమ్మమ్మ, ఆవిడతో పాటు నేనూ వంటింట్లోకి వెళ్లిపోయాం. ''వచ్చేనెలలో నీ పుట్టిన రోజుకి ఓ పట్టు పరికిణీ, చిన్న గొలుసు కొందామనుకున్నాను. అవి వేసుకునే అదృష్టం నీకు, నిన్ను ముస్తాబు చేసి చూసుకునే అదృష్టం నాకు లేకపోయింది. ఎంత డబ్బు వుంటేనేం అనుభవించే గీత లేనప్పుడు'' అని అమ్మమ్మ బాధపడుతూ వుంటే నేను అయోమయంగా ఆవిడ కళ్లల్లోకి చూశాను. ఆవిడ చటుక్కున నా తల తన గుండెల్లో దాచుకుని, ''శుభమైన బట్టలయినా కుట్టించకుండా, పైసాపైసా జాగ్రత్త చేసి దాచాను. అది కూడ ఆరాక్షసి చేతిలో పడిపోయింది'' అంది హోరు హోరున ఏడుస్తూ.

నా కోసం ఆవిడంత బాధపడటం నేను చూడలేకపోయాను. ఈ తాపత్రయం అంతా నా కోసమే కదా, నేను లేకపోతే వీళ్ళు కొడుకూ కోడలూతో సుఖంగా వుంటారని పించింది.

''నా కోసం మీరు మీరు దెబ్బలాడుకోడం ఎందుకు ? నేను మా నాన్నగారి దగ్గరికి వెళ్లి పోతా'' అన్నా మెల్లిగా అలిక చేతులు తప్పించుకుని తల పైకెత్తి చూస్తూ.

''అయ్యో తల్లీ ఎంత పిచ్చిదానవే. తల్లి చచ్చి పోయాక తండ్రి పిన తండ్రితో సమానం అన్న సామెత వూరికే వచ్చిందా. ఇప్పుడు మీ నాన్నకి నువ్వసలు జ్ఞాపకం ఉన్నావా ? ఆనాడు నలుగురి ముందు ఇచ్చిన మాటని కాదన లేక నెల నెలా యింత డబ్బు పారేస్తున్నాడు కాని, మధ్యలో ఒక్క ఉత్తరం ముక్క అయినా వ్రాస్తున్నాడా ? నువ్వు ఎలా వున్నావు ఏం చేస్తున్నావు అని ఒక్కనాడైనా కనుక్కున్నాడా ? మీ అమ్మ పోయి నెలయినా తిరక్క ముందే హాయిగా మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. ఆ పెళ్లాం పిల్లలతో సుఖంగా వున్నాడు.'' అంది అమ్మమ్మ. ఆ మాట నిజమే అనిపించింది, ఎప్పుడో చూశానేమో నాన్న మొహంకూడ నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు. అలాంటి మనిషి కోసం నేను వెళ్లి పోవాలనుకోడం ఉత్త తెలివి తక్కువే అనిపించింది.

ఇంతలో మామయ్య రావడం కనిపించి అమ్మమ్మ నన్ను వదిలేసి ఏదో పనిలో మునిగి పోయింది. నేనూ ఓ మూల ముడుచుకు కూర్చున్నాను.

''మంజూ'' అన్నాడు మామయ్య. అతని కంఠం అప్పటిదాకా ఏడ్చి ఏడ్చి బొంగురు పోయి నట్లుంది. నేను మెల్లిగా తలెత్తి చూశాను. మామయ్య కళ్లు ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి.

''ఇంద నీ డబ్బు తీసుకో.'' అన్నాడు డబ్బు యిస్తూ. నేను చేయి జాపలేదు అలాగే అతని వంక చూస్తూ కూర్చున్నాను.

''నీక్కూడా నా మీద కోపం వచ్చింది కదూ.'' అన్నాడు కొద్దిగా వణుకుతున్న కంఠంతో. నేను యింకా అలాగే తెల్లబోయి చూస్తున్నాను. మామయ్య కంట్లో నీళ్లు తిరిగాయి,

''నేను ఎలాంటి వాడినయినా, పసిపిల్ల డబ్బుకి ఆశ పడే దుర్మార్గుడిని మాత్రం కాలేదు ఇంకా.'' అంటూ బలవంతాన నా చేయి తీసుకుని డబ్బు ఇచ్చేసి మాట్లాడకుండా వెళ్లిపోయాడు. అది అమ్మమ్మ చెల కిస్తూ, ''పాపం మామయ్య మంచివాడే. అతని మాట ఏదీ వినదు అత్తయ్య.'' అంటూ ఉదయం నేను చెప్ప కూడదనుకున్న సంగతి అప్పుడు చెప్పేశాను.

''నిజమే తల్లీ దానితో వాడు అనుభవిస్తున్నాడు. వాడితో పాటు మేమూను. ఇదంతా చేసుకున్న ఖర్మ... గంగి గోవులాంటి పెద్ద పిల్లాన్ని ఒక్కనాడైనా ఆదరించాడుకాదు. ఇదుగో ఈ బ్రహ్మరాక్షసి ముక్కుకి తాడేసి ఇష్టం వచ్చినట్లు ఆడిస్తోంది వాడిని'' అంది అమ్మమ్మ.

నాకు అప్పుడే తెలిసింది. మామయ్యకి కూడ మరో భార్య ఉండేదని మా అమ్మలాగే ఆవిడ చచ్చిపోతే, మా నాన్నలాగే మామయ్యకూడ మళ్లీ పెళ్లి చేసుకున్నాడని. అయితే నాలాంటి దౌర్భాగ్యులెవరూ ఆవిడ కడుపున పుట్ట లేదు కనక పోయినావిడా, ఉన్నవాళ్లు కూడా నిశ్చింతగా ఉన్నారు. తమ్ముడిలాగానేను కూడ పుట్టగానే చచ్చిపోతే హాయిగా ఉండేది......ఎంత డబ్బు వున్నా మనసు విప్పి మాట్లాడే మనిషి, నిజమైన అభిమానాన్ని పంచిపెట్టే ఆత్మీయులు లేకుండా ఈ విశాల ప్రపంచంలో ఏకాకిగా బ్రతకటం ఎంత కష్టమో....''

దుఃఖంతో గొంతు నిండిపోయి మాటరాక, మౌనంగా మోకాలుమీద గడ్డం ఆనించి, జలజలరాలిపోతున్న అశ్రుధారలు అయినా ఒత్తుకోకుండా, దూరంగా చూస్తూ కూర్చుంది.

మంజులని ఆ స్థితిలో చూసిన హరీష్‌కు మనసు విలవిలాడిపోయింది ఎలా నిగ్రహించుకోవడం సాధ్యం కాదనిపించింది.

''వింటున్నాను మంజూ, నీకేం భయం

లేదు. నేను నీవాడిని." అంటూ ఆమెని దగ్గరగా తీసుకుని ఆ కన్నీరు ఒత్తాలని ఆమెకి ధైర్యం వచ్చేలా ఇంకా ఎన్నో చెప్పాలని అనిపించింది. కాని ఏదో చెప్పలేనిభయం అతని గొంతు నొక్కేయడంతో, ఒక్క మాట కూడ గొంతు పెగుల్చుకునిరాలేదు. ఆవేశాన్ని అదుపులోకి తెచ్చుకోగలిగిన వివేకం ముందుకువచ్చిన చేతిని వెనక్కి తీసుకునేలా చేసింది. తన నిస్సహాయతకి లోలోపలే సిగ్గుపడుతూ, చేతికి అందిన గడ్డిపరకలని కసిగా తుంపులుచేస్తూ దూరంగా ఎటో చూస్తూ కూర్చున్నాడు. ఆ పరిసరాలని చుట్టివున్న సంజె వెలుగు క్రమంగా అంతరించిపోతోంది. చూస్తూండగానే నలుమూలలనించీ చీకట్లు అలుముకుంటున్నాయి.

వోదార్చేవారు లేనప్పుడు దుఃఖం దానంతటదే ఉపశమిస్తుంది. కొద్ది క్షణాలలోనే మామూలుగా అయిపోయి కళ్ళుతుడుచుకుని, "మీకు చికాకుగా ఉందేమో. ఏమిటో దుఃఖం ఆగలేదు."

"అబ్బే అదేంలేదు. మిమ్మల్ని ఎలా వోదార్చాలో తెలియక, నా చేతకాని తనానికి సిగ్గుపడుతూ కూర్చున్నాను" అన్నాడు కళ్ళతోనే సానుభూతి కురిపిస్తూ.

వోసారి గొంతు సవరించుకుని మళ్ళీ మొదలుపెట్టింది పంకజ.

"సరే. అంత గొడవ జరిగి చివరికి నా చేతిలో పడిన డబ్బు అమ్మమ్మ అనుకున్నట్లు ఖర్చు చెయ్యడానికి వీలులేకపోయింది. ఆతరువాత. వారం రోజులకే తాతయ్యకి టైఫాయిడ్ రావడంతో మందులకి వాళ్ళకి ఎంతో డబ్బు ఖర్చయింది. మొదట వద్దన్నా,గత్యంతరంలేని పరిస్థితిలో అమ్మమ్మ నా డబ్బు కూడ వాడుకుంది. ఆయనకి మరీ ఎక్కువగా ఉన్న రోజులలోనే, ఎలాంటి గుర్తింపులేకుండా చల్లగా నా పుట్టినరోజు వెళ్ళిపోయింది. తరువాత జ్ఞాపకంవచ్చి ఏమీ చెయ్యలేకపోయానే అని అమ్మమ్మ ఎంతో బాధపడింది. అదివిన్న మామయ్య ఏమనుకున్నాడో, ఎవరికి చెప్పకుండా వో గొలుసు కొని తెచ్చి తన చేతులతోనే నామెడలోవేశాడు. నేను తెల్లబోయి చూస్తూంటే—

"ఏమిటే అలా చూస్తావు? మామయ్యకివన్నీ కూడ తెలుసా అని ఆశ్చర్యంగా వుందా?" అంటూ నన్ను దగ్గరగా తీసుకుని, నా నుదిటిమీద ముద్దు పెట్టుకున్నాడు. అక్కడేవున్న అమ్మమ్మ ఆనంద భాష్పాలు ఒత్తుకుంది. అప్పటిదాకా దాని సంగతి తెలియని అత్తయ్య ఒక్కక్షణం కొయ్యబారిపోయి, అంతలోనే తేరుకున్ని ఇంక "కాబోయే కోడలికి మా మొదటికానుక" అంటూ నలుగురికీ చెప్పింది. నన్ను కోడలిని చేసుకోవాలని అదివరకు మనసులో వుందేమోకాని పైకి అనటం అదేమొదలు. అప్పటికి నాకు పదమూడేళ్ళు ఉంటాయి. బావకి పదిహేడో ఎన్నో. ఇంతక్రితం బావ అన్నట్లు చిన్నప్పటినుంచీ ఒకే దగ్గర పెరిగినా మాకు ఒకరిమీద ఒకరికి అభిమానం అనేది కలగలేదు. అత్తయ్యమాట విన్న తరువాత అంత చిన్న వయస్సులోనే బావ అంటే అసహ్యం కూడ కలగడం మొదలుపెట్టింది. మళ్లీఅత్తయ్య అలాంటి మాటేదైనా అన్నప్పుడల్లా,

"ఛీ, ఛీ. బావని నేను చేసుకోను" అనేదాన్ని.

ఆమాటలు విని ఒక్కోసారి కాస్సేపు మూతి ముడుచుకునేది. ఒక్కోసారి అదో నవ్వులాటగా తేల్చేసి, "నువ్వు. చేసుకోనన్నా, వాడు బలవంతాన నీ మెడలోకి కట్టేస్తాడు" అనేది. నేనూ ఏదో సమాధానం చెప్పేదాన్ని.

మరి కాస్త జ్ఞానం తెలిశాక, వోసారి అమ్మమ్మ చాటుకిపిలిచి, "అస్తమానూ దానితో వాదన వేసుకోకమ్మా నీ కిష్టం లేదని తెలిస్తే అదెంతకయినా తెగిస్తుంది. ఇలాంటి వాళ్ళని మంచిగానే లొంగదీసుకోవాలి. నీ కెందుకు. నువ్వేం మాట్లాడకు. నా కంఠంలో ప్రాణంవుండగా ఈ పెళ్ళి జరగనివ్వను" అంది.

అప్పటి నించి అసహ్యాన్నంతా లోలోపలే అణుచుకుంటూ వాళ్ళతో సరదాగానే ఉంటున్నాను.

మరో రెండేళ్ళకే అంటే నేను స్కూల్ ఫైనల్ చదువుతుండగా తాతయ్యపోయారు. ఆ దుఃఖంతోటే అమ్మమ్మ మంచం ఎక్కింది. అప్పుడే ఓసారి నాన్నగారువచ్చిచూశారు. మొదట మే మిద్దరం ఒకరి నొకరు గుర్తుపట్టనేలేదు. మామయ్య ఫలానా అని చెప్పాక ఏం చెయ్యాలో ఎలా పలకరించాలో తెలియక సిగ్గుపడుతూ దూరంగా నిలబడిపోయాను. నాన్నగారే దగ్గరగావచ్చి నాతల నిమురుతూ, "ఏమ్మా, బాగా చదువుకుంటున్నావా?" అన్నారు. నేను తలవూపాను. అంతే. ఆ తరువాతకూడ ఆయన నాతో ఎక్కువగా మాట్లాడలేదు. మాట్లాడిన నాలుగు మాటలయినా పొడిగా ఏదో బాధ్యత తీర్చుకోటానికన్నట్లు ఉన్నాయికాని అందులో వాత్సల్యం ఆప్యాయత నాకేం కనిపించలేదు. ఆ రాత్రి వుండి, మర్నాడు ఉదయమే ఆయన వెళ్ళిపోయారు. వెళ్ళిపోయేముందు నేనూ, మామయ్యా, అత్తయ్యా అందరం ఉండగా ఇన్నాళ్ళూ నా పొలంమీదవస్తున్న డబ్బులో నాకు పంపించగా మిగిలితే, ఆ పొలానికి ప్రక్కనే మరో ఆరెకరాలు కొనాలనుకుంటున్నానని చెప్పారు. అత్తయ్య మొహం సంతోషంతో విప్పారింది. అందరి కంటె ముందు ఆవిడే నాన్నగారి ఉద్దేశ్యం బాగుందని మెచ్చుకుంది.

నాన్నగారు వెళ్ళిపోయాక నేను వెళ్ళి అమ్మమ్మ పక్కలో కూర్చున్నాను. ఏదోచెప్పాలనుకుంటున్నానని గ్రహించి, "ఏమిటి, నీ నాన్న ఖబుర్లు" అందావిడ.

పొలం సంగతి చెప్పి, "వచ్చే ఏడు ఏంచేద్దామనుకుంటున్నావని అడిగారు. కాలేజీలో చేరతానని చెప్పాను. కాలేజీ ఫీజు అది ఎక్కువ ఉంటుంది. కనక ఇకమీదట ఎక్కువ డబ్బు పంపిస్తానని చెప్పారు" అన్నాను.

"ఏమిటో, డబ్బు పంపిస్తే తన బాధ్యత తీరిపోతుం దనుకుంటున్నాడు కాబోలు. కూతురువన్న ప్రేమాభిమానాలు ఏకోశానా లేనట్లున్నాయి. నిన్ను తీసుకు వెళ్తానని మాట వరసకైనా అంటాడేమో పంపించేద్దామనుకున్నాను" అంది

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "అదేమిటి?" అన్నాను ఆవిడ మెడని కౌగలించుకుని.

"అవునమ్మా. ఇప్పుడు నీకు జ్ఞానం వచ్చింది. ఎక్కడున్నా సర్దుకు పోగలవు. నేనూ పెద్దదాన్నయి పోయాను. బొత్తిగా వోపిక ఉండటంలేదు" అంది.

"అందుకే, ఇప్పుడు నిన్ను విడిచిపెట్టి నే నెక్కడికీ వెళ్లను. చిన్నప్పుడంతా నువ్వు నాకు చేశావు. ఇప్పుడు నేను నీకు చేస్తాను. నన్ను ఎక్కడికీ పంపించేస్తా ననకు." అన్నాను.

"పనికోసం కాదమ్మా. మీ తాతయ్యలాగే నేనూ ఇవాళో రేపో రాలిపోతాను. ఎదిగిన పిల్లని ఈ యింట్లో ఎలా ఉంటావో ననే నా భయం. చూసినా చూడకపోయినా మీ నాన్నదగ్గరయితే అదో దారి." అంది.

"నీకేం ఫర్వాలేదు. ఎంత డబ్బయినా పెద్ద డాక్టర్లని పిలిచి నీ ఆరోగ్యం బాగు చేయిస్తాను. ఇంక ఇక్కడ ఉండటం సంగతంటావా ..... నువ్వుండగా నాకేం భయం లేదు." అన్నాను.

"పిచ్చిపిల్ల" అంటూ నన్ను యింకా దగ్గరికి తీసుకుంది.

(సశేషం)

# నేను చెడిపోలేదు



కోమలాదేవి

కమల ఇంకా నిద్ర లేవలేదు.

తెల్లవారి ఆరు గంటలు దాటింది— కానీ ఆమె తన గది విడిచి ఇవతలికి రాలేదు. సాధారణ కుటుంబాలల్లో యింటి కోడలు కొన్ని సార్లు ఆలస్యంగా తలుపు తెరచుకుని వచ్చినా ఆశ్చర్య పోరు. ఏదో సుస్తీ చేసిందనో, సరిగా నిద్ర పట్టక తెల్లవారి నిద్రపోయి— మెలకువ రాలేదనో సరి పెట్టు కుంటారు. కానీ అది వేరే సంగతి. కమల కాపు రానికి వచ్చి ఐదు సంవత్సరాలు గ్రుడున తిరిగి పోయినా, ఆమె అంత ఆలస్యం చేయటానికి సాహసించలేదు. అందుకు కారణాలు కొల్లలు.

ఆ రోజు ఆరు గంటలు దాటింది.

అత్తగారు కాళికా స్వరూపిణి య్యైంది. రోజూ ఆ వేళకి ఇల్లంతా శుభ్రంగా వూడ్చి వంటిల్లంతా కడిగి— వంటకు గిన్నెలన్నీ శుభ్రం చేసి వుంచి— పాలు పితికిన చెంబు కుంపటి ప్రక్కగా పెట్టి నూతి దగ్గర శుభ్రం చేస్తూనో, పూజకు పువ్వులు కోస్తూనో అగుపించే కోడలు ఆనాడు నిద్ర లేవలేదు. ఏందుకో — ఏం కారణమో — యంత్రంలా టంచనుగా పనులన్నీ వ్రకమంగా సమయానికి చేసే కమల ఆనాడు లేవలేదు — అని ఆలోచించటానికి బదులు ఆమె ఉగ్రురాలై— ఈ అపరాధాన్ని క్షమించరాదని నిశ్చయించుకుంది. ఇంకా నిద్ర మత్తు వద లని కళ్ళు విస్ఫులింగాల్ని కురిపిస్తు న్నాయి. క్రోధం జడలు విప్పుకున్నలా ఆమె కుంతలాలు చిందర వందరగా వీపు మీద పరచుకుని వున్నాయి. ముఖం రక్త వర్ణం దాల్చింది. విసురుగా వెంట్రుకలు ముడి వేసికొని కొంగు నడుములో దోపుకుని గబ గబ కోడలి గది దగ్గర కెళ్ళి ధన ధన మని తలుపు బాది బిగ్గరగా అరచింది "ఏమే — ఇంకా మెలకువ రాలేదా ? పనంతా ఎవడు చేస్తా డనుకున్నావు? రాణీలా పవ్వళిస్తే కుదరదు. లేలే — ఆలస్యమై పోయింది..."

లోపల్నుంచి ఏ జవాబు లేదు.

ఆమె మరి కాస్త బిగ్గరగా తలుపు తట్టింది.... తెల్లవారగానే శాపనార్థాలు మొద లెట్టింది. తలుపు ఇవతలనే మెటికలు విరిచింది. అనరాని మాట లన్నది. ఇక జాగు చేస్తే చీపురుకట్టే గతి — ఆ విషయం కమలకు దెలుసు. ఐనా ఆరోజు కమల తలుపు తెరచు కుని — భయంతో కంపించి పోతూ బెదరిన చూపుల్ని నేలకేసి కేంద్రీక రించి, కొంగు నిండుగ కప్పుకుని — అత్తగారి ఆ విషబాణాల నుండి తను తాను రక్షించు కోటానికి ఆ కొంగులో ముడుచుకు పోయి త్వరగా గది బైటి కొచ్చి అంతకన్నా వేగంగా పెరటి వైపు వెళ్ళ లేదు.

ఆమె కోపం ఆకాశాన్నంటు తోంది.

"ఏమిటే గోల" మామగారు — గొణుక్కుంటూ అటుకేసి మళ్ళారు. ఆయనకు వేళకు తిండి, రెండు పూటలా వేడినీళ్ళ స్నానం, సాయంత్రం అలా షికారు వుంటే ఇక ఏమీ అక్కర్లేదు. పాకిస్తాన్ దాడి జరిపిన రోజుల్లోనూ, కొడుకు ఇంటికి రాక వీధుల వెంట తిరిగి తిరిగి ఇంటి కొచ్చి భార్యను హింసించిన రోజుల్లోనూ, ఇరవై నాలుగ్గంటలు ఇంట్లోనే వుండి తన భార్య కోడల్ని ప్రతి విషయంలో సాధించే రోజుల్లోనూ ఆయన ఒకే తీరులో మార్పు లేకుండా యంత్రంలా జీవితాన్ని వెళ్ళ బుచ్చుతున్నాడు.

ఆయనకు తెలుసు — ఆ యింట్లో తనకు అంత కన్నా స్థానం లేదని.

ఏ విషయాలల్లోనైన కల్పించుకుంటే — భార్యకు గాని, కొడుక్కు గాని, బ్రతుకు చెడి ఇల్లు జేరిన కూతురికి గాని సుతరామూ యిష్టం లేదు. దాని క్కారణం అతనిలోని మంచితనం— చెడు జరుగుతుండగా చూచి సహించలేని గుణం — పరోపకార చింతన. ఆయన కల్పించుకుంటే బాగు పడ్డట్లే. ఇక కోడలు నెత్తి కెక్కి కూచోదూ? వేళకు అన్నీ సమకూరుతాయా — పని మనిషి కిచ్చే జీతం మిగుల్తోంది. ఈ కోడలు పని దానికి ముప్పూట్లలా భోజనం పెట్టి గుడ్డ లిస్తుంటే సమయానికి అన్నీ అమరుతున్నాయి ఏం— వూరికే చేస్తోందా! దాని తిండికి, బట్టకు ఎంత ఖర్చు కావటం లేదు? దీనికింత ఖర్చు పెడ్తూ పైగా పని మనిషి కూడానా? అప్పటికి రెండు పూటలా చెయ్యి కాల్చు కునేది అత్తగారే— ఇక పై పని భాగ్యానికి ఇంతకన్నా ఏం కావాలీ అట!

కోడలికి జరుగుతున్న అన్యాయాన్ని చూచి సహించలేక ఎన్నో సార్లు జోక్యం కల్గించుకుని ముగ్గురి చేత చీవాట్లు తిని మవునం వహించటం నేర్చుకున్నాడు. ఒకటి రెండుసార్లు వియ్యంకుడికి రాసి కోడల్ని పుట్టింటి వారు కొన్నాళ్లపాటు వుంచుకుని పంపేలా చేశాడు. కోడ లక్కడున్నంత కాలం డబ్బు పంపేవాడు — వారికి భారం కాకుండా వుండటానికి. పెన్షన్ పుచ్చుకున్న తర్వాత ఈ సాయం కూడ చేయలేక పోయాడు. బీదరికంలో అల్లాడు తున్న తలిదండ్రులు కమల రాక పోవటమే మంచి దనుకున్నారు. దాని ఖర్మ అని వూరుకున్నారు. వో నెల రోజులపాటు పుట్టింట్లో వుండి తన బాధనంతా తల్లి దగ్గర చెప్పుకుని వోదార్పు నొంది తిరిగి ఆ నరకంలో ప్రవేశించటానికి ధైర్యం పొందే అవకాశం కూడ ఆమెకు లేదు. తన వాళ్ల గతి లేని వాళ్లని అత్తగారు రోజు కొక సారైనా దెప్పుతుంది. దాని క్కారణం తన కొడుకే అని ఆమెకు తెలిసినా తెలియనట్లే నటించేది.

అత్తను — ఆడ బిడ్డను త్రాసులో వేసి తూస్తే సరి సమానంగా తూగ గలరు.

కమల కున్న కష్టం ఏమిటి? భర్త సరిగా చూచుకోడు. ఉండవలసిన వ్యసనాలన్నీ సంతరించుకున్నా డతను. అతను కొన్ని నెలలు యింటికే రాడు. కావలసినప్పుడొచ్చి డబ్బు పట్టు కెళ్లటం తప్ప మిగతా సమయాల్లో యిల్లు, భార్య గుర్తుకురారు. కట్న రూపంలో వచ్చిన నాలుగెకరాల మాగానీ పై వచ్చే ధాన్యపు తాలూకు డబ్బు కమల చేతిలో పడీ పడక ముందే అతను వస్తాడు. తల్లి అండలో — కమలను హింసించి ఆ డబ్బు లాక్కు పోతాడు. డబ్బులేని సమయంలో ఉన్న కొద్ది పాటి నగల్లో ఏదో ఒక నగ, అవీ అయిపోగానే ఏదైన మంచి చీర — అవీ పాతబడగానే — వెండి చెంబూ పళ్లెం...... ఇలాగే అతని కోరికలు అనేక రకాలుగా మారు తుండేవి.

అన్నీ అయి పోయిన తర్వాత — కమలలో కూడ అన్నీ అడుగంటి పోయాయి. అస్థిపంజరం మీద — లాగుతూ పరచిన చర్మంలా తయారైంది. ఏమీ మిగల్లేదు. గుంటలు పడిన ఆ కళ్లు వెలితిగా అతి భయంకరంగా అగుపించేవి. పాలిపోయిన పెదాలు నిర్జీవంగా నిశ్చలంగా వుండేవి. మూగ దానిలా మౌనంగా వుండటం నేర్చుకున్న ఆమె కంఠస్వరం ఆ యింట్లో ఎప్పుడో గాని వినబడదు. అదీ అత్త — ఆడబిడ్డల పిలుపుకు జవాబు మాత్రమే. ఆమె మాట్లాడదని ఈ మాటకారులకు కోపం! కమల మాట్లాడటం మర్చిపోయింది.

ఎన్నాళ్లు? ఎన్నాళ్లిలా గడవాలి—

భర్త యింటి కొచ్చి నాల్గు నెలలు దాటాయి. భర్త కోసం నిరీక్షించటం మానివేసి చాల రోజులైంది. ఆశతో అతని రాకకోసం నిరీక్షించే రోజుల్లో అతగాడు వచ్చి బల్లెంతో గుండెల్లో పొడిచినట్లు మాట్లాడి, ప్రవర్తించి కావలసినది పట్టు కెళ్లేవాడు. రాను రాను పరోక్షంగా భర్త రాకపోతేనే మంచి దనుకునేది. అతను వస్తాడు — వచ్చే రోజులు దగ్గర కొస్తాయనగానే కమలకు కంపరం పుట్టేది. భయంతో గజ గజ లాడి పోయేది. గాలి దుమారం — గాలి వానలా వచ్చి నానా రభసచేసి క్షణాల్లో వెళ్లి పోతాడు. అతని రాక పోకల కేమాత్రం అడ్డులేదు. కొడుకిలా నాశనం కావటానికి కారకురాలు కమలే అని వాళ్ల అభిప్రాయం. మరి పెళ్లికి ముందు కారకు లెవరో మాత్రం వాళ్లు ఎప్పుడూ అనలేదు.

ఎన్ని రోజులు గడిచి పోవాలి? ఇంకా ఎంత కాలం వోర్చుకోవాలి.

కమల కిక చేత కాలేదు. ఎవరికోసం బ్రతకాలి? ఈ ఇంటి చాకిరీ తప్ప వైవాహిక జీవితంలో తను అనుభవించింది ఏమీలేదు. ఆశించినవన్నీ స్వప్న జగత్తులో కలిసి పోయాయి. వర్షించని మేఘాల్లా తేలి పోయాయి. ఎందుకు బ్రతకాలి?

అమ్మ, నాన్న — తన సుఖం కోసం తమ కున్న ఆ నాలుగెకరాలు తనకిచ్చేశారు. ఉన్న దాన్లో గుట్టుగ గడువు కొస్తుంటే — మళ్లీ తన సౌఖ్యంకోసం అల్లుడు కోరినవి తాహతుకు మించిన నైనాసరే యిచ్చాడు. అన్నయ్యకు వయసు మించి పోతుంది. వివాహం చేసికోలేదు. తన కొచ్చే నూట ఏభై రూపాయలతో తలి దండ్రులనే చూస్తాడా, చెల్లెలి సంసారాన్నే నిలుపుతాడా, తాను పెళ్లాడి సంసార సాగరంలో మునిగి పోతాడా — ఎన్నని చేయ గలడు? అందుకని పెళ్లి చేసికోలేదు.

బి. ఎ. చదివిన కుర్రాడు. రూపంలో లోటు లేదు. తండ్రి తహసిల్దారు. బాగా ఉన్నవారే నని కమల జీవితం మూడు పువ్వు లారు కాయలు గా వర్ధిల్లా లన్న పేరాశతోనే ఆనంది కూతురికి పెళ్లి చేశారు.

చెడుత్రోవలు బట్టిన వాడికి త్వరగా పెళ్లి చేయాలన్న ఆరాటం కొద్ది కమలను నిమిషాల మీద నిశ్చయించుకున్నారు. "మూడు తరాలకు సరిపడేటంత వుండగా —ఇంకా దేనికి? ఆ పొలం రాసిస్తే చాలు"— అని అన్నారు. సబ్ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్న తండ్రికి బాగానే తోచింది. అంతకు మించిన పొలం కొనవచ్చు నను కున్నారు గానీ— కమల పెళ్లయిన ఏడాదిలోగానే గిట్టని వాళ్లు కేసు పెట్టారు — లంచాలు తీస్తున్నాడని. దాంతో రిజైన్ చేయవలసి వచ్చింది.

మారు మూల పల్లె జేరి తల దాచు కున్నారు.

తను అటు పోలేదు. అక్కడ ఏమీ లేదు. తనొక గుది బండ.

ఇక్కడ అంతకన్నా ఏమీ లేదు! కమల తీవ్రంగా ఆలోచిస్తోంది. అంతగా ఆమె ఎప్పుడు ఆలోచించలేదు. ఏమి జరిగిందో గాని కమల తనలో తాను లేదు.

అంతకు క్రితం రోజు భర్త నుంచి ఉత్తర మొచ్చింది.

ఎప్పటికి లాగానే సంబోధన లేదు. కానీ ఈ లేఖ ఘాటుగా వుంది.

"ఎల్లుండి తెల్లవారు జాము బండికి వస్తున్నాను. నీ నాల్గు ఎకరాలు బేరం పెట్టాను. వచ్చి—అమ్మి— సంతకాలు పెట్టించి డబ్బు తీసి కొని వెళ్లి పోతాను. ఇది ఆఖరు సారి..... ఇక నీ దగ్గర ఏమీ లేదను కుంటాను— పుస్తెలు తప్ప. నీతో అవసరం తీరి పోయింది. కాన నీవు మీ యింటికి వెళ్లి పోవచ్చును......"

"కట్టె — కొట్టె — తెచ్చె" అన్నట్లు ఎంత సులువుగా రాశారు? వచ్చి — అమ్మి — పెట్టించి — పోతారా? ఇంత వరకు మౌనం దాల్చింది. తను ఒక వేళ పుట్టింటి కెళ్లినా ఎవరాదు కుంటారు? తన కున్నదంతా ధారపోసినా తృప్తి లేదు — అవసరం తీరింది — ఒకప్పుడు మాత్రం ఏం అవసరం! తన వాళ్ల బాధలు తను చూడ లేదు. ఉన్న దంతా తనకోసం ఖర్చు పెట్టారు. భూమి తన కిచ్చారు— ఆ భూమిని అమ్మి అతని చేతిలో డబ్బు పోయాలా? తను — తనవారు పేదరికంలో— ఆకలి బాధలో మునిగి వూపిరాడక బాధపడ్తుంటే అతను ఆ డబ్బుతో విలాసంగా ఎవతెకో మూట గట్టి యిచ్చి ఆ పాప పంకంలో కులాసాగా కొన్ని రోజులు గడుపుతాడా?

ఈ సారి తప్పక మారి పోయి వస్తారు. తనను భార్యగా గౌరవించి సంభావిస్తారు, అన్న ఆశను పెంచు కుంటూ గడపిన జీవితం మోడువారిందే గానీ ఎన్నిదినాలు గడిచినా పుష్పించ లేదు. ఎక్కడా ఆశా కిరణం ప్రసరించలేదు. రాను రాను జీవితం దుర్భరమై పోయింది. లాభం లేదు. తను ఒక నిర్ధారణకు రావాలి.

ఈ నరక కూపంలోంచి బయట బడాలి.

ఆ రాత్రి చాలాసేపు ఆలోచించింది. ప్రమిద వెలిగించుకుని ఆ దీప కాంతిలో సుదీర్ఘ లేఖ వ్రాసింది.

తను చేయవలసిన దేదో రేపురాత్రికి చేయాలి. అంతే ఆలసించి లాభం లేదనుకుని నిద్ర పోయింది కమల.

తెల్లవారి లేచింది. పెరట్లోకి వెళ్ల టానికని లేచిన మామగార్కి నీళ్లం దించింది. ఆయన రాగానే ఆ ఉత్తరాలు అతని చేతుల్లో పెట్టింది. భర్త తనకు వ్రాసినది కూడ అందులో వుంది.

ఆయన కోడలు కేసి విస్తు పోయి చూచారు.

"ఆ ఉత్తరాలు చూడండి. మీకు తోచినట్లు చేస్తే ఎంతో కృతజ్ఞురాల్ని" పంచె మడతల్లో అవి దాచుకుని ఆయన వెళ్లిపోయారు.

కమల హృదయం ఎంతో తేలిక పడింది. తనకు తెలుసు ఆ యింట్లో తన క్షేమం కాంక్షించేవారు ఒక్క మామగారేనని. వారి చేతుల్లో పెట్టింది. అంతా సవ్యంగా జరుగుతుందన్న దృఢ నమ్మకం తనకుంది.

ఆ వేళ అతి సాధారణంగా గడిచిపోయింది. కానీ కమలకు మాత్రం ఆ రోజు అసాధారణంగానే వున్నది. మరుసటి రోజు చేయవలసిన పనులు అత్తగారు యీ రోజే చెబుతోంది. కారం పొడి దంచాలి. మినపప్పు రుబ్బాలి. సామాను కొట్టు శుభ్రం చెయ్యాలి. కమల తనలో తాను నవ్వుకుంది. రేపటి మాట. రేపటికి తనెక్కడుంటుంది! ఈ కష్టాలకు అతీతంగా ఎక్కడో దూరంగా అతిదూరంగా, నిశ్చింతగా వుంటుంది. ఇక బాధలకు వేదనకు తను భయపడ నవసరం లేదు. భర్త వస్తాడని భయంతో కంపించ నవసరంలేదు. తెల్లవారి నాల్గుగంటలకు లేచి గృహ కృత్యాలలో నిమగ్నం కానవసరం లేదు. ఇన్ని రోజులుగా మారని జీవితం రేపటికి ఒక్కసారి తలక్రిందులౌతుంది. నాల్గు గోడల మధ్య నలిగిపోతున్న తను రేపటితో స్వేచ్ఛ పొందుతుంది. ఎంత హాయి. అది తలంచుకునే కొద్దీ కమల హృదయం ఎంతో తేలికపడింది. ఎక్కడ లేని సంతోషం హృదయా న్నావరించింది.

ఆ రాత్రి పదిగంటలకు తన గదిలో జేరి తలుపు వేసికొంది. దాంతో బాహ్య ప్రపంచంలో తెగ్రతెంపులు చేసికొన్నట్లు భావించింది. తనకున్న చీరల్లో శుభ్రమైన చీర కట్టుకుంది. తల దువ్వుకుంది. గోడకు వ్రేలాడుతున్న జానెడు అద్దంలో ముఖం చూచుకుంది. ఎన్నాళ్లయిందీ తను తన ప్రతిబింబాన్ని పరీక్షగా చూచుకుని. తన అందం ఏమైంది? ఆ కళ్లలోని తళుకు, ఆ కపోలాలల్లోని కెంపులు, ఆ పెదిమల మీది అరుణిమ, ఆ చిన్ని నునుపైన గడ్డం మీది లావణ్యం ఉషః కాలారుణ రేఖల్ని ప్రతిఫలింపజేసే ఆ స్నిగ్ధ ఫాల భాగం ఈ ఐదు సంవత్సరాల సాంసారిక జీవితంలో అవన్నీ కరిగిపోయాయి. మిగిలింది కనబడని హృదయం, ఎముకలు. కనిపించే చర్మం ఎండిపోయి నిర్జీవంగా వున్న తన ముఖంలో ఒక్క బొట్టుకే జీవం వుంది. కళకళలాడుతుందా లలాట భాగంలో. కుంకుమను చంద్రబింబంలా దిద్దుకుని ఆమె పడుకుంది. అమ్మ, నాన్న, అన్నయ్య కళ్లలో మెదిలారు. ఇప్పటికి తనవారికి నిష్కృతి. ఇంతటితో అన్ని సమస్యలు తీరి పోతాయి. హృదయం ప్రశాంతమైంది. భగవంతుని ధ్యానిస్తూ కళ్లు మూసు కుంది.

ఆ కళ్లు మూయటం తెల్లవారినా మెలకువ రాలేదు. ఎలా వస్తుంది! ఆమె సుదీర్ఘ నిద్రలో మునిగి వుంది.

అత్తగారి కేకలు అధికమైనై. "వాడొస్తాడని ఏమన్నా భయముంది. అందుకే ఇదంటే వాడికంత ఏవగింపు, భర్తను అదుపులో పెట్టుకోగల శక్తిలేని ఆడదీ ఒక ఆడదేనా? ఎప్పుడూ ఏడుపు మొగమే. దరిద్రమంతా దీంతోనే వచ్చింది. తలుపు దియ్యవేమే..." దాదాపు పావు గంటసేపు అరచినా లాభం లేకపోయింది. "ఈ వేళ నీ రక్తం కళ్ల చూడకపోతే అప్పుడను.." ఆమె కదిలింది. కమల యింతసేపు అంత ధైర్యంతో తలుపు గడియ తీయలేదని మామగారు అనుకోగానే ఏదో స్ఫురించింది. చటుక్కున లేచి కూచున్నాడు. నుదురంతా చెమటతో తడిచిపోయింది. గుండెలు దడ దడ లాడాయి. అడుగు పడలేదు. మంచం మీద అలాగే కూచున్నాడు. ఈసారి కమల గది తలుపు కూతురు బాదుతోంది.

అతని ఆయాసం అధికమైంది. "ఇదిగో...ఇలారా.. కమల నీతో ఏమైన చెప్పిందా? వాడు ఈ బండి కొస్తాడుట.."

ఆమె లోపల్నుంచే జవాబిచ్చింది. "ఆ..చెప్పింది.. పొలం బేరం పెట్టినట్లు చెప్పింది. దీంతో లేని సుఖం దాని పొలం

మంచి వస్తుంది...అంతే..

వంటింట్లో ధనధనమని గిన్నెల చప్పుడు. ఆతడు ధైర్యం చేసి లేచి నుంచున్నాడు. వెళ్ళి తలుపు దగ్గర కెళ్ళి ఆప్యాయంగా పిల్చారు. "కమలమ్మా తలుపు తీయి తల్లీ" కూతురు తండ్రి కేసి వెగటుగా చూచింది. "నువ్వు రావాలా నాన్నా. ఎవరైన చూస్తే నవ్విపోగలరు. ఆవగాత్రం మేము లేపలేము" అంది మూతి చేతులు త్రిప్పుతూ.

అత్తగారు లోపలినించి దూసుకు వచ్చింది. "సిగ్గులేదూ. దానికి లేకపోతే.. ఛీ..ఛీ..అవ్వ.. మామగారితో వందిమాగతులు..."

భార్యను మాట్లాడ నివ్వలేదు. ఆయన మౌనంగా వుండదల్చుకోలేదు. "గొడవ చెయ్యకు..ఇలారా..చూద్దాం.." భార్య చెంగట్టిగ పట్టుకుని సామాను కొట్టులోకి తీసుకెళ్ళాడు. ఆ గదిలోంచి కమల గదికి వెళ్ళటానికి తలుపుంది. అది రెండువైపుల గడియ వేసుంటుంది గానీ తలుపుకు సందులున్నాయి. ఆమె ఆత్రంగా చూచింది. మంచం మీద కమలలేదు!

ఆమె నోటమాట రాలేదు. గుండెల

మీద చేతులుంచుకొని భయవిహ్వలయ్యై భర్త కేసి చూచింది. ఆయన చూచారు. ఔను కమల లేదు. ఆ కన్నంలోంచి కనబడే గదిలో కమల జాడలేదు. ఇద్దరు మసక వెల్తుర్లో సరిగా అగుపించటం లేదేమో అని పెరటి వైపుకు పరిగెత్తారు. కమల కిటికీ తలుపులు మూసి వున్నాయి. అటు వేపు నించి కిటికీ రెక్కలు పగులగొట్టి చూచారు. ఆ హడావిడికి ఇద్దరు ముగ్గురు పొరుగు వాళ్ళు చేరారు. కమల ఏమైంది? అందరూ అత్తగారి కేసి అనుమానంగా, చూస్తున్నారు!

ఆ కిటికీ కన్నంలోంచి చూచారాయన. కమల గోడ వైపు మంచం అవతల నేల మీద పడివుంది. ఆమెలో చలనం లేదు.

ఆయన రెండుచేతుల్లో ముఖాన్ని కప్పుకుని 'తల్లీ కమలా..'అంటూ హృదయం ద్రవించి పోయేలా రోదిస్తూ ఇవతలి కొచ్చారు.

అత్తగారు శిలాప్రతిమయ్యై మెట్ల మీద కూచుని వుంది. ఆమె చూపులు భయంతో నిండి వున్నాయి.

తలుపులు ఎలాగో తెరచి లోపలికి ప్రవేశించారు. కమల నిశ్చలంగా పడి వుంది. ఎవరో బండి కోసం పరిగెత్తారు. ఈ లోపల గదినంతా కలియజూచారు.. మంచం క్రింద చెంబు, గ్లాసు వున్నాయి. వాని ప్రక్క నిద్ర మాత్రల సీసా వుంది. ఆ సీసా అంతా ఖాళీ! అది చూచిన మామ గారు గుండెలు బాదుకుంటూ కూచు న్నారు. ఎవరో తలగడ ఎత్తారు.

"నేను ఆత్మహత్య చేసికొంటున్నాను. నా మరణానికి ఎవ్వరు బాధ్యులు కారు." కమల. అని వ్రాసిన పుత్తరాన్ని మామ గారి చేతిలో పెట్టారు.

ఆయన దాన్నందుకుని భార్య చేతి కిచ్చాడు.

ఆమె శాపనార్థాలు మొదలెట్టబో యింది...కానీ భర్త నుదురు బాదుకుంటూ "నోర్ముయ్" అని బిగ్గరగా అరిచేసరికి నేల మీద చతికిలబడింది. కమలను హాస్పిటల్‌కు తీసికొని వెళ్లారు. కూడా ఆడ బిడ్డ వెళ్లింది. ఆమె వున్న చోటు వద లేదు. దుఃఖం రావటం లేదామెకు. ఏదో భయం అతి భయంకరమైన పరిణామం గుర్తొస్తోంది. అచేతనంగా గుమ్మం కేసి చూస్తూ కూచుంది.

రిక్షా గుమ్మంలో ఆగింది. కొడుకు లోపలికి రావటం చూచి ఆమె లోపలి కెళ్లి పోయింది. తల్లి అలా వెళ్లటం అతనికి చాల వింతగా వుంది. ఇల్లంతా గందర గోళంగా వుంది. తండ్రి మంచం సర్దిలేదు. ఈజీచైర్‌లో కూచుని తను రాగానే "హు, వచ్చావా" అని అసహ్యించుకున్నట్లు ముఖం త్రిప్పుకునే తండ్రి అక్కడలేదు. హమ్మయ్య అని ఎంతో స్వేచ్ఛగా ఫీల్ అయ్యాడు. గోడ వారగా సంచిని ఆనించి గబగబ కమల గది అంటే తన గదికి వెళ్లాడు. ఆగది కూడ చిందరవందరగా పడేసిన వస్తువు లతో నిండి వుంది. కమల పెట్టె తెరచి చూచాడు. ఏవో నాలుగైదు సాధారణ మైన చీరలు, రవికెలు వున్నాయి. పెట్టె అడుగున చూచాడు. ఏమీలేదు. ఓ చిన్న కాగితం ముక్క కూడ లేదు. ఆశ్చర్యంగా అల్మారీలో చూచాడు. ఏనాటివో మేగ జీన్లు, నవలలు, ఏవో వస్తువులున్న ఆ స్థలంలో కూడ ఏ ముఖ్యమైన కాగితాలు కనబడలేదు. పుస్తకాల చాటున రూపాయి చిల్లరుంది. కసిగా నవ్వుతూ వాటిని జేబులో వేసికున్నాడు. ఈ రూపాయ చిల్లర మాత్రం తనకెందుకు? కాగితాలు అంటే పత్రాలు కనబడకపోయేసరికి అతడి కెక్కడలేని కోపం ముంచుకొచ్చింది. "కమలా, కమలా" అని కేకేశాడు.

కమల రాలేదు గానీ ముందు ఎవరో పిలుస్తున్నారు.

తల్లి నీరసంగా అరచింది. "ఎవళ్లో వచ్చారు చూడరా..."

చికాకుగా ఇవతలికొచ్చాడు. గుమ్మంలో నుంచున్న పోలీసుల్ని చూచి మానుపడి పోయాడు.

"ఇది రిటైర్డ్ తహసిల్దారు లక్ష్మి ప్రసాద్ గారిల్లేనా అండీ?"

"ఔను..ఏంకావాలి?"

తల్లి వాళ్లను చూచి బేంబేలు పడి పోయింది. "ఒరే ఒక్కమాటిలారా" అంది తలుపు చాటునించి. చరచర వెళ్లాడటు కేసి "ఆ కమలది నిద్రమాత్రలు మ్రిం గిందిరా... చచ్చిపోయి సాధిద్దామనుకుంది. హాస్పిటల్‌కి తీసుకొని వెళ్లారు...."

కమలకు అంత ధైర్యం వుందా? అంత సాహసించిందా. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"చూడండీ ఆమె గదికి తాళం వేసి సీలు వేయాలి. తర్వాత మా ఇన్‌స్పెక్టర్ గారొస్తారు."

వారా గదిలో కెళ్లి చుట్టూరా పరీక్షగా చూచారు. మంచం; ఒక ట్రంకు; గ్లాసు చెంబు తప్ప అక్కడ ఏమీలేవు. చెక్క ముక్కలు, మేకులు, కిటికీకి ఇవతల పడి వున్నాయి. కిటికీ మూసి రెండు బొంగు లడ్డం పెట్టి తలుపు తాళంవేసి సీలు జేశారు.

వారీ పనులన్నీ చేస్తుంటే పరధ్యానంగా చూస్తున్న అతడికి — కమల భర్త సత్య మూర్తికి— ఏదో ఆలోచన చటుక్కున తట్టింది.

"నే నిప్పుడే వచ్చాను. ఏ ఆస్పత్రిలో వుంది? ప్రాణాపాయం లేదుకదా!" ఆతృ తతో ప్రశ్నించాడు.

ఒక పోలీసు అన్నాడు "ఏమో చెప్ప లేము. డాక్టర్లు ఇంకా ఇంజక్షన్లు ఇస్తు న్నారు...ఆమెకు స్మృతి వచ్చేదాక అను మానమే."

"అమ్మా..నేనటు వెళ్లొస్తాను" జేబు లోని దువ్వెనతో తల దువ్వుకుంటూ వెళ్లి పోయాడు. ఎప్పుడు లేనిది కొడుకు హడా విడికి ఆశ్చర్యపోయిందామె. లోకం కళ్లు కప్పటానికి కాబోలు! ఆమె గబగబ గుమ్మంలో కెళ్లి "ఒరే ఓ మాటిలారా" అంది. కొడుకు రాగానే రహస్యంగా అంది.

"దాని కేమాత్రం మెలకువ వచ్చినా నీ పేర రాయించుకో".

తల్లి కళ్లలోకి సూటిగ చూస్తూ నవ్వాడు. "ఆమాత్రం నాకు తెలీదూ?" అన్నట్లుందా నవ్వు.

"ఆ గదిలో కెవ్వరు పోకండమ్మా. తాళం వేశాము" అంటూ వాళ్లిద్దరు వెళ్లి పోయారు.

అక్కడ ఆమె కేమీ తోచలేదు. తలుపు తాళం వేసి తానూ బయలుదేరింది. అక్కడ చాల హడావిడిగా వుంది. ఇద్దరు ముగ్గురు పోలీసులు తిరుగుతున్నారు. పేషెంట్ల బంధువులంతా కొద్ది దూరంలో నుంచుని ఈ జగన్నాటకాన్ని చూస్తున్నారు.

"ఆ ఆవిడే కాబోలు అత్తగారు. ఎంతుందో"

"కూతుర్ని చూచారుగా.. వీళ్లిద్దరూ పాపం రాచి రంపాన బెట్టుంటారు."

"ఆ కట్టుకున్న వాడే కసాయివాడైతే వీళ్లకు మరీ లోకువైయ్యుంటుంది. అందుకే పాపం ఆత్మహత్యకు పాల్పడింది."

ఒక్కోమాట వారి చెవి సోకుతూనే వున్నాయి. "వీళ్లకేం పోయేకాలమో. మా గొడవలన్నీ వీళ్ల కెందుకూ..మహా అర్చే

వాళ్లలా తీర్చేవాళ్లలా" ఆమె తీక్షణంగా వారికేసి చూస్తూనే భర్తతో అంది. కాసే పాగి మెల్లగా అంది.

"ఎలా వుందేమిటి దానికి?"

"నాడి బాగుందట.. ఇంకా స్మారకం రాలేదు. చాల శ్రమపడుతున్నారు"

"అతనెవరు?" వరండాలో గది బైట కుర్చీలో కూర్చున్న వ్యక్తిని చూస్తూ అడిగిందామె.

"మేజిస్ట్రేటుగారు. మెలకువ వస్తే వాఙ్మూలం వ్రాసుకోటానికి వచ్చారు" ఆయన కొడుకు వైపు చూచారు. అతగాడు హడావిడిగా కాగితం మీద ఏదో రాస్తున్నాడు! ఆయన బెంచి మీద కూచుని రెండు చేతుల్లో తల పట్టుకున్నాడు. కమల బ్రతకాలి. అదొక కళంకంగా తమ వంశంలో నిలువరాదు. బ్రతికి ఎక్కడైన హాయిగా వుండాలి. ఆతడు భగవంతునికి మొక్కుకుంటున్నాడు. అతనికి బాహ్యప్రపంచం మాటుబడిపోయింది. మనస్సంతా కమల మీద కేంద్రీకరింపబడి వుంది. తనూ ఒక మనిషేనా? కమల చచ్చిపోతే అందుకు కారకుడు తను మాత్రం కాదూ? ముగ్గురు చేరి ఆమెను హింసిస్తుంటే తను చూస్తూ ఎలా వూరుకోగల్గాడు? ఆమాత్రం ధైర్యం తనకు లేకపోయిందా? అంతగా అంటీ అంటనట్లు చూచీ చూడనట్లు పరాకుగా ఎలా వుండగల్గాడు. ఛీ. ఛీ..తను కూడ వీళ్ళ రాక్షసత్వంలో పాలుపుచ్చుకున్నాడు. ఆ పాపంలో భాగస్తుడు కూడా.. వాళ్లంతా ఆమెకు చేయరాని అపకారం చేస్తుంటే కూడ తనలో ఏ విధమైన భావావేశాలు ఉద్భవించలేదు. ఎవ్వరినీ అదుపులో పెట్టలేకపోయాడు. తను చవట. చేతకానివాడు. ఎన్నో సంవత్సరాల లోకజ్ఞానం పరిస్థితుల ప్రభావానికి లొంగిపోయింది. మంచికి బదులు చెడు జరుగుతున్నా అది సహజమైనట్లూరుకున్నాడు. అగ్నికి కాల్చే గుణం, భార్యకు కోడల్ని సాధించే గుణం, కొడుక్కు భార్యను పీల్చి పిప్పిచేసే గుణం. కూతురికి వదినను చిన్నచూపు చూచి ఆమె దుఃఖిస్తుంటే చూచి ఆనందించే గుణం, ఇవన్నీ చూస్తూ కూడ నత్త గుల్లలో దాక్కున్నట్లు తను అన్నింటికీ అతీతంగా దూరంగా వుండటం సహజమైన దనుకొన్నాడు. అంతరాత్మ ఘోషిస్తుంది. కనుకొనల్లోని కన్నీరు, అటు ఇంకిపోక ఇటు జారలేక

ఘనీభవించినట్లుంది. ఆతని హృదయం తీరని వేదనకు నలుగుతోంది!

ఒక నర్స్ హడావిడిగా వచ్చి "ఆమెకు కొన్నిగ తెలివొచ్చింది. స్ట్రాంగు కాఫీ గానీ డికాక్షన్ కానీ ఇవ్వాలి. త్వరగా తేవాలి..." ఆమె వచ్చినంత హడావిడిగా వెళ్ళిపోయింది.

కళ్ళలోని అశ్రువులు టప్న రాలాయి. చల్లనిగాలికి నల్లని మేఘాలు వర్షించినట్లే ఆ వార్త అతని కెంతో హాయి నిచ్చింది. కళ్ళు తుడుచుకుంటూ కాఫీ చేయటానికి లేచాడు. "నేను వెళ్తాన్నాను నాన్నా..." అంటూ కొడుకు దౌడుతీస్తుంటే అర్థంకాక గుడ్లప్పగించి చూస్తున్నాడు. ఏదో చటుక్కున స్ఫురించటంతో పెదవి విరిచి తన స్థానంలో కూచుండిపోయాడు.

"నే వెళ్ళి చూచిరానా?" భార్య ప్రశ్నించింది.

"ఎందుకులే. నిన్ను చూస్తే వచ్చేది కాస్తా ప్రాణం...." అతను పూర్తి చేయకుండానే చేతితో పోతుందన్నట్లు అభినయించాడు. ఇచ్ఛాపూర్వకంగా ఆమె వైపు చూడలేదు.

"ఏతే మేమెందుకిక! ఆ వచ్చేప్రాణం వచ్చాక నాల్గు చీవాట్లు పెట్టి బుద్ధిగా వుంటే రమ్మని మనండి..లేకపోతే ఇంకాస్త ఎక్కువ ఓసేసుకుంటే యీ ఆందోళన అప్రతిష్ఠ లేకపోవును..ఛీ..ఛీ.. ఎంత అవమానం.. తలెత్తుకు తిరగ్గలమా!"

ఆయన జవాబు చెప్పదల్చుకోలేదు.

చేతులు కట్టుకుని నేలకేసి చూస్తూ కూచున్నారు.

# నేను ఓడిపోలేదు

ఆమె భర్తకేసి తీక్షణంగా చూచి కూతుర్ని తీసికొని వెళ్ళిపోయింది. వెంటనే కాఫీ తీసికొచ్చాడు కొడుకు. నర్స్ లోపలికి తీసికొని వెళ్ళింది.

"ఎలా వుందట నాన్నా"

అతను కొడుకు దెస చూడలేదు"పూర్తిగా తెలివి రాలేదుట.. అర్థరహితమైన మాటలు. పొడిపొడిగా ఏదో అంటూాందట..."

మరొక గంటకు గాని కమలకు కాస్త తన ఉనికి తెలిసింది కాదు. మామగార్ని చూడగానే కన్నీరు ఆగింది కాదు.

"ఎంత పని చేశావమ్మా కమలా!..." అంటూ అంగవస్త్రంలో ముఖాన్ని దాచుకున్నారు. ఆమె మాట్లాడలేదు. కళ్ళు మూసుకుంది. ధారగా అశ్రువులు చెంపల్ని తడుపుతున్నాయి.

"నిద్ర పోనివ్వ కూడదు..ఈ మాత్రలతో పాటు కాఫీ యిస్తుండాలి.. ఆవేశ పర్చకండి..." నర్స్ చెప్పింది.

సత్యమూర్తి నెమ్మదిగా లోపలికొచ్చాడు. అతని ముఖం పైకి ప్రశాంతంగా వుంది. అంతరాంతరంలో కమలపై కోపం బడబాగ్నిలా మండుతోంది! భర్తను చూచి కళ్ళు మూసుకోలేదు సరికదా భయంతో మామగారి అండకోసం అటువైపు దీనంగా చూడలేదు. భర్త కళ్ళలోకి సూటిగా చూచింది. నర్స్ కొద్ది దూరంలో నుంచుంది. ఏమీ పట్టనట్టున్నా ఓ చెవి ఇవతల పారేసింది.

"ఎలా వుంది" స్టూలు మీద కూచుని అనురాగంతో ప్రశ్నించాడు.

"నీరసంగా వుంది"

"మగతగా లేదా? మేమంతా ఎవరో తెలుస్తోందా!" కమల నవ్వింది. ఆ నవ్వు ఎంత హేళనగా వుంది! తన్ను తాను పూర్తిగ స్వాధీనంలో వుంచుకోలేని స్థితిలో వుంటం చేత ఆ నవ్వు వింతగా ధ్వనించింది! ఆతని భృకుటి చూచి ఆమె చలించలేదు.

"ఎందుకింత పని చేశావు?" కఠినంగా ప్రశ్నించాడు.

"మీకు తెలుసుగా? నేనే చెప్పాలా? నన్ను నేను మోసగించుకోలేకపోయాను. బ్రతికి బాగుపడేందుకు యోగం లేనప్పుడు చని**పోవటం** మంచిదనుకున్నాను... మీకూ మంచిదేగా!"

కమల ఎంత ధైర్యంగా మాట్లాడుతుంది! ఎప్పుడు కూడ పల్లెత్తు మాట అనని ఈమె, తన సముఖాన నోరు తెరచి మాట్లాడలేని ఈ కమలేనా ఇంత ధైర్యంగా జవాబు లిస్తోంది. అతడు ఆశ్చర్యాన్ని కప్పి పుచ్చుకునాడు. తనకు అట్టే వ్యవధి లేదు. సాయంత్రం నాల్గుగంటల కెళ్ళిపోవాలి. ఆ డబ్బు చేతిలో పడగానే "ఆమె కివ్వాలి. "ఆమె" భవనంలో బాత్‌రూమ్ ఆధునిక పద్ధతిలో నిర్మింపబడ్తోంది. క్రొత్త కారుకు కొంత డబ్బు తక్కువ బడింది. అదంతా భర్తీ చేయవలసి బాధ్యత తనది కాదూ!


"ఇక నిన్ను ఏ విషయంలో గూడ కష్టపెట్టను కమలా. నీ కెక్కడ వుండాలని తోచితే అక్కడే వుండు. నాకే అభ్యంతరం లేదు. నిన్నెంతగా హింసించి శ్రమ పెట్టానో తలంచుకుంటే నా హృదయం తీరని వేదనకు లోనౌతుంది. త్వరలో ఆరోగ్యం పొందితే ఎంతైనా కృతజ్ఞుడిని."

కమల మళ్ళీ నవ్వింది.

"నా దగ్గ రేముందని? అంతా అయిపోయింది..." స్మృతి తప్పుతున్న స్వరంలో అంది.

"అంత నిరాశగా మాట్లాడకు. నీకు తప్పక బాగవుతుంది. రెండురోజుల్లో యింటి కొస్తావు..."

"ఔను..నాకు కూడ త్వరగా యింటికి రావాలనే వుంది..కానీ వీళ్ళు రానిస్తారూ?" కిటికీకి అవతలగా చూచింది. వీళ్ళు అంటే ఆసుపత్రి వాళ్ళా? కాదు.. కమల కిటికీలోంచి అగుపిస్తున్న ఎర్రటోపి కేసి



చూస్తోంది. అతని ఒళ్ళు గగుర్పొడిచింది!

కమలకు మత్తుగా వుండనటంలో తిరిగి మందులు కాఫీ ప్రారంభించారు. నిద్రపోకుండా సత్యమూర్తి జాగరూకతతో కనిపెట్టి వున్నాడు.

ఆ రోజు, మరునటి రోజు ప్రొద్దున్న గడిచిపోయాయి. కమల మంచం మీద కూచుని తల దువ్వుకుంటుంది.

పదిగంటలకు సత్యమూర్తి టిఫిన్ పట్టుకొచ్చాడు. పళ్ళెంలో వడ్డించిన వేడి వేడి అన్నంలో వేసిన నెయ్యి ఘుమాయించి కమ్మని వాసన కొడ్తోంది. రెండు వేపుడు కూరలు, పప్పుపులుసు, గ్లాసులో పాలు చూచి కమల నిర్ఘాంతపోయింది. పండగ లప్పుడు కూడ యిలాంటి భోజనం తను చేయలేదు. సరిగ్గా వేడివేడి అన్నం తిని సంవత్సరాలే అయింది.

అన్నం కలపకుండా భర్త ముఖంలోకి పరీక్షగా చూచింది. ఆ చూపులు అతన్ని ఛేదించి హృదయాన్ని చొచ్చుకునిపోయినట్లు భావిస్తూ ఏదో పని మీద వెళ్ళినట్లు బైటికెళ్ళిపోయాడు. ఆమె ముఖం కొద్దిగా వికసించింది. కమల కొద్దిగ భోంచేసి చెయ్యి కడుక్కుంది. టిఫిన్ సర్దిపెట్టింది. మావ గారు పోలీసు ఆఫీసరు లోపలికొచ్చారు. వాళ్ళు ఏదో మాట్లాడుకొంటున్నారు. సత్యమూర్తి భార్యతో పనుందనగానే వాళ్ళు బైటికెళ్ళారు. అతను పత్రం దెచ్చి కమల కిస్తూ సంతకం చెయ్యమన్నాడు. గొలుసు కట్టులో వ్రాసిన ఆ తెలుగు చదవటం ఆమెకు చేతకాలేదు. కాగితం మొదలునుంచి తుది వరకు శ్రద్ధగా చూచి తిరిగి యిచ్చివేస్తూ "నేను పెట్టను" అని స్పష్టంగా అంది. తలుపు కవతల నించి ఎవరో తొంగి చూస్తున్నారు. సత్యమూర్తి తల మీద పిడుగు పడ్డట్లయింది. నిప్పులు గ్రక్కుతున్న కళ్ళతో ఆమె కేసి క్రూరంగా, కోపంగా, అసహ్యంగా, జుగుప్సాకరంగా చూచాడు.....

"పెట్టకపోతే... హు..ఆ పత్రాలెక్కడున్నాయి?"

కమల తొణక లేదు. "మామయ్య గారి దగ్గరున్నాయి"

"తీసుకుంటాను."

"మీ కివ్వరు.. వారి ద్వారా చేరవలసిన వారి కీపాటికి చేరే వుంటాయి."

"ఎవరికి పంపేవు?" గ్రహించి ఆ గది కంపించినట్లా వుంది.

"మాయింటికి.."

"ఆ... వెళ్ళి... ఏమైనా గాని తెచ్చుకుంటాను...నా కసి తీర్చుకుంటాను" పళ్ళు బిగించి మాట్లాడుతుంటే కమల ఏమీ పట్టనట్లు ఏలకి తొక్క తీసుకొని నోట్లో వేసుకుంది.

"వాటిపై మీకేం హక్కుంది?...మీరు తీసికోలేరు... బెదరించినా మీకు రావు, ఎందుకంటే అవి నాన్నారి పేరట వున్నాయి.."

ఆతడు రౌద్రంతో లేచి నుంచున్నాడు. చేతిలో ఏదైన వుంటే యీసరికి ఆమె విగత జీవియై నేల మీద పడిపోయేది. కుడిచేయి పిడికిలి ఎడమచేతిలో గుద్దుకుంటూ ప్రతీకార వాంఛ భయంకరంగా కళ్ళలో తాండవం చేస్తుంటే లేచి నుంచుని అన్నాడు..."ఐతే చావకపోయావా? విను.. నీకూ.." కమల చటుక్కున లేచి నుంచుంది. ఆతని మాటల కడ్డు తగుల్తూ కసిగా అంది.

"ఆ ముక్క నేనే అందామనుకుంటున్నాను.. ఇక మనిద్దరికి సంబంధం లేదు.. నేను రేపే తిన్నగా మా యింటి కెళ్తున్నాను... ఎక్కడికో వెళ్ళి అడుక్కుతిననేగా మీ అభిప్రాయం! అంత అవసరం నాకే మొచ్చింది? లక్షణంగా ఆ పొలం మీది ఆదాయంతో ఎక్కడో హాయిగా బ్రతగలను. అంతా అయిపోయి చేతులు కాలాక పశ్చాత్తాప్తులై తిరిగొచ్చి ఏలుకోవాలనుకుంటున్నారు కాబోలు. అంత కాలం ఆగటానికి ఓపికా త్యాగబుద్ధి నాలో లేవు."

సత్యమూర్తి మానుపడి చూస్తుండిపోయాడు. అనవలసిన మాట అనేసింది. ఈ క్షణం కోసం ఎంతగానో ఎదురు చూచింది. అంత ధైర్యం ఎక్కడి నించి వచ్చిందో తనకే తెలియదు. తుపాకి పేల్చింది. ఆ గుండు ఇక వెనక్కిరాదు!

"ఆమె"కు తన ముఖం ఎలా చూపగలడు? కమల ఇంత ధైర్యం చేస్తుందనుకోలేదు. ఎప్పటిలాగానే బెదిరిస్తూ వ్రాసిన ఉత్తరానికి బాగానే సిద్ధపడింది. ఆ కోపంతో అక్కడ వుండలేక గబగబ వెళ్ళిపోయాడు.

ఆతడు వెళ్ళిన దిక్కు కేసి చూస్తూ రెండు చేతులో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది కమల.

వాళ్ళు లోపలి కొచ్చారు.

కమల ముఖం తడుచుకుని మంచం మీద కూచుంది.

ఆతను జాగు సేయలేదు. "ఏమ్మా.. మీరు ఆత్మహత్యకు పూనుకున్నందుకు నేర



# నేను ఓడిపోలేదు

రోపణ చేయటానికే వచ్చాను...నాకు వివరాలు కావాలి'' అతను పుస్తకం తెరిచాడు.

కమల దిగ్భ్రాంతయ్యె మామగారికేసి చూచింది. తను ఓడిపోకూడదు. విజేతయ్యె అందరికి, ముఖ్యంగా భర్తకు తన శక్తి చూపాలి. ఆమె ఆలోచిస్తోంది.

''ఆత్మహత్య మహాపాపం... ఈ శరీరం మీది కాదు.. సృష్టించిన ఆ భగవంతుని అంశం.. దాన్ని మీ యిచ్ఛాప్రకారం అంతం చేయటానికి హక్కులేదు. దీన్ని మీరితే మేము శిక్షిస్తాము.. ఇది సంఘపు కట్టుబాట్లకు విరుద్ధం. దుష్కార్యాన్ని శిక్షించకుండా వదిలేస్తే లోకం సహించదు..''

కమల శాంతంగా ఆతని కళ్లలోకి చూచింది. ''సంఘం మీరు.. ఇంత కాలం ఎక్కడునారు? ఇప్పుడు నా భర్త నన్ను త్యజించి వెళ్లారు..సంఘం ఏదీ? ఈ ఐదు సంవత్సరాలు జలగ రక్తం పీల్చినట్లు నన్ను పీల్చితే మీరంతా ఏమైపోయారు? చివరికి నేను బికారిని అయ్యే పరిస్థితులు వస్తే ఏం చేశారు?...కానీ.. బాబూ.. ఒక్క మాట.. నేను ఆత్మహత్యకు పూనుకోలేదు. నేనేం పాపం చేశాను? ఈ పృథ్విలో తలెత్తుకు తిరగ్గల స్తోమత వున్నప్పుడు నేనెందుకు భయపడాలి? లోకానికి వెరచి సిగ్గుతో చచ్చిపోవలసినంత ఖర్మ నాకేం పట్టింది.. నేను చనిపోవాలనుకోలేదు.. చావటం నాకూ ఇష్టంలేదు..''

''అలా అంటావేమ్మా.. ఈ ఉత్తరం నువ్వు రాయలేదూ? ఈ మాత్రలు సీసా నీవి కావూ? నీ మంచం దగ్గరుంటే తీసుకున్నాము. ఒక మాత్ర తలగడ దగ్గరుంది.. అన్ని మాత్రలు వేసుకోవటంలో నీ అర్థమేమిటి? చదువుకున్న దానివి.. డోసు చదవ లేదా?'' నన్ను మోసంజేస్తావా? అన్నట్లు మాట్లాడుతున్నాడు.

కమల తలొంచుకుని అంది. ''అన్ని మాత్రలు వేసికోలేదు. నాల్గు మాత్రం వేసికొన్నాను. మిగిలినవన్నీ చిన్న డబ్బాలో పెట్టి మల్లెపందిరి మీదికి విసరి వేశాను. అంతేకాదు. మా తండ్రిగార్కి రాసిన లేఖలో ఇదంతా నాటకమేనని, నిష్కృతి కోసం యిలా చేస్తున్నానని రాశాను.. ఇంత చేసినా డోసు ఎక్కువైంది. నా భర్త భయపడి ఏమైన మారిపోతారేమోనని ఆశించాను.. కానీ నా శ్రమ వృథా అయింది. వారేం మారలేదు. పైగా డబ్బులేని నన్ను ఏలుకోటానికి కూడ వారికి మనసు లేదు. కేవలం బ్రతికితే పొలం రాయించుకుందామన్న కాంక్షతో నా స్వాస్థ్యం కోరారు. అంతేగానీ, ఆత్మహత్యకు పూనుకుందే! ఇప్పటికైన మనస్సాక్షి మేల్కొంటే యీ చెడు త్రోవలను త్యజిస్తాను అని అనుకోలేదు. దీర్ఘనిద్ర నించి మేల్కొంటే, నా జీవిత గతి మారుతుందనుకున్నాను.. నూతన జీవితంలో అడుగు పెడ్తానేమో అని వువ్విళ్లూరాను.. అంతా వృధా.. ప్రాణంపోయినా బావుండుననిపిస్తోంది!.. నాన్నగా రొస్తుండాలి.. వెళ్లిపోతాను.. బాబూ ఇది రహస్యంగా వుంచండి. ఎన్నో ఆశలు పెట్టుకున్నాను గానీ అడియాశలైపోయాయి. ఎక్కడో ఒక దగ్గర జీవిత శేషాన్ని గడుపుతాను. కాదు కూడదు శిక్ష అనుభవించాలంటే...''


ఆమె కంఠం రుద్ధమైంది. కన్నీరు సుళ్లు తిరుగుతుంటే కంపిస్తున్న అధరోష్ఠాలను శల్యహస్తాలతో మూసుకుంటూ నిశ్శబ్దంగా రోదిస్తోంది...

మామగారు అతని చేతులు పట్టుకున్నారు. ''పెద్దలు ఏదో విధంగా మీరు తప్పించగలరు. ఇంతవరకు అమ్మాయి సుఖపడింది లేదు. ఇంకా బాధించటం న్యాయమంటారా?.. మీరు రక్షించాలండీ బాబూ'' అంటూ కంట తడిపెట్టారు. ఆయన రెండుచేతులు కట్టుకుని దీక్షగా నేలకేసి చూచారు. తర్వాత దుఃఖంతో విలవిల్లాడిపోతున్న ఆ ఎముకల గూడు కేసి చూచి దీర్ఘంగా నిశ్వసించారు. డాక్టరు అప్పుడే వచ్చి కూచున్నారు.

''ఆ మాత్రలు నిజంగా ప్రాణాపాయం కల్గించి వుంటే...?'' ప్రశ్నించా డాయన.

కమల జీరబోయిన కంఠంతో అంది. ''చనిపోయినట్లైతే మా తండ్రిగార్కి ఆ భూమి చెందుతుంది.. బ్రతికి పొందగోరిన సుఖం ఎండమావి అయింది. విజయం నాదేనండీ.. సర్వనాశనమై కట్టుగుడ్డలతో పుట్టిల్లు చేరే సమయం రాకముందే త్వరలో కళ్లు తెరచి తెగించాను. ఒక విధంగా బాగుపడ్డాను..'' ఆయన కళ్లద్దాలు సరిచేసికొన్నారు. ''డాక్టర్ గారూ, ఈ అమ్మాయి వేసికొన్న మాత్రలు పొరపాటున.. నిద్ర కోసం.. కొద్దిగ డోసు ఎక్కువ వేసికొన్నట్లయితే యిదే మాదిరి సీరియస్‌గా అయ్యేదా! లేక కొద్దిగ తక్కువ మోతాదులో వేసికొన్నా...'' ఆయన అర్థవంతంగా చూస్తూ ఆపు చేశారు.

డాక్టర్ ఆయన వైపు కన్నార్పకుండా చూచి మందహాసం చేశారు



"శరీరతత్వాన్నిబట్టి వుంటుంది. ఈమె చాల బలహీనంగా వున్నారు. నాల్గు చాలు ప్రాణాపాయం కల్గించటానికి. అదే కొందరు నాల్గు వేసికొని సాధారణమైన నిద్ర పోతారు. ఈ మాత్రలు అంత శక్తివంతం కావు..."

ఆయన లేచి నుంచున్నారు "మీ తండ్రి గారొస్తే ఓ మాటు నన్ను కలవమని చెప్పండి. మీపై ఏ నింద లేదమ్మా."

"కృతజ్ఞురాలిని" కమల శిరసు వంచి నమస్కరించింది.

"మీ మేలు మరువలేము" అంటూ, మామగా రతన్ని అనుసరించారు. కొద్ది దూరం నడిచి ఆయన చటుక్కున ఆగారు. "ఆమెను గూర్చి ఏ మాలోచించారు?... మీ అబ్బాయి యిక యీమెతో కాపురం చేయడు." మామగారు తల పంకించారు. ఒక్క నిట్టూర్పు వదలి మెల్లగా అన్నారు. "ఔను.. వాడి మాటలు విన్నాము. ఇక కాపురం చేయడు.. డబ్బులేని వాడిని అది ఎవతేనా గాని రానివ్వదు.. మా వియ్యంకులు వస్తే ఆమె భవిష్యత్తును గూర్చి ఒక నిర్ణయానికి రావాలి.. తిరిగి వివాహం చేసే డబ్బు సాయం చేయాలని వుంది.. కొడుకు వీధి పాలయ్యాడు.. కనీసం వాడి బిడ్డల్ని చూచి వాళ్ల కోసమైన బ్రతకా లనుకున్నాము. కానీ వాడు అందుకు కూడ పనికి రాలేదు..ప్చ్..."

ఆయన వెళ్లిపోతూ అన్నారు "మళ్లీ పెళ్లి చేయండి.."

కమల గదిలోకి వెళ్లారాయన.. "నాన్నారు రాగానే వెళ్తాను మామయ్యా.. వారేమైన చెప్పారా?..."


"లేదమ్మా.. అంతా విన్నాను.. నువ్వు వెళ్లిపోవటమే శ్రేయస్కరం. ఎక్కడో ఒక దగ్గర సుఖంగా వుండు తల్లీ..డైవర్స్ చేసే నీకు యింకా స్వేచ్ఛ".

ఆ చివరి మాటలు కమల హృదయాన్ని బలంగా తాకినయ్.– మామగారి కేసి విస్తుపోయి చూచింది. డైవర్స్.. తనకు స్వేచ్ఛ. ఆయన ఎటు చూసు న్నారు!

"ఏమంటావమ్మా" బ్రతిమాలుతున్నలా అడిగారు. కాసేపాగి మెల్లగా.

"మీ యిష్టం.." పైకి అన్నది. "నేనుపూర్తిగా గెలిచాను" హృదయంలో మారుమోగింది. హృదయం ప్రశాంతమైంది. తండ్రికి కోసం నిరీక్షిస్తూ విశ్రాంతిగా పడుకుంది కమల.●

# ఆధునిక దినాలలో... అతిథులు




శ్రీమతి రాధారాఘవ్

ఇంతవరకూ బంధువుల గురించి లెక్కలేనన్ని వ్యాసాలొచ్చాయి. వస్తూనే ఉన్నాయి కూడ. అయినా వీరిగురించి, ఎంతమంది ఎన్ని వ్యాసాలు వ్రాసినా అవి ఎప్పటికప్పుడే, నిత్య నూతనంగా, సరి క్రొత్త పాత కథలా ఉంటూనే ఉన్నాయి. దానికి కారణం ఒక్కటేనేమో— అలాంటి వ్యాసం చదవగానే ప్రతివారూ, తాము కూడా అలా ఎప్పుడైనా ప్రవర్తించామా? తమ ప్రవర్తన కూడ అలా యితరులకు బాధకలిగించేదిలా ఉందా అని ఆలోచించి, ఒకసారి ఆత్మ పరిశీలన, విమర్శ చేసుకోక పోవడమే ననుకుంటాను. ఇలాంటివి చదవగానే, చాలామంది తమగురించి విడిచి పెట్టేసి, ఎదుటివారి తప్పులు ఎన్నడంలో మునిగి పోతారుగాని, తమలో ఉన్న లోపాలు తెలుసుకుని, సవరించుకోడాన్కి ప్రయత్నించరు. అసలు చిక్కు ఎక్కడంటే తాముకూడ అలాంటివారమని కలలో కూడ అనుకోరు.

ఈ కరువు రోజుల్లో, అన్నిటి ధరలు విపరీతంగా పెరిగిపోయిన యిలాంటి తరుణంలో అతిథులను పోషించాల్సి వచ్చే బాధ సామాన్య సంసారులకు తలకు మించిన భారమవుతోంది. మధ్య తరగతి గృహిణుల ఆర్థిక స్థితులు తల్లక్రిందు లవడాన్కి కారణం— చేతకాని ఖర్చు దారితనం, అనుకోకుండా వచ్చి పడే రోగాలు, అతిథి మర్యాదలూను.

ఒక్కొక్కరిల్లు చూస్తూంటే అతిథి లేని రోజా ఉండదా అనిపిస్తూంటుంది. ఆ వచ్చిన వాళ్లకు భోజన పానీయాలు అమిర్చేసరికే, నడుం విరిగినట్టవుతుంది సామాన్య సంసారులకు. అదే డబ్బున్న వారికైతే యింకోరకం బాధ— మర్యాదలు సక్రమంగా జరపడం, మాటనిపించుకోకుండా సాగనంపడం, అన్నీ వండి అమర్చడం ఒక సమస్య అవుతుంది.

అతిథి అంటే అర్థం— తిథి, వారం, వర్జ్యం లేకుండా వచ్చేవారు అని విన్న జ్ఞాపకం. ఇదివరకు రోజుల్లో అయితే యిలా ఎప్పుడోవచ్చి, హఠాత్తుగా తలుపు తట్టేవారు. ఈ రోజుల్లో అలాకాదు. 'ఫలానా పనిమీద వస్తున్నాం గాబట్టి అనాల్గురోజులూ మీ యింట్లో ఉండదలిచాం, అభ్యంతరం లేదుగదూ?' అంటూ ఒక ఉత్తరం, దాన్ని చదివి మన అభ్యంతరం తెలుపకముందే, అసలు యింకా గాలైనా పీల్చుకోనిదే, ఆ ఉత్తరానికి కొంచెం వెనుక ముందుల్లో, ఆర్రాత్రో మర్నాడో దిగుతున్నాం గాబట్టి, తప్పకుండా స్టేషను కొచ్చి కలుసుకో వలసిందని ఒక టెలిగ్రాం మన చేతిలో కొచ్చి నిలబడతాయి.

ఇంతవరకూ వచ్చాక, వెళ్లి రిసీవ్ చేసుకోకపోతే బాగుండదు. వెళ్లిందాకా ఉండి ఆ మహానుభావులు "మీ వూళ్లో అడుగు పెట్టింది లగాయితు మాబరువు బాధ్యతలన్నీ మీవే సుమా అన్నట్టుగా, టాక్సీ కిచ్చే డబ్బు లగాయితు, తిరిగి వెళ్లే టిక్కట్టు డబ్బుదాకా, అన్నిటి ఆముదం మనకు రాసేసి, తెలివితేటలుగా తప్పించు కుంటుంటారు. ఏ టిక్కట్టు డబ్బయినా ఇవ్వబోయినా ముఖమాటానికి, మర్యాదకు "ఫరవాలేదు, ఉంచండి" అన్నామా మనపని ఆఖరే. సరేనని జేబులో పెట్టేసుకుంటారు గప్‌చుప్‌గా.

క్రొత్త ప్రదేశాలు చూడాలన్న జిజ్ఞాసతోటే, వ్యాపార వ్యవహారాలవల్ల, ఏవైనా పనులుండడం వల్ల, వేరొక ప్రదేశానికెళ్లాల్సిన అవసరం కల్గుతూంటుంది. ఈ వెళ్లేవారిలో చాలా మంది, తిన్నగా వెళ్లి హోటళ్లలో దిగరు. ఇంతంత ఛార్జీలు పెట్టుకు వెళ్లింది కాక, హోటళ్లలో దిగితే, భోజనాలకు, కాఫీటిఫిన్లకు రూముకు ఎక్కడలేని డబ్బూ అవు

తుందన్న దూరాలోచనతో, ముందుగానే ఆ వెళ్ళబోయే వూరిలో తెలిసినవారెవరున్నారా? అని వేటాడతారు. ఆవలలో విర్మోహమాటంగాను, నిక్కచ్చిగాను ఉండే మనుష్యులుకాక, తప్పించుకోడం రాని ఏ అమాయకులో పడతారు.

ఇలావచ్చి తిష్ఠవేసే వారిలో, ఒక్క బంధువులనే తీసుకోనవసరం లేదు. మిత్రులు, పరిచయస్థులు, ఆఖరికి ఏ మాత్రం కొద్ది ముఖ పరిచయమున్న వారైనా సరే చేరతారు.

ఇంకా కేంపు వచ్చేవారు కొందరుంటారు. వీరు, టూరు చేసినప్పుడు, కొంతడబ్బు ప్రోగు చెయ్యాలన్న సదుద్దేశ్యంతో, ఆ డబ్బు కూడ బెట్టటాన్కి తెలిసిన వారింట్లోనో, బంధువులింట్లోనో దిగుతూంటారు. ఈ మగవాళ్ళు ఒక్కరూ వస్తే అంత గొడవే ఉండదు. వచ్చిన చిక్కల్లా, వాళ్ళతో పాటు, భార్య, పిల్లలు కూడ వెంట ఉంటారు. ఆ తర్వాతే మొదలవుతాయి అన్నిపాట్లూను.


మగవాళ్ళు ఒక్కరూ వచ్చినప్పుడు, ఆడవాళ్ళు వచ్చినప్పుడున్నంత అవస్థ ఉండదేమో అనిపిస్తుంది నాకు. కొందరాడవాళ్ళు వచ్చినప్పుడు మనం పడే అవస్థ ఆ భగవంతుడికే తెలియాలి.

మగవాళ్ళకైతే, వేళకు కాఫీలు, భోజనాలు అమర్చితే, వాళ్ళ పనులు పూర్తయ్యాక, వాళ్ళ దారిన వాళ్ళు వెళ్ళి పోతారు. అదే ఆడవాళ్ళయితే (అందరూ కాదనుకోండి) అంతటితో వదిలిపోదు. వారికి అక్కర్లేనిదంటూ ఏదీ ఉండదు. అన్నిటిలోనూ వారి ప్రమేయం ఉంటుంది. ఆ వూరువదిలి ఆరు నెలలైనా, ఆయింటి ఛాయలు వారిని వెన్నాడుతూనే ఉంటాయి. అదే కొందరైతే, యిలా చేశారు, అలాచేశారని యాగీచేసి వదులు తారు కూడ.

ఇలావచ్చే వారిలో కొందరు బద్ధకస్తులుంటారు. కూడా పసిపిల్లలున్నా, పాలసరంజామా లేకుండా, ఏ బాదర బందీ లేకుండా స్వేచ్ఛగా వస్తూంటారు. —"దారిలో పాలు దొరికితే పాలో, కాఫీయో పట్టించేశాం. ఎలాగా వాళ్ళింట్లో గ్లాక్సో డబ్బా ఉంటుంది గదా, మళ్ళీ ఎందుకు మోత దండుగ అన్నారాయన. అందుకని తీసుకురాలేదు". అంటూ నవ్వుతూ చెప్తుందా యిల్లాలు.

పాలడబ్బా, వాటిగిరాకీ, బ్లాక్‌లో దాని వెల, వారం రోజుల మకాం కళ్ళ ముందు గిర్రున తిరుగుతూంటే, రాని నవ్వు బలవంతాన ముఖం మీదకు తెచ్చి పెట్టుకుని, "దానికేం లెండి, మా పిల్లాడితో పాటే" అంటూ సమాధానం చెప్పాల్సి వస్తుంది గృహిణికి.

కొందరు పిల్లా జెల్లలతో సకుటుంబ సమేతంగా బయలుదేరి వస్తూంటారు. టైముకు కాఫీలు, భోజనాలు అందరికీ ఒక్కరకంగా అమరుద్దామంటే ఆ గృహిణికి వీలవదు. ఉన్న నాలుగు రోజులకూ అవతలి వాళ్ళను యిబ్బంది పెట్టడం ఎందుకు, ఇంటిదగ్గరలా పరాయిచోట ఎలా కుదురుతుంది, ఏదో సర్దుకుపోదాం




అన్న ఆలోచన వాళ్ళకుండదు. మాటల మధ్య చల్లగా చెప్తారు. పెద్దాడు హోవల్టినే గాని పాలుత్రాగడని, చిన్నమ్మాయికి రాత్రి బోరన్‌విటా లేకపోతే నిద్రపట్టదని, వేపుడులేనిదే తనకు ఆపూటకు అన్నమే సహించదనీ, యింట్లో అందరికీ రాత్రికి పాలుత్రాగే అలవాటుందనీ వగైరా వగైరా విశేషాలు.

కొందరికి కాఫీలు, మరి కొందరికి టీలు, ఒకళ్ళకు పాలు, మరొకళ్ళకు బోరన్‌విటాలు, యింకొకళ్ళకు హోవల్టిన్‌లు— ఇంత మందికి పాల సప్లయి— ఈకరువురోజుల్లో యిన్ని కొని సప్లయి చేయడం ఒకెత్తు, అందరికీ అన్నీ అమర్చడం యింకొకెత్తు. "ఫరవాలేదు లెండి. మాటకు చెప్పానంతే, మళ్ళీ మీరెందుకు అవస్థ పడడం." అంటూనే అన్నీ చెప్పి చేయించు కుంటూంటారు. యీ రకం వాళ్ళు.

మరి కొంత మంది భోజన ప్రియులుంటారు. ఇంకొకరింటికి వెళ్ళాంగదా, నాలుగు రోజుల దానికి, వాళ్ళేవి పెడితే అవి తింటే సరిపోతుంది అనుకోరు. వాళ్ళ సూడిదలన్నీ చెప్పి ఆ రెండురోజుల్లోనే వండించుకు తినడానికి చూస్తారు. —'ఆకూర ఎప్పుడైనా అలావండారా? ఇవ్వేళ అలావండి చూడండి, అబ్బే. అందులో శ్రమేముందండీ. 2 గ్లాసుల కొబ్బరిపాలు కాస్తే సరిపోయె. భలే వారే! తేడా ఎందుకొస్తుంది. అందుకే, నేను దగ్గరే ఉన్నానుగా, చెప్తాను' అంటూ మొహమాట పెడ్తారు.

మరోరకం వాళ్ళు "అబ్బే. గుడ్లకేముందండీ. అలవాటు లేక అలా అంటువారంతే. అసలు పిల్లలకు మీ రెందుకని అలవాటు చేయలేదో నా కర్థం గావడంలేదు. ఇందాక వస్తూ వస్తూ గుడ్లు కొనుక్కొచ్చాను. ఆమ్లెట్ వేసి చూడండి. తింటే మళ్ళీ వదలరు. దానిముందు పెసరట్టు తీసికట్టే.... మీకు ముట్టుకోడాన్కి భయమైతే మీ వంటాడున్నాడుగా" అంటూ యిబ్బందిలో పడేస్తారు.

ఇంకోబాపతు మహానుభావు లుంటారు. వాళ్ళు ఉన్నన్నాళ్ళూ ఉండి, తిన్నంతా తిని అంతటితో వదిలిపోరు. వెళ్ళేటప్పుడు కూడ వెంట యింత తీసుకు వెళ్ళడాన్కి చూస్తారు. "ఈ ఊళ్ళో ఏపిల్సు ఎంత బాగుంటాయండి! ఈరకం ద్రాక్షపళ్ళు మా వూళ్ళో అసలు దొరకనే దొరకవు. ఇంత రుచైన దానిమ్మ పండు నాజన్మలో తినలేదంటే నమ్మండి. మా వూరు తీసుకెళ్దామను కుంటున్నాను. మాక్కూడా అవో నాలుగు కిలోలు యివో రెండు కిలోలు అంటూ లిస్టు చెప్పి, అరె! డబ్బు మీరిచ్చేస్తున్నారేమిటి? భలేవారే! అందుకే అసలు కొనకూడదనుకున్నాం." అంటూ పైసా యివతలకు తియ్యకుండానే కబుర్లతో అన్నీ కానిచ్చేస్తారు.

కొందరున్నారూ అంటే వచ్చినవాళ్ళు వచ్చినట్లు ఉండరు. మిగతా ఫ్రెండ్సుని (కలుసుకొని కబుర్లు చెప్పుకోడానికి) ఆహ్వానిస్తారు. ఈ అతిధులక్కు మళ్ళీ ఈ అతి

# ...అతిథులు

థుల మిత్రులకు మర్యాదలు మన్ననలు జరపాల్సివస్తుంది ఇంటావిడకు.

మనమే ఒకళ్లింట్లో ఉన్నాము. మనం కాక మన ఫ్రెండ్సును కూడా వాళ్ల ఇంటికే పిలవడమెందుకు? మనమే వాళ్ల ఇంటికి వెళ్దాం. అంతగా కావల్సిఉంటే వేరే ఏ హోటలోనో పార్కులోనో కల్సుకుందాం అన్న ధ్యాస వాళ్లకూ ఉండదూ ;వాళ్లెవరింట్లోనో ఉన్నప్పుడు వాళ్లింటికి మనమెళ్లడమెందుకు? వాళ్లను మనింటికే ఆహ్వానిద్దాం, అన్న జ్ఞానం అవతలవారికీ ఉండదు. వీళ్లు చక్కగా పిలుస్తారు. వాళ్లు అంతకంటే చక్కగా వస్తారు. 'సారీ. మీకు ట్రబులిస్తున్నా' అంటూండగానే అంతా అయిపోతుంది. హఠాత్తుగా వచ్చారుగదా, కాఫీలతో సరిపెట్టేద్దాం అనుకోడాన్కి వీల్లేకుండా, రెండు రోజులముందే "ఏమీ అనుకోకండి. వాళ్లు వస్తున్నారు" అంటూ చల్లగా చెప్తారు. ముందు వాళ్లు రాక తెలిసుంటే వట్టి కాఫీలతో సరిపెట్టలేము గదా. సరిపెట్టినా అనక వాళ్లే నిష్ఠూరాలేస్తారు. —ఏదో గతిలేక వచ్చిన వాళ్లకు పడేసినట్టు ముఖాన కాఫీనీళ్లు పడేసిందని.

ఇంక వూరు చూడ్డానికి వస్తుంటారు. అలాంటివారితో గృహిణి పడే అవస్థకు అంతే ఉండదు. పిల్లల బాదరబందీనంతా వెంట వేసుకువెళ్తే అవస్థనుకుని, వాళ్లను నెమ్మదిగా వదిలిపెట్టి వెళ్లడాన్కి చూస్తారు. పోనీ వదిలిపెట్టి వెళ్లినవాళ్లు వీలైనంత త్వరగా రావడాన్కి ప్రయత్నించరు. ఇంతకంటే మంచి ఛాన్సు మళ్లీ జన్మలో దొరకదన్నట్టుగా, జంటపక్షుల్లా స్వేచ్ఛగా విహరించేసి, ఎప్పటికో యింటికి చేరుకుంటారు. అనక సారీ చెప్పొచ్చులే అన్న ధీమాతో.

ఇక్కడ యింక ఆ యింటి యిల్లాలి పాట్లుంటాయి. ఒకవైపు రాత్రికి వాళ్ల భోజనపు ఏర్పాట్లు చూడాలి. మరోవైపు అమ్మకావాలి అంటూ పేచీపెట్టే ఆ పిల్లలను సముదాయించాలి. ఇటు తన పిల్లలు వాళ్ల పిల్లలు కొట్టుకోకుండా చూస్తూండాలి.

ఇన్నితిప్పలుపడి, సాయంత్రంవరకూ నానా అవస్థతో, పరాయి పిల్లలు కదాని కంటికి రెప్పలా చూసినా—అఖరికి ఆగృహిణి శ్రమకు ప్రతిఫలం?——"అమ్మా! వాళ్ల పిల్లలు నన్ను కొట్టారే. ఆవిడ నాకు ఎన్నో ఇస్కట్లుపెట్టలేదే"అంటూ తల్లిదండ్రులు రాగానే, వాళ్ల చెప్పే ఒక్క మాటతో




ఆవిడపడ్డ యమయాతనంతా తుడుచుకుపోతుంది.

అవసరాన్నిబట్టి, సన్నిహిత సంబంధాన్నిబట్టి రావచ్చు. కాదనను. కాని కొందరున్నారంటే వచ్చినవాళ్లు వచ్చినట్టుండరు. వాళ్లు అలా చేశారు, యిలా చేశారు అంటూ వెళ్లాక అందరిదగ్గరా యాగీ పెడుతూంటారు. ఏదో మనవసరంగాబట్టి వెళ్లాం. ఉన్నంతలో మర్యాద చేశారు. సర్దుకు పోదామన్న సహృదయంతో మాత్రముండరు. అక్కడేదో తమకు హక్కున్నట్టుగా, ఘరానాగా, లగాయించి మరీ చేయించుకోవాలని చూస్తారు. వాళ్లనుకున్నట్టు జరక్కపోతే ఎంత అభాండాలు వేయడానికైనా వెనుదీయరు.

ఇన్ని గొడవ లెందుకు ? అంత్య నిష్ఠూరంకన్న ఆదినిష్ఠూరం మేలని ముందే వాళ్లేం వ్రాసినా సమాధానం యివ్వకుండా వూరుకుంటే, "ఎంతగర్వం! తెలిసినవాళ్లు గదాని వెళ్దా మనుకున్నాం గాని, లేకపోతే వాళ్లెత్తు ధనం పోసి రమ్మంటే మాత్రం వాళ్లింటికెళ్లి కూర్చుంటామా ? ఎలాగూ వాళ్లకీ మధ్య కళ్లు నెత్తిమీద కొచ్చాయి." అంటూ నలుగురితో చెప్పి ఆడిపోస్తూంటారు.

ఒకవేళ వాళ్లు ఉత్తరం వ్రాసినా అందలేనట్టుగా వూరుకుందా మంటే, వాళ్లు మనకంటే ఎక్కువ తెలివితేటలు ఉపయోగించి, దూరదృష్టితో ఇంటికో ఉత్తరం, ఆఫీసుకో ఉత్తరం మరీ వ్రాసి పడేస్తారు.

సరే. యింక అందరేదనడాన్కి ఎలాగా ఆస్కారముండదు గాబట్టి, ఎలాగోలా తప్పించుకోడాన్కి, "మిమ్మల్ని రిసీవ్ చేసుకోలేక పోతున్నందుకు ఎంతో విచారిస్తున్నాం. సరిగ్గా ఆ సైముకే మా యింటికి ఎవరో అతిథులు వస్తున్నారు. ఆ పది రోజులకూ వాళ్లు మాయింటిని యింతకు ముందే రిజర్వు చేసుకున్నారు" అంటూ మర్యాదగా తిరస్కరిస్తే — వాళ్లు మనకంటే రెండాకులు ఎక్కువే చదివుంటారు. "ఫరవాలేదు. దానికేం మీరు విచారించొద్దు. మాకూ ఏవో ఆటంకాలుండడం వల్ల మా ప్రోగ్రాం కూడ ఫలానా అప్పటికి మార్చుకున్నాం. అప్పటికి మీ అతిథులూ వెళ్లి పోతారు గాబట్టి, మేమురావడాన్కి మరింక ఏ అభ్యంతరం ఉండి యుండదని తలుస్తున్నాం" అంటూ జవాబు వ్రాస్తారు.

ఇంక చస్తే తప్పించుకోలేము.

పూర్వపు రోజుల్లో అయితే అతిధికి అన్నం పెట్టనిదే యింట్లోవాళ్లు తినేవారుకాదట. కాని యీ రోజుల్లో అన్నిటి ధరలు పెరిగిపోయి ఆదాయానికి మించి ఖర్చులు అవుతోన్న తరుణంలో, సంసారం గడవడమే ఒక సమస్యగా ఉన్న యీ గడ్డు దినాలలో యీ అతిధి సత్కారాలు జరపడమంటే ఎంత కష్టతరమో చెప్పలేను.

మనకు అయిన వాళ్లు ఎలాగా తప్పరు. వాళ్లను ఒద్దు అని ఎలాగా అనలేము. అనడం భావ్యమూ కాదు.

మనం ఒకవేళ ఎక్కడికైనా వెళ్లాల్సి వచ్చినా, వీలైనంతవరకూ హోటళ్లలో ఉండటానికే ప్రయత్నించాలి. తెలిసిన వాళ్లన్నా, వెళ్లేముందు— వాళ్లకూ మనకూ ఎంత సన్నిహితత్వం ఉంది? వాళ్లింటికి వెళ్లడం ఉచితమేనా? కాదా? అని ఆలోచించుకుని మరీ వెళ్లాలి, అప్పుడు ఎదుటివారిమీద నిందలు, నిష్ఠూరాలు వేసుకోవాల్సిన అవసరం కనిపించదు. అంతేగాని డబ్బవుతుంది గదాని, వాళ్లకూ మనకూ ఏ కొసనో బంధుత్వమో, స్నేహమో కలసింది గదాని —మన మేనత్త అల్లుడి చెల్లెలు కొడుకు

ఏవరో ఉన్నాడనో, లేక మన అన్నయ్యో (ఫెండు మేనమామ కూతురుందనో వరుసలు కలుపుకు వెళ్లి వాళ్లనెత్తి మీద ఎక్కడం ఎంత మాత్రం మంచి పనికాదు. అలా ప్రవర్తించడంవల్ల అటు వాళ్లనూ యిబ్బందిలో పెడతాము, యిటు మనకూ యిబ్బందే.

అంతగా ఒకవేళ వెళ్లాల్సివచ్చినా ఏ 2, 3 రోజులకైనా అయితే కొంచె మైనా అర్థముంటుంది. కొందరు నెలకూ, రెండు నెలలకూ కూడ ఎదుటి వాళ్లను యిబ్బందిలో పడేస్తారు. ఒద్దని చెప్పాలేము. అలాంటి వాళ్ల మూర్ఖత్వానికి ఏ మనాలో అర్థంకాదు.

పుణ్య క్షేత్రాలలో నివాసముండే వాళ్లకు అతిథుల రద్దీ, యీ రోజా, ఆ రోజా అనకుండా ఉంటుంది. ఇల్లే ఒక సత్రపు కొంపవుతుంది. ఇంక ఆ గృహిణికి వండి వార్చేసరికే జీవితం తెల్లారి పోతుంది.

ఇలాంటి విషయాలలో మగవాళ్లు కొంచెం గట్టిగా ఉండక పోతే, ఆ గృహిణి పాట్లు భగవంతుడికే తెలియాలి.

మా స్నేహితురాలు ఒకామె ఉంది. ఆవిడకు అతిథి సత్కారాలొకెత్తు, ఆ భర్తతో వేగడ మొకెత్తు. ఆయన అతిమొహమాటస్థుడు. తప్పించు కోడం అసలే తెలీదు. మనస్సులో యిష్ట మున్నా లేక పోయినా పైకి మాత్రం వచ్చిన వాళ్లకు అతి విచిత్రపు మర్యా దలు వేళా పాళా అని లేకుండా ఆర్డరు జారీ చేసి చేయిస్తూంటాడు. — అరె. చన్నీళ్లతో ముఖం కడిగేసు కుంటు న్నారు, త్వరగా వేడి నీళ్లు తీసుకురా, త్వరగా ఆటవ లందుకో, చేయి కడుక్కో డాన్కి సబ్బందించు, ఇంకో కప్పు కాఫీ కలుపు — ఇలా ఒకదాని తర్వాత ఒకటి ఉక్కిరి బిక్కిరిగా ఆర్డర్లు జారీ చేస్తూంటే, వాటి వెనుక, ఆయన వెనుక తిరిగే సరికే అయిపోతుందామెకు.


"హఠాత్తుగా, కావాలనేసరికి రెడీ చేయడాన్కి నేనేం యంత్రాన్నికాదుగా. ఆ ఆర్డర్లు వింటూంటే ఎంతో కోప మొస్తుంది ఒకోసారి. కాని ప్రక్కన అతిథు లుంటారు. ఏమీ చెయ్యలేక శిర సావహిస్తాను" అంటూంటుంది మా మిత్రు రాలు. "పోనీ వట్టప్పుడు చెప్పి చూడ లేక పోయావా?" అనడిగాను. "ప్ర యోజనం లేదు. ఆ ప్రేమకి అన్నీ మర్చిపోయి, మొదటికి వస్తూంటారు" అంది నిట్టూ రుస్తూ.

పిల్లలున్న యింట్లో ఎవరి పనులు వాళ్లకే అవస్థ. దానికితోడు వచ్చే పోయే వాళ్లకు అల్లుడి మర్యాదలు జరపాలి అంటే చిక్కేమరి. కొందరు మగ వాళ్లున్నారూ అంటే వేళా పాళా అని లేకుండా, ఎవరు కనుపిస్తే వాళ్లను చటుక్కున భోజనాలకు పిలిచేస్తుంటారు.

ఏ కొంచెం లోటు పాటొచ్చినా, కొందరు మగవాళ్లకు, పిల్లలున్న యిల్లు గదాని సర్దుకు పోయే స్వభావం ఉండదు. అన్నీ సవ్యంగా జరుగు తున్నదీ లేనిదే చూస్తారు గాని భార్య పడే అవస్థ మాత్రం గ్రహించరు. పైగా కొందరున్నారంటే— తనేం జెయ్యడం లేదుగా, పని వాళ్ళు న్నారు, వారే చేస్తారుగా అనుకుంటారు. కాని ఆ పని వాళ్లతో ఎన్ని యాతనలు పడక పోతే, యిన్ని పనులు సవ్యంగా జరుగు తున్నాయా అని మాత్రం అను కోరు. ఇలాంటి బాధ్యతలేని భర్తలతో వేగే భార్యల అవస్థ, ఆ పడే వాళ్లకు తప్ప రెండవ వాళ్లకు అర్థంకాదు.

ఏదేమైనప్పటికీ అవసరాన్ని బట్టి, అతిథులనే వారిని యీ కరువు రోజుల్లో రెండు రోజులు పోషించ వచ్చు, నాలుగు రోజులు పోషించ వచ్చు. అంతకు మించి పోషించడ మనేది శక్తికి మించిన పనే. కనుక వీలైనంత వరకు మన గురించి, యింకొకరిని యిబ్బందిలో పడేయ కుండా ఉండడ మనేది అత్యుత్తమం. ●

సీరియల్:




### జరిగిన కథ

ఆమ్రపాలి అందచందాలను గురించి విన్న మగధరాజా బింబిసారుడు ఆమె నెలాగైనా తన దాన్ని చేసుకోవాలనే ఉద్దేశ్యంతో వైశాలీనగరంలో పుత్తలికల సూత్రధారుడుగా ప్రవేశిస్తాడు. రేవా ఆదేశానుసారం పాలి భవనంలో ప్రవేశించి ఆమెదృష్టిని ఆకర్షిస్తాడు. బింబిసారుడు నేర్పుతో ఆవందుడిపి, పాలిని ఆపదనుంచి తప్పిస్తాడు. పాలి, బింబిసారులు ఉద్యానవనంలో కల్సుకుంటారు. పాలి, బింబిసారుల హస్తాల్ని పరీక్షించి కోర్కెలు నెరవేరుతాయని చెప్తాడు. తననిగురించి అడిగిన పాలికి అప్పటికప్పుడు తానేమీ చెప్పలేనని సమాధాన మిస్తాడు బింబిసారుడు. అదివిన్న పాలి బింబిసారునిపై తన అవిశ్వాసాన్ని ప్రదర్శించి కోపంగా వెళ్ళిపోతుంది. పాలి భవిష్యం నిశ్చితం అయే ఆరోజు సంధాగారంలో సభాసదులంతా మహానాముని రాక కోసం ఎదురుచూస్తుంటారు.

## 13

'సభాపతి ఇంతవరకు రాలేదు' అని ఒక యువకుడు సూచించాడు.

'వస్తూ ఉంటాడు, రాకపోతే ఎక్కడకు పోతాడు?'

'ఇది పుత్రిక జీవిత ప్రశ్న, సోదరా!'

'నాకు తెలియనట్లు చెప్తున్నావేమిటి?'

'నీకెట్లు తెలుసు ప్రద్యోతా? నీవు నిన్న పాలిని వివాహమాడడానికి సిద్ధపడ్డావు. పుత్రికకై జనకుడి మనోవేదన నీ వర్థం చేసుకోలేవు.'

'అంబట్టుడు నిజం చెప్పాడు' అని మూడవ వాడన్నాడు.

'మేము భర్త కాగోరి ఇక్కడికి వచ్చాము. తండ్రి అవడానికి కాదు.'

'సభాపతి రానట్లు కన్పడుతోంది.'

'సూర్యుడు పడమర ఉదయిస్తాడని నీవు చెప్తున్నట్లు నా కనిపిస్తోంది.'

'పోనీ, ఆయన రాకపోతే సభ పూరికే లేచిపోతుందా? అంతా సమావేశమైనప్పుడు ఏదో ఒకటి చేయాలి. లేకపోతే దేశం యుద్ధాన్నో, కరువునో లేక మరి యే భయంకరమైన కష్టాన్నో ఎదుర్కోనవలసి వస్తుంది.'

'అంబట్టుడు నిజం చెప్తున్నాడు. చివరకు విషయం పాలిని గురించే కదా. నిర్ణయించే పని మన సభా సదులది. ప్రవేణి పుస్తకం ఆజ్ఞానుసారంగా అంతిమ నిర్ణయం చేయడానికి అభయరాజా కూడా ఇక్కడే ఉన్నాడు. సభాపతి రాకపోయినా సరే.'

'బసూ, నోరు సంబళించుకొని మాట్లాడు. పాలి ఎవరి బాబుదీ కాదు. అభయుడు కొంచెమైనా సందేహిస్తే నేన తణ్ణి కూడా పచ్చిగానే నమిలి వేస్తాను. ఇందుకే నే నిక్కడికి వచ్చాను. తెలిసిందా?' అని సుధీరు డరచాడు. ఎప్పటిలాగ అతడు ఒక్కొక్క మాటనే నమల్తూ అంతిమ విమర్శ చేయు బసుపై కాలు దువ్వు తున్నాడు. పాలి మాట విని అతని ముఖం నిజంగా భీషణమవుతోంది. ఆ సమయ మందే మహానాముడు వస్తున్నట్లు కన్పించింది. సభాసదులూ, ప్రేక్షకులూ జయ ఘోష చేసి అతని స్వాగతార్థం లేచి నిలబడ్డారు.

సభాపతి ఏవైపూ చూడకుండానే తల వాల్చి తన స్థానంలో ఆసీనుడయ్యాడు. సభలో అంతటా శాంతి నెలకొంది. అందరి కంటె ముందు ప్రస్తావం చేసేపని నగర శ్రేష్ఠునిది. కాని అతడు శాంతంతో అధో దృష్టి సారించి కూర్చొని ఉన్నాడు. తన చేతులతో దేవతుల్యుడగు వృద్ధ సభాపతి పుత్రిక సర్వనాశం ఆరంభించడాని కతడు సిద్ధంగా లేడు. అతడీ పాపాన్ని మహా జేష్ఠకుని తలపై మోపేడు. చతురుడైన మహాజేష్ఠకుడు సంస్థాధ్యక్షునితో ప్రస్తావం ఉంచుమని చెప్పాడు. సంస్థాధ్యక్షుడీ భారం శుల్కాధ్యక్షునకూ, శుల్కాధ్యక్షుడు సూర్యాధ్యక్షునకూ, సురాధ్యక్షుడు శునాధ్యక్షునకూ అప్పగించారు. కాని లిచ్ఛవీయులలో హృదయహీనతకు ప్రసిద్ధికెక్కిన శునాధ్యక్షుడు వీరభద్రుడు కూడా ఈ ప్రస్తావమును సభ ముందుంచుటకు సాహసించ లేకపోయాడు. మహానాముడు శాంతంతో ప్రస్తావం కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రతివాని మనస్సులోని శంకాసంకోచాలవు అతడెరుగును. క్రమంగా జనుల గుసగుసలు సభలోని శాంతిని భంగపుచ్చాయి. అప్పుడూ ప్రస్తావాన్ని ముందుంచడాని కెవ్వడూ నిలబడలేదు. తుదకు మహానాముడే స్వయంగా నిలబడ్డాడు. సభ భయపడిందో అన్నట్లుంది. అతడు గంభీర స్వరంతో అన్నాడు:

'సోదరులారా, నేడు సభా ముందు ప్రస్తావాన్ని ఉంచడానికి లిచ్ఛవీయ గణతంత్రం ఇంత విలంబం చేస్తోంది. గడచిన మూడు శతాబ్దాలలో ఇట్టి విలంబం చూడడం నాకిదే మొదటిసారి. లిచ్ఛవీయ వీరులారా, ప్రపంచమంతటిలో మన గణతంత్రం సాటి లేనిదని తలంపబడుతోంది. లిచ్ఛవీయ సంధాగారం ప్రతి సామూహిక న్యాయాన్ని సత్కరిస్తూ వచ్చింది. మన సంధాగార మెన్నడూ ఒక వ్యక్తి అజ్ఞకుగాని, కోరికకు గాని, శక్తికి గాని తనలో స్థానమివ్వలేదు. ఇవ్వదు. ఉత్తమ కుల సంజాతులైన ఓ వీరులారా, ఈ సంధాగారానికి వచ్చిన తరవాత సోదరుడు సోదరిని, శిష్యుడు గురువును, పుత్రుడు తండ్రిని, ప్రజలు రాజును అజ్ఞ విషయంలో తన కంటె ఎక్కువ అని తలంచరు. ఇది అట్టి సంధాగారం అని జ్ఞాపకముంచుకోండి. లిచ్ఛవీయ సంధాగారంలో అడుగు పెట్టడానికి ముందు ప్రతి లిచ్ఛవీయుడూ తన వయస్సునూ, శక్తినీ, మహత్వాన్నీ సంధాగారానికి అవతల ఉంచి వస్తాడు. ఇక్కడ అందరూ లిచ్ఛవీయులే, ఒక్కరే, సమానులే. కావున ఇక్కడ ఉన్న ప్రతిసభ్యుడూ, నిర్భీతుడు, సత్యవాది, పక్షపాత రహితుడు, మృత్యువును కూడా ఎదుర్కొన గలవాడు అవుతాడు. ఇక్కడి సభ్యు లందరూ ఆదర్శ లిచ్ఛవీయులే. అయినా, నేటి లిచ్ఛవీయ సంధాగారం శాంతంగా ఉండడానికి కారణమేమో ఎవ్వడైనా చెప్ప గలడా? నిర్భీతుడైన లిచ్ఛవీయుడే విషయంలోనైనా భయపడ్డాడా ఏమిటి? లేక మృత్యువుతో తలపడు లిచ్ఛవీయుడు నేడు పంద అవుతుండడం చూస్తున్నానా?'

'మహారథులారా, వయోవృద్ధులారా, కేవలము భావావేశంలో పడి కర్తవ్యము మరచిపోతే మీ మీద ఒట్టు. వైశాలిలోని ఈ అస్థాయి సంథాగారంలో ఎవడో ఒక లిచ్ఛవీయుని వ్యక్తిగత జీవితము కంటెనూ, సుఖము కంటెనూ లిచ్ఛవీయు లందరి లాభమును గురించి ప్రశ్నకు అధికమైన మహత్త్వం ఇవ్వబడింది, భవిష్యత్తులో కూడా ఇవ్వబడుతుంది. పరిషత్తు అనుమతిస్తే ప్రస్తావం శ్రీఘ్రాతి శ్రీఘ్రంగా సభ ముందుంచబడాలని నా ఆజ్ఞ.'

సభపూర్తిగా శాంతంతో ఉంది. నియమానుసారంగా అందరూ మౌనంగా ఉండి ప్రస్తావం ఉంచడానికి తమ ఆమోదాన్ని ఇచ్చారు. ఎవ్వడూ అడ్డు చెప్పలేదు. ఇప్పుడు ప్రస్తావం ఉంచే కార్యం నగరశ్రేష్ఠికి అనివార్యముయింది. అతడు తన తాలు నంటుకున్న జిహ్వను ఆడించడానికి ప్రయత్నించాడు. ఇంతలో అభయరాజు నిలబడ్డాడు. దానితో శ్రేష్ఠికి ప్రాణం లేచి వచ్చింది. అభయరాజు యువక సభ్యుల వైన ఒక దృష్టి సారించి చెప్పసాగాడు. 'పరిషత్తులోని వయోవృద్ధులైన సభాసదులు ఆజ్ఞనిస్తే నేను నేటి ప్రస్తావాన్ని చెప్పి వినిపిస్తాను..'

'వద్దు, వద్దు, వద్దు' అని గూరం నుండి ఎవ్వరిదో కేక విన్పించింది అతడు సుధీరుడు. అతడు అభయునితో యౌవన సులభమూ, అరువిసరమూ అయిన కొన్ని మాటలు అనుటకు ముందే చిరంజీవి బలవంతంగా అతని నోరు మూసివేశాడు.

'యువకుడా, సంథాగారవు ప్రతినిధి మాత్రమే సమర్థించగలడు, లేక అడ్డు పెట్టగలడు నీవు ప్రేక్షకుడవు.' అభయుడు నవ్వుతూ సుధీరునకు వినిపించి, ఏమీ జరగనట్లే అన్నాడు

'అయితే పరిషత్తు నాకు అనుమతి ఇస్తుందా?..'

ఎవడూ ఏమీ చెప్పలేదు. అంటే పరిషత్తు అనుమతించింది.'

అభయుడు సంథాగార నియమ ప్రకారం సభాపతి మహానామునికి నమస్కరించి చెప్పడాని కారంభించాడు. 'సభాపతీ, లిచ్ఛవీ గణతంత్రులారా, మీ ఆజ్ఞానుసారం నేను మీ యెదుట నా ప్రస్తావం ఉంచుతాను. ఈ సంవత్సరం నగర మహోత్సవంలోనూ, వసంతోత్సవంలోనూ రూపమునందూ, గుణమునందూ పాలి సర్వోత్కృష్ట స్థానం ఆక్రమించిరది. సభాపతీ, మీయా సర్వగుణ సంపన్న, సుందరి అయిన పుత్రిక ఆమ్రపాలి కోసం దేశంలో ఎన్నో వితండ వాదాలు ఉత్పన్నమవుతున్నాయి. ఎందరో యువకులు ఆమెను పొందడానికి తమ ప్రాణాలర్పించారు. ప్రకృతి ప్రదత్తమైన ఈ అంతులేని సౌందర్యం లిచ్ఛవీయ యువకుల్లో ఈర్ష్య, భేదం, ఉన్మాదం కలిగించింది. నేటి ఈ పరిషత్తులో కూడా వందల కొలది యువకులు పాలిని వివాహమాడ్డానికి ఉత్సుకత కలిగి ఉన్నారు. వారిలో ఒకరిపై నొకరికి విరోధం, కలహజ్వాల ప్రజ్వలితమయ్యాయి. లిచ్ఛవీయుల ఐక్యం, దేశప్రేమ, భయ, ఆతంకం అనే ఉయ్యాలలో ఉగుతున్నాయి. ఈ భయంకర దేశ పరిస్థితిని గురించి నేటి ఈ పరిషత్తు తమ అభిప్రాయం ఇచ్చి తుది నిర్ణయం చేయాలని ప్రార్థిస్తున్నాను.'

ఇలా అని అభయుడు ఈ విషయంలో నిరపేక్షి, నిర్లిప్తుడు అయిన వానిలా తన ఆసనంపై ఆసీనుడయ్యాడు. ప్రస్తావం విని సభ్యుల ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వేగంగా వెడలసాగాయి. ఈ విషయంలో ఇంకా వివాదం జరగడానికి కిప్పుడంత అవకాశం



లేదు. సభాసదులు కేవలం సభాపతి మాటనే వినడానికి ఆత్రముతో ఎదురు చూడసాగారు. ఎందుచేతనంటే ప్రస్తావ విషయం దాదాపు అందరికీ తెలిసినదే. వ్యవహార కుశలుడైన మహానాముడు పాలి కోసం ఏదో ఒక మార్గం ఈపాటికి తప్పక అన్వేషించి ఉంటాడని అభయునికి, అతని అనుయాయులకూ నమ్మకం. పాలిని ఏదో విధంగా పెండ్లాడ డానికి తమ కవకాశం కలగడానికి ఆమె విషయం అట్లే అనిశ్చితంగా ఉండాలన్నది అభయునిచే శిక్షితులై సిద్ధము చేయబడ్డ యువకులలో పెక్కుమంది మనోవాంఛయై ఉంది. కాని ఒక విధమైన కాఠిన్యం మహా నాముని ముఖంలో కనబడుతోంది. అతడు నిలబడి మాట్లాడడాని కారంభించాడు. 'ఒకానొక లిచ్ఛవీయ పురుషుని మూలంగా అనేక లిచ్ఛవీయ గణములు ఐకమత్యమునూ, సౌమ్యమునూ మరచి ఒకరినొకరు ద్వేషించ డాని కారంభిస్తే ఆ పురుషుణ్ణి చంపి వేయవలయుననీ, ఒకానొక స్త్రీ సౌందర్యం మూలంగా అలా అయితే ఆ సుందరి స్వదేశా నికై తన కౌమార్యాన్ని అర్పించి నర్తకి కావలయుననీ పరిషత్తుకు తెలుసు. పాలి దేశ నర్తకి కావాలి.. అనుమతించాలని నేను పరిషత్తును ప్రార్థిస్తున్నాను.'

ఈ సారి వెనకటిలాగ సభా శాంతంగా లేదు. పరిషత్తుకి రెండువైపుల నుండీ వ్యతిరేక స్వరాలు వినవచ్చాయి. ప్రతి యువక సభ్యుడూ పాలిని పెండ్లాడుట కోసం స్పష్ట మైన మాటలతో కేకలు వేయసాగాడు ఈ అవ్యవ స్థిత విరోధం మూలంగా ప్రౌఢ పురుషులు మరింత కోపించారు. యువ కులకూ వారికీ జరుగు వాద నివాదం ఉగ్రరూపం ధరింప సాగింది. అప్పుడు మహానాము డందరినీ శాంతింప చేశాడు. అతడు ప్రవేణి, పుస్తకం చదువుమని పెద్ద గొంతుతో నగరశ్రేష్ఠి కాజ్ఞాపించాడు. నగర శ్రేష్ఠి కాళ్ళు తడబడుచుండగా, సభకు మధ్యగా రత్న జటిత సింహాసనంపై బంగారు వలగుడ్డలో చుట్టబడియున్న తాళపత్ర ప్రవేణి పుస్తకాన్ని సమీపించాడు. వణకు చున్న వేళ్లతో తాళపత్రాన్ని ఎత్తి ఉచ్ఛ నీచ స్వరంతో చదువుట కారంభించాడు. సభ అంతా స్తబ్ధమైంది. నగరశ్రేష్ఠి అన్నాడు. 'దేవవాణి తన చతుర్థ ఖండపు నవమ, ఋక్కులో చెప్పును...ఓ శక్తివంతులగు ప్రజ లారా, మీలో ఎవతె అయినా కుమారి అత్యంత సుందరి అయితే, ఆమె సౌందర్యం మీ సోదరు లలోనే పరస్పర ద్వేషాన్ని కలిగిస్తే, ఆమె మూలంగా మీ యువకులు ఒకరి ప్రాణా లింకొకరు తీయడానికి సన్నద్ధులైతే ఆమెకు వివాహం చేయరాదు. లిచ్ఛవీయ కన్య లిచ్ఛవీయులలో జన్మించి లిచ్ఛవీయు లలోనే మరణించుట చేత ఆమెను దేశం నుండి వెళ్లగొట్టడం కూడా తగదు. స్త్రీని చంపడం నిర్వీర్యుడైన పురుషుని కార్యం. కాబట్టి ఆ సౌందర్యవతియైన కుమారి అందం దేశసేవకై ఉపయోగింప బడాలి. ఆ కుమారి వివాహ మాడకూడదు. ద్వేషంతో కలహించే వాళ్లల్లో ప్రేమ, నుత్పన్నం చెయ్యాలి. స్వదేశ హితానికై ప్రాణమర్పించే లిచ్ఛవీయుడికి విశ్రాంతి, ఆనందం ప్రసాదించడాని కామె నృత్యం, సంగీతం మొదలైన కళలలో పారంగతు రాలు కావాలి. ఆ కళలతో పురుషులను ఆనందింపజేసి వారిని రణరంగానికి పోడానికి ప్రోత్సహించాలి. ప్రజలు ఆ స్త్రీకి సన్మా నాన్ని ప్రకటించాలి. ఏలనంటే, శక్తివంతు లైన ప్రజల కోసం ప్రాణత్యాగం చేసే పురుషుని కంటె ఆ రూపకుమారి బలి దానం ఉత్తమమైంది.' నగర శ్రేష్ఠి చిలక లాగ ఈ పాఠాన్ని చదివి తన ఆసనంపై



కూర్చున్నాడు. సంధాగారంలో తిరిగి విరుద్ధ స్వరం వినిపింప సాగింది. ఎవడో బిగ్గరగా అరచాడు.

'పాలిని ఎవడు చేజిక్కించుకుంటాడో, చూతును గాక' అది సుధీరుని అరపు. ఒక మిత్రుడాతని నోరు తిరిగి మూశాడు. సభలో కూర్చున్న చిరంజీవి సుధీరుని మీద ధ్యానముంచలేదు. నేడు అతడే పాలికి ఘోర శత్రువు.

మునుపటి వలె అందరూ శాంతంగా ఉండుట చూచి మహానాముడు స్వయంగా లేచాడు. అభయుడు సూక్ష్మదృష్టితో అతని వైపు చూస్తున్నాడు. కాని మహానాముని దృష్టి అతనిపై లేదు. ఎప్పటిలాగ అతను శాంత స్వరంతో మాట్లాడ నారంభించాడు. అతని స్వరంలో కంపనలేదు, దౌర్బల్యంలేదు, ద్వేషం లేదు. సభ నిశ్శబ్దంగా ఉంది.

'మాననీయులైన సభాసదులారా, ఈ సంధాగారపు చరిత్రలో నేటి వరకు ఎట్టి సభాపతి ముందు అట్టి ప్రశ్న రాలేదు. కావున, పాలి నా కుమార్తె అగుట వల్ల ఎవడైనా సభ్యుడు తన అభిప్రాయం వెల్ల డించడానికి సందేహిస్తే అతడు కర్తవ్య చ్యుతుడవుతాడని నా మనవి. కర్తవ్యచ్యుతు డైన లిచ్ఛవీయునిలో లిచ్ఛవీయ రక్తం ఉంటుందని నే నొప్పుకోను. సోదరులారా, మనకు ప్రవేణి పుస్తకమే అంతిమ నిర్ణయం. ఈ ప్రస్తావం మీ అందరికీ మన్నింప తగినదిగా లేదని స్పష్టంగా కన్పి స్తోంది. శలాక సహాయముతో పరిషదభి ప్రాయాన్ని కనుక్కోవాలని నా ప్రార్థన. ఆమ్రపాలే సర్వశ్రేష్ఠ సుందరి అని పరి షత్తు అభిప్రాయ మిచ్చిన యెడల ఆమ్ర పాలి దేశ నర్తకి అవుతుంది.'

'కాదు..కాదు' అను సుధీరుని కరుణా పూర్ణమైన కేక విన్పించింది. ఈ సారి అతని వెనక నిల్చియున్న మిత్రుడు అతని నోరు మూయడమే కాక, చిరంజీవి సంకే తాన్ని పొంది అతని చెంప మీద కూడా కొట్టాడు.

నగరశ్రేష్ఠి కాళ్ళు మళ్లీ ఢీలుపడ్డాయి. అభయు డతని వైపు రెప్పవాల్చకుండా చూస్తూండడం వల్ల అతనికి కొంత ధైర్యం కలిగింది. అతడు సలాకలను పంచు ఏర్పాటు చేశాడు. సలాకా వితరణమునకూ, అభిప్రాయం ఇవ్వడానికీ మధ్య గల ఖాళీ సమయంలో సభ శాంతియుతంగా అనేక

విధాలైన తర్కవితర్కాలను చేస్తూ ఉంది. చివరకు నగర శ్రేష్ఠి చెమట చేత తడిసి చెప్పసాగాడు. ''పూజ్య సభాపతియు, లిచ్ఛవీయ గణతంత్రం ఆజ్ఞ ననుసరించి సభాసదులందరూ పరిషత్తు అభిప్రాయం దయచేసి వినండి. 'పరిషత్తు.. పరిషత్తు సర్వానుమతితో ఆమ్రపాలి సర్వశ్రేష్ఠ సుందరి అని ఒప్పుకుంటున్నది.'

'పరిషత్తు ధన్యమైంది, లిచ్ఛవీయ గణమూ వారి గణతంత్రమూ ధన్యములు.' మహానాముడు గంభీరమైన శాంతి ననుభవిస్తూ ఉచ్చస్వరంతో అన్నాడు. 'లిచ్ఛవీయ సంథాగారంలో అట్టి న్యాయమే జరగాలి. మీరు నన్ను చూడకయే, ఈ శిలాశలాకల సహాయంతో మీ హృదయంలోని నిజ విషయాన్ని సభ ముందు ఉంచారు. పాలి సర్వశ్రేష్ఠ సుందరి అయిన లిచ్ఛవీయ కన్య అని మీరు సర్వానుమతితో స్వీకరిస్తున్నారు. నే నిప్పుడు త్రివేణి పుస్తకా దేశానుసారం పాలి రాబోవు పూర్ణిమ నుండి దేశ నర్తకి అగుగాక అను ప్రస్తావం ఉంచుతున్నాను పరిషత్తునకు ప్రస్తావం మాన్యమగు గాక.'

సభ అంతటా భయ సంభ్రమములు అలముకొన్నాయి. అభయుని కందరి కంటె అధికమైన దెబ్బ తగిలింది. మహానాముడేదో విధంగా పాలిని కాపాడతాడని అతని విశ్వాసం. కాని మహానాముని న్యాయప్రియతను చూచి అతడు కూడా స్తబ్దుడయ్యాడు. కాని వృద్ధ సభాసదుల కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. కుమార్తెల గన్న తండ్రుల హృదయంపై పిడుగు దెబ్బ పడింది. అభయుని మాటల చేత ఉన్మత్తులై పాలి కోసం ప్రాణమిచ్చు యువకులు దిగ్భ్రాంతులై శాంతంతో కూర్చున్నారు.

కొంత సేపటివరకూ సభ నిండు శాంతితో ఉంది. ఎవడూ మాట్లాడలేదు. ప్రతి సభాసదుని శిరమూ మహానాముని కర్తవ్యభావం, ఆత్మసమర్పణం ఎదుట వంగింది. పరిషత్తు ఎప్పటివలె శాంతంగా ఉంది.

పరిషత్తు నిస్తబ్ధంగా ఉండి ప్రస్తావం ఆమోదించింది. సభాపతి అశాంత స్వరంతోనే చెప్పాడు.

'ఎవరి అడ్డమూలేదు. పూజనీయులైన సభ్యులారా, వంద్యమైన పరిషత్తు అనుమతితో లిచ్ఛవీయ గణతంత్రం ఎదుట నగర, ప్రాంత, గ్రామనివాసులూ అన్య ప్రాంతవాసులూ అయిన లిచ్ఛవీయ ప్రజ

లకు సూచించు నిమిత్తం రాబోవుపూర్ణిమ వాడు ఆమ్రపాలి దేశనర్తకి అవునని నేను మనవి చేస్తున్నాను. వైశాలికి జయమగు గాక. లిచ్ఛవీయులకు జయమగుగాక.' వెంటనే సభామంటపమునందు గగన భేది అయిన జయనాదమయింది.

'మహానాముడు సింహరాజునకు జయమగు గాక. సర్వశ్రేష్టుడైన లిచ్ఛవీయునకు జయమగు గాక. లిచ్ఛవీయ గణతంత్రానికి జయం. గణతంత్రం శాశ్వతముగా ఉండు గాక.'

ఈ జయనాదాల మధ్య సభ ముగిసింది. మహానాముడు సభాసదుల వందనాలను గ్రహిస్తూ మెల్లగా సంథాగారం నుండి వెలువడ్డాడు. వెలుపలికి రాగానే ఒక్కసారిగ సుధీరుడు అతని దగ్గరకు దుమికి వచ్చాడు. అతని ముఖముద్ర భీషణంగాను, కళ్ళు ఎర్రగాను ఉన్నాయి. ఉన్మాదమాతని ముఖం నుండి కురుస్తోంది. మహానాముని ఎదుటకు వచ్చి అరచాడు.

'నిర్దయుడా, మూర్ఖవృద్ధుడా, నీకు ధిక్కారం.' సుధీరుడు పశువై ఆ శ్రేష్ఠ లిచ్ఛవీయుని ముఖం మీద ఉమ్మి వేశాడు. వృద్ధ మహానాము డాగాడు. సుధీరుని వైపు చిరునగవుతో చూస్తూ అతడు చేతులతో ముఖం తుడుచుకున్నాడు. సుధీరుడా చూపున సహింప లేక ముఖాన్ని అటు తిప్పి వేశాడు. ఇంతలో ఎవడో సుధీరుని ముఖం పట్టుకొని దానిని వేగంగా ఊపివేశాడు.. అతడా నందుడని మహానాముడు చూశాడు. అశ్రుపూరిత నేత్రాలతో అతడడిగాడు.

'నీవు వచ్చావా, ఆనందా?'

'అవును తండ్రీ, పరిషదారంభం కాగానే నేను వచ్చాను.' తండ్రి, కుమారుడు లిచ్ఛవీయ నాయకుల మధ్య నిలబడి కేవలం ఈమాత్రమే మాట్లాడగలిగారు. ఇద్దరిలో ఎవడూ ముందు మాట్లాడ లేకపోయాడు. ఇద్దరి హృదయాలూ సహింపరాని వేదనతో వ్యథితమయ్యాయి. ఆనందుని హృదయం తరుక్కుపోతోంది. కాని వృద్ధుని హృదయం ఖండింపబడింది. ఆనందుడు తండ్రికి సాయపడి రథం మీద కూర్చోబెట్టాడు.

మహానాముని ముఖం మీద ఉమ్మిన తరవాత కూడా సుధీరుడు అరుస్తున్నాడు. చిరంజీవి అతణ్ణి తన ఇనుప భుజాలలో బంధించి ఉంచాడు. అయినా, అతడు నవ్వుతున్నాడు. అతడు పూర్తిగా మతిహీను

# ఆమ్రపాలి

డయ్యాడు. ఈలోపున గుంపు నుండి మలిన వస్త్రధారియైన మరో యువకుడు, వెలువడి సుధీరుని ముందు నిలిచి అరచాడు. అతడు నవ్వుతూ చెప్పసాగాడు. 'పిచ్చివాడా, మూర్ఖుడా, నేను పాలిని రా, నేను.' సుధీరుని వైపు చూచి అతడు మళ్ళీ కిలకిల నవ్వాడు. అతడు రుదనమూర్తి భట్టి.

మహానాముని రథం నడవసాగింది. అతని వెనక జయనాదం, ఆ జయఘోషను అణచే సుధీరుని అరవూ, భట్టి హాస్యమూ విన్పిస్తున్నాయి. ఆ ఉన్మత్తు లిరువురికీ వెనక పరాజితుడు, అపమానితుడు, తిరస్కృతుడు అయిన అభయుడు నిల్చున్నాడు. అతని ముఖంలో ఇంకా ఆ విషమయ హాస్యం ఉంది.

శయన గృహం చేరేవరకూ మహానాముడు అద్భుతమైన ధైర్యం కలిగి ఉన్నాడు. కాని శయ్యపై కూర్చుండగానే అలసట, తీవ్ర మానసిక వ్యథ, దుఃఖం, ఈర్ష్యల తీవ్ర భావంచే వ్యథితుడై పడిపోయాడు. ఆనందుడు పరిషత్తులోని కార్యక్రమమంతా తన కళ్ళతో చూశాడు. లిచ్ఛవీయులలో అతనికీడైన యోధులు కొద్దిమంది మాత్రమే ఉన్నారు. అయినా అతడు అక్కడ మౌనంగానే ఉన్నాడు. ఆ సమయంలో అతడు అద్భుతమైన సహనం చూపాడు. అనేక విషయాలలో అతడు తండ్రికి వ్యతిరేకుడైనా, తండ్రి నేర్పిన ఉపదేశాన్నీ, ఆజ్ఞనూ అతడెన్నడూ ఉల్లంఘించలేదు. అతడు నేడు స్వయంగా తండ్రి కష్టాన్ని అనుభవిస్తున్నాడు. ఇది ఇతని జయమా లేక పరాజయమా అని మహానాముడా లోచిస్తున్నాడు.

మయూర పంకాతో విసరుతున్న ఆనందుడు మెల్లగా అన్నాడు. 'నాన్నగారూ!' మహానాముడు కళ్ళు మూసే ఉంచాడు. ఆనందుని హస్తాన్ని తన వక్షంపై ఉంచి అన్నాడు. 'కుమారా, నేను పాలిని చంపి వేసినానేమో చెప్పు.'

'నేడు మీరు వైశాలికి నవజీవనాన్ని, ఇచ్చారు. నేడు గౌరవమయమై వైశాలి నవ్వుచునే పుత్రికను బలిగా ఇచ్చు తండ్రిని లిచ్ఛవీయులు మాత్రమే కనగలరని ప్రపంచమంతతో చెప్పును. కాని తండ్రీ—'

'ఏమి కుమారా?'

'ఏమీ లేదు.'

'నీ తండ్రిపై శపథం చేసి చెప్పు.'

'తండ్రీ, అవిధేయతను క్షమింప గోరుచున్నాను.' ఇట్లని ఆనందు డాగిపోయాడు. అతడు మనస్సునందు లేచిన తుఫానును శాంతింప చేయడానికి యత్నిస్తున్నాడేమో అన్నట్లుంది. ఎంత దాచినా మనస్సులో మాట వెలువడేపోయింది. అతడన్నాడు.

'తండ్రీ, సాముదాయకమైన ఆజ్ఞను మన్నించడమందే లిచ్ఛవీయులకు గౌరవం, మనదేశానికి మేలూ కలవు. కాని ..కాని పరిషత్తు నా సోదరి కొరకు ఇచ్చిన ఆజ్ఞ అనుచితం, అవినీతియుతం, ధర్మవిరుద్ధం. దేశానికి త్యాగం చెయ్యాలి అనడంతో నేను ఏకీభవిస్తాను. కాని నా సోదరి, నా కళ్ళ ముందే ఏ అపరాధం లేకుండానే వారాంగన అవడం నేను చూడలేను, తండ్రీ.'

'చాలించు, ఆనందా, చాలించు. ఏనాడు లిచ్ఛవీయుని జీవితం నుండి న్యాయం, నిష్ఠ హత, పూర్వులచే పాలింపబడ్డ కర్తవ్యం నష్టమవుతాయో, ఆ నాడే వైశాలీనగరం రసాతలానికి వెళ్ళిపోతుంది. సంథాగారంలో జరిగిందీ, పరిషత్తు కావించిందీ ప్రతి లిచ్ఛవీయుడూ లిచ్ఛవీయుల కోసమే కావిస్తున్నాడు. ఆ నిర్ణయమే ప్రతి లిచ్ఛవీయునికీ నిరాటంకంగా శిరోధార్యమైంది. పరమ పవిత్రమైన ప్రవేణి పుస్తకానికి విరుద్ధంగా మాట్లాడ్డానికి సాహసించకు బిడ్డా. కానిచో ఆత్మద్రోహివి, దేశద్రోహివి, ఘోరాపరాధివి అవుతావు..'

ఆనందుడు మౌనంగా ఉన్నాడు. వృద్ధుని లలాటమందు స్వేద బిందువులు వెలిశాయి. ఆనందుడు మెల్లగా వాటిని తుడిచి ప్రేమపూర్ణమైనా గద్గద కంఠంతో అన్నాడు—

'ఇప్పుడేమి ఆజ్ఞ, తండ్రీ?'

'పాలి నిక్కడికి వీలైనంత శీఘ్రంగా తీసుకొనిరా, కుమారా.'

'అట్లే తండ్రీ, కాని మీరిప్పుడే ఆమెను అక్కడే..'


'సంథాగారంలో ఉంచబడ బోయె, ప్రస్తావం మాట నాకు తెలిసింది. అందువల్ల ఆమెను అక్కడనే ఉండనిమ్మన్నాను... ఆనందా, ఆలస్యం చేయకు, పాలిని శీఘ్రంగా తీసుకురా.'

'మీ ఆజ్ఞ ప్రకారమే చేస్తాను. ఇప్పుడే వెళ్ళనా?'

'ఆఁ!'

(సశేషం)

# మీరు నిత్యమూ యిల్లు
# చక్కబెట్టుకుంటారు...



## మరి మీ డబ్బు విషయాలో?

డబ్బుకు సంబంధించిన సమస్యల్ని ముందుంచుకొని సక్రమంగా హాయిగా సంసారం గడపడం మీకు సాధ్యంకాదు. మీకు సమీపంలో వుండే బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి ఆఫీసుకు మీరు ఆహ్వానితులు. మీ డబ్బుకు సంబంధించిన సమస్యల్ని గూర్చి చర్చించేందుకు తప్పకుండా రండి మీరు... మీకు మేము అనేక విధాల సహాయం చెయ్యగలం.

ఒక విషయంచెప్పాలంటే, మీరు మావద్ద ఒక సేవింగ్సు అకౌంటు పెట్టండి. మేము మీకు సాలుకు లాభదాయకమైన 4 శాతం వడ్డీ యిస్తాము. ముందుగా నోటీసు యివ్వనక్కర్లేకుండానే 150 సార్లు మీ డబ్బును మీరు తిరిగి తీసుకోవచ్చు...మీ సొంత చెక్కు పుస్తకం కూడా మీరు పొందగలరు. గుర్తుంచుకోండి, మావద్ద డబ్బు నిల్వ చేయడం ఎంతో సులువు: ఒక్క రూపాయ తోనే మీరు మీ సేవింగ్సు అకౌంటు మొదలు పెట్టవచ్చు! చెక్కు పుస్తకం, పాస్ పుస్తకం కన్నా అతి ముఖ్యమైన విషయమేమిటంటే బ్యాంక్ ఆఫ్ బరోడా ఎంతో త్వరగా, ఎంతో ప్రతిభావంతంగా సర్వీసును మీరు అకౌంటు ప్రారంభించి నప్పటినుంచే యిస్తుంది.

మా అన్ని సర్వీసుల వివరాలను తెలిపేది ఉచితంగా లభించేది అయిన చిన్న పుస్తకం 'మీ సేవే మాలక్ష్యం' అనే దాని కొరకు వ్రాయండి.

## ది బ్యాంక్ ఆఫ్ బరోడా లిమిటెడ్

(స్థాపితము : 1908) రిజిస్టర్డ్ ఆఫీసు: మాండ్వి, బరోడా.

భారతదేశంలో 235 కు మించి బ్రాంచీలు ఉన్నాయి, ఇంకా లండన్, తూర్పు ఆఫ్రికా, తూర్పు పాకిస్తాన్. ఫిజీ ద్వీపాలు, మారిషస్ మరియు గయానాలలో కూడా బ్రాంచీలు వున్నాయి.

CMBB/13 TL

# వారఫలం

**26-8-1966 శుక్రవారం మొదలు**
**1-9-1966 గురువారం వరకు.**

**మేషం :** వృత్తివ్యాపారాల్లో యిదివరకు యేర్పడిన చికాకులు తొలగిపోతాయి. కొన్నివ్యవహారాల్లో మీకంటే పెద్దవారుకూడ మీసహకారాన్ని కోరవలసి వస్తుంది. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. సాంఘిక వ్యవహారాల్లో మీప్రాముఖ్యత పెరుగుతుంది. బంధువులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగాఉంటుంది. అలంకార వస్తువులు కొంటారు.

**వృషభం** ఆదాయంమాట యెలాగఉన్నా, అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో సమయానికి మిత్రుల సహకారం లభిస్తుంది. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. వృత్తిలో అనుకూలమైన మార్పులు వస్తాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

**మిధునం** వారం ప్రారంభంలో వృత్తివ్యాపారాల్లో ఆందోళన కలిగించే పరిస్థితులు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టంవస్తుంది. అవసరానికి ఏదోఒక విధంగా డబ్బుచేతికి వస్తుంది. కుటుంబసంతోషం లభిస్తుంది. రాజకీయవ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగాఉండదు. పుణ్య కార్యాలు చేస్తారు.



**కర్కాటకం :** ఇతరుల నిమిత్తం చేసే ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయిగాని మీస్వంత పనుల్లో శ్రమ కలుగుతుంది. మీరుయిదివరకు జరిపిన ఆర్థిక వ్యవహారాలవల్ల యిప్పుడు యిబ్బంది కలుగుతుంద. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. పాటివారితో మాటపట్టింపులు రావచ్చును.

స్త్రీలకు—ఆడంబరంకోసం వ్యయంచేస్తారు. దైవ కార్యాలు నెరవేరతాయి.

**సింహం :** అన్నివ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరతాయి గాని ఫలితం మాత్రం సంతృప్తికరంగా ఉండదు. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు మాత్రం బాగా ఉంటాయి. వృత్తిలో కొంత మందివ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసంచేయడానికి ప్రయత్నిస్తారు. కుటుంబసంతోషం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

**కన్య :** వృత్తివ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా దానికి తగిన ఆదాయం లభిస్తుంది. ముమ్ముందు లాభించగల వ్యవహారాల్లో మీప్రయత్నాలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ఉద్యోగంలో మీమంచితనమే మీకు యిబ్బందిని కల్గిస్తుంది. ప్రయాణాలుఫలిస్తాయి.

స్త్రీలకు— కుటుంబకార్యక్రమాలు సంతృప్తికరంగా ఉంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

**తుల** వ్యాపారంలో మీఅంచనాలు సరియైనవని రుజువుకావడం వలన అధికాధాయంతోపాటు ఆత్మవిశ్వాసంకూడా లభిస్తుంది. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. వృత్తిలో గౌరవం బాగా ఉంటుంది. స్థిరాస్థి వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. ఉద్యోగురాంద్రకు మంచిసమయం.

**వృశ్చికం :** వృత్తివ్యాపారాల్లో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితులు తొలగి పోవడం వలన అన్నివ్యవహారాల్లోను తగినంత అభివృద్ధిని సాధించ గలరు. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీకృషి రాణిస్తుంది. ఉద్యోగంలో అనుకూల వార్తలను వింటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడ లాభిస్తాయి.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమమీద నెరవేరతాయి.

**ధనుస్సు :** మీరు యెంతో ఆశించిన వ్యవహారాల్లో ఫలితం సామాన్యంగా ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాములనిర్ణయానికి వదలివెయ్యడం మంచిది. అవసరానికి యేదోఒకవిధంగా డబ్బు వస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో కొత్తసమస్యలు తలయెత్తవచ్చును.

స్త్రీలకు—బంధువులకుసహాయం చేస్తారు. అధిక వ్యయం జరుగుతుంది.

**మకరం :** వృత్తివ్యాపారాల్లో మీకార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి. భారీ యెత్తున చేసే వ్యాపారాల్లో మిత్రుల సహకారం లభించగలదు. ప్రయాణాలు ప్రయోజన కరంగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడం తగదు. కుటుంబ సంతోషం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగానే ఉంటుంది. మిత్రాలకు వస్తువులు పోవచ్చును.

**కుంభం :** కొన్నివ్యవహారాల్లో అవస్థమీది అనుభవం మరొకరిది కాగల పరిస్థితి యేర్పడుతండి. వ్యాపారంలో యెవరినీ విశేషంగా నమ్మి వ్యవహరించడం తగదు. ఉద్యోగంలో ముఖ్యమైన నిర్ణయాలు వారాంతంలో చేయడం మంచిది. అనవసరమైన వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో స్వల్ప భేదాభిప్రాయాలు వస్తాయి.

**మీనం :** ఇప్పుడు మీరుజరిపే వ్యవహారాలవల్ల కేవలం తాత్కాలికమైన లాభమేకాకుండా ముమ్ముందుకూడా తగిన ఉపయోగం ఉంటుంది. సాహసముతోకూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. రావలసిన డబ్బుమీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు.

స్త్రీలకు—సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి. అనుకూల వార్తలను వింటారు.

—మహేష్

## వైజ్ఞానిక గాథావళి-72
-ద్వారకి

# పికార్డు బెలూను యాత్ర




చిన్నప్పుడు చదివిన ఒక ఇంగ్లీషు నవలలో పులివేట వర్ణించాడు రచయిత. దిల్దార్‌ఖాన్ అనే సరదారు ఊరివారితో వేటకు బయల్దేరుతూ విల్లంబులూ, బల్లెమూ, పట్టాకత్తీ, బాకూ, ఇనప గోళ్ళూతో తానే ఒక పులిలాగ తయారై 'ఇదంతా ఎందుకయ్యా' అంటే "పులి దూరంగాఉన్నప్పుడు బాణము వేసి కొట్టుతాను. దగ్గరసికి వస్తే బల్లెము విసిరి చంపుతాను. చేరువకివస్తే కత్తితో నరికేస్తాను. మీదపడితే బాకుతో కుమ్మేస్తాను. పట్టుకుంటే ఇనపగోళ్ళతో చీల్చేస్తాను' అన్నాడట. పులిని వేటాడినప్పుడు ఇంత ప్లానూ అనుకున్నట్లు జరగక పోవచ్చునుగాని వైజ్ఞానికులు చేసే ప్రయోగాలలో ఇంతకు మించిన ప్లాను కనబడుతూంటుంది పని చేస్తుంది కూడాను.


ఆగస్ట్‌పికార్డు అంతరిక్షములో ఎక్కడనుండో తెలియక భూమికి చేరుతూన్న విశ్వమయూఖాల్ని అవి గాలి పొరలో గాలిపీల్చేసుకోడము వల్ల బలహీనముగా అవని ఎత్తులలో పరిశీలించాలని సంకల్పించాడు. అంటే బెలూనులో వైజ్ఞానిక పరికరాలతో పాటు తానూ తన సహాయుడూ ఎవరూ వెళ్ళనంత ఎత్తుకి వెళ్ళాలి. అంటే పెద్ద బరువును ఎత్తుక పోగలిగే బెలూను కట్టాలి. పికార్డు మహామేధావి. భూమిమీద వున్నప్పుడు తన బెలూనును తేలిక వాయువుతో పూర్తిగా నింపేయకుండా కొంతవరకే ఐదోవంతుకు మాత్రం నింపాడు. అందువల్ల ఆ బెలూను — నిండా వాయువునింపిన బెలూనంత జోరుగా లేవక పోయినా— నెమ్మదిగా చుట్టూవున్న గాలి వత్తిడి పైకి వెళ్ళినకొద్దీ తగ్గుతూండడము వల్ల ఉబ్బి క్రమంగా బెలూను ట్లిస్తై నింపుతుందన్నాడు భూమిమీద వున్నప్పుడు బాగా ఉబ్బి ఉండక పోవడం వల్ల జాలరి వలలాంటి బెలూను కవచపు అల్లికలో చిక్కుపడు తుందని ఆ వలనే వాడడము మానేశాడు.

ఇక తాను పది మైళ్ళకు మించిన ఎత్తుకివెళ్ళా అనుకున్నాడు. మామూలుగా పీల్చుకోడానికి ఆ యెత్తున వుండగల పల్చనిగాలి సరిపోదు. కనక తగరమూ అల్యూమినియమూ కలిపిన తేలిక లోహముతో తమిద్దరికీ ఒక గది—పెట్టె తయారు చేయించాడూ దానిలోని గాలి బయటికివచ్చేయకుండా అంతటా చక్కగా తాపటము (seal) చేయించాడు. ఆరు అడుగుల వ్యాసము గలగోళము తయారైంది. దాని సగము భాగానికి నలుపురంగూ రెండో (కుడి) పార్శ్వానికి తెలుపూ పూతపెట్టించాడు. ఇవి ఎందుకుటా? లోపలవున్న వారికి వేడిఎక్కువై పోతున్నట్లనిపిస్తే తెలుపు భాగాన్ని సూర్యుడున్నవైపు తిప్పుకుని ఆ సూర్యరశ్మిని అద్దము వల్ల మళ్ళించేసినట్టు వెనక్కి మళ్ళించే స్తారటా, ఒకవేళ అతిశీతలంగా వుంటే నల్లని పార్శ్వన్ని సూర్యుడి వైపు తిప్పి ఆగదిని వెచ్చబెట్టు కుంటారట....దానికి మనిషి దూర డానికీ బయటికి వచ్చేయడానికి రెండు ద్వారాలు పెట్టాడు. అసలు వాడకము ఒక్కటేనట, ఆకాశములో ఏదైనా అనుకోని ప్రమాదమువస్తేనట రెండోది వాడుకుని లోపలి రెండోవారు దిగిపోడము. అయితే మరీ వలతో తనగదిని బెలూనుకు కట్టేయలేదుకదా, ప్రమాదవశాత్తూ ఈగది బెలూనునుంచి తెగిపడిపోతేనో? ఒక పేరచూటు బిగించాడు గదిపైన, అది నెమ్మదిగా దిగడనికి.

నేలమీదనుంచి ఒక్కగుంజుతో బెలూను లేవకుండా వుండాలంటే అది బరువుగా వుండాలి. చాలా యెత్తుకి లేచి పోవాలంటే అంతరిక్షములో అది తేలిక అవాలి. లోహపు పొడిని పట్టుకున్నాడూ ఆయెత్తున దానిని చిన్నపెట్టెలోకి పోసి, ఆపెట్టె మూతమూసి, అడుగు తెరిచాడు. అంత ఎత్తునించి ఇసుకలాగా మట్టిలాగూ చెదరిపోయి దిగిపోయింది, అతని గదిలోని గాలి ఎంతమాత్రమూ పోలేదు..... అతడు పైకి వెళ్ళదామనుకున్నది నాలుగు గంటలు, కాని ఇరవై గంటలవరకూ ఇద్దరికి పీల్చుకోడానికి అవసరమైనంత ప్రాణవాయువు పట్టుకున్నాడు. ఆరడుగుల ఎత్తుగదికదా? దిగే కాలంలో గభీమని దిగితే కప్పుపిళ్ళ కపాలాలకు తకీమని తగులుతుంది. అందుకని తీగలతో అల్లిన టోపీలు పెట్టుకున్నారు, అతడూ అతని సహాయుడూను. గదికి కన్నము పడే బీట ఏర్పడితే అతకడానికి తారూ వేసలీనూ పట్టుకున్నాడూ, ఎందుకేనా పనికి వస్తుందని ఆక్సిజను ద్రవముపట్టుకున్నాడు. దాన్ని కొంచెము నేలమీద జల్లితే అది వాయువై పీల్చుకోడానికి పనికి వస్తుంది. అంతరిక్షంలో తాము పరికరాలవల్ల గ్రహించిన వైజ్ఞానిక వస్తువును కాగితాలమీదరాసి, పెట్టడానికి బద్దలు కాని సీసాలు పట్టుకున్నాడు. ఒకవేళ తాము ఈయత్నంలో చచ్చిపోతే ఇతరులకు తాము కనుక్కున్న సంగతులు తెలియవద్దూ?!

అయితే ఇంత జాగ్రత్త పడ్డారుగదా అని పరిస్థితులు వారిద్దరి ముద్దు ఊడబెట్టలేదు! గది బెలూను లేచేముందు గాలికి దొర్లి చిన్నబీటలిడి పడింది, ఆతొందరలో మంచినీళ్ళు మరచిపోయారు. బెలూనులోని హైడ్రోజనుమ వదిలేసి, దిగడానికి సాయపడే మరకి కట్టినతాడు తెగిపోయింది, నాలుగు గంటలు కాదు పద్దెనిమిది గంటలు ఆకాశంలో అల్లాడేరు. బీటల్ని తారుతో అతికేరూ, గదిలోహపుగోడకు అంటి కిందకి జారే నీటి బిందువులు నాకేరూ, పగలల్లా పైనవుండి రాత్రి చల్లదనానికి బెలూను కుంచించుకుని కిందికి దిగడము ఆరంభించింది. బరా మీటరు పగిలి కారిపోయిన పాదరసము గదిగోడల లోహాన్ని తినేయకుండా ఆగోడలకు పూసిన వార్నీసు కాచింది. అనుకున్న కాలానికి రాక పోడముతో 'సీభర్త చచ్చిపోయాడమ్మా' అని అతని భార్యకు చెప్పి బెలూను వెతికే సంఘము బయల్దేరింది కూడాను. అయితే ఈపులివేటలో వీరు బిద్దరూ బ్రతికేరు. పది మైళ్ళఎత్తుకి వెళ్ళి దిగివచ్చారు. కొండలమీది హిమానీ నదముమీద దిగి, కాఫీ కాచుకుతాగి, తరువాత దిగేరు ఆకొండలు ■


ఎవరికీ తెలియదులే
రండి రండి - పాపం ఎంత అలిసి పోయొచ్చారు...
ఇలా నిమ్మళంగ ఫ్యాన్ కింద కూర్చోండి-- క్షణంలో కాఫీ తెస్తా--
ఏదీ - బూట్లు తీస్తా! కాఫీ బావుందా... పాపం బాగా అలిసి పోయారండీ మీరూ
అన్నట్టు ఇవాళే కదూ మీరు బోనస్ డబ్బు తెస్తానన్నదీ.. తెచ్చినట్టున్నారే...
ఎంతా? ----- మూడొందలా?
సురేష్ తమ్ముడూ... ఈ డబ్బు పట్టుకెళ్లి ఆ షాపు వాడికిచ్చిరా --- ఇందాక నే పట్టుకొచ్చిన సిల్కు చీరల బాపతని చెప్పు
?
నో నో డియర్! అలా కాదు ఉతకడం... తే-నే చూపెడతా...
ఇదీ.. ఇలా ఉతికితే బట్టలు చిరగవ్!
ఇదుగోండీ.. అలాగే ఈ పన్నెండు చీరలూ- ఏడు జాకెట్లూ- మూడు దుప్పట్లూ కూడా ఉతికి ఆరేయండేం!



ఇంతుల సంగతి
— jayadev.
ట్రాన్సిస్టర్ అంటే ఏవిటండీ?
అదొక చిన్న బాట్రీ రేడియో
అలాంటిదే పక్కింటి శారద దగ్గర ఒకటుందండీ - తీరిక సమయాల్లో పెట్టుకుని సరదాగ వింటుంటుందండీ
ఐతే నీకూ ఒకటి కావాలంటావ్ అంతేనా
కావాలని నేనన్నానా అబ్బ-- నాకూ అంత భాగ్యమా---
+ − × + ÷ × + + × − × × + + − × ÷ = ?!
TRANSISTORS
టైం పదవుతూంది... లేవలా---
అబ్బా తల నొప్పెడుతూందండీ--
ఒళ్ళు నీరసంగ వుంది - డాక్టరు దగ్గరికి వెళితే అనవసరంగ డబ్బు ఖర్చు-- రెస్టు తీసుకుంటే అదే పోతుంది
ఇలాగే ఓసారి పక్కింటి మీనాక్షి ఒంట్లో బాగోలేదని రెస్టు తీసుకుంది--వాళ్ళాయనే వంట పనంతా చేశాట్ట!
ఓ అర్ధగంట తరువాత




నా చెవులలో ఇంకా ఆ మాటలే మ్రోగుతూ ఉనావి. "వెళ్లగానే ఏ హోటల్లోనో దిగి ముందుగా ఆదినారాయణ మూర్తిగారిని కలుసుకో. ఈ ఉత్తరం చూపించి వారు చెప్పినట్టు చెయ్యి." నేను హైదరాబాదు రావటానికని బస్సు ఎక్కి కూర్చున్నప్పుడు నాన్నగారు నాలుగో సారీ, ఆఖరు సారీ నాకు చేసిన హెచ్చరిక ఇది. అందువలననే అదే ధ్యేయంగా, గంట సేపటి నుంచి వెదుకు తున్నాను. అడ్రసు రాసిన చీటీ చేతిలో చమటకి తడిసి పోయింది. అన్నీ ఒకటే రకంగా కనబడే విశాలమయిన చక్కని రోడ్లు. ఎత్తయిన, ఖరీదయిన భవంతులు.

వెతికి వెతికి వేసారి పోయాను, చేతిలో అడ్రసు ఉండిన్నీ. వారి ఇల్లు కనబడేదాకా వెతక్క తప్పదు మరి. ఆ ఇంటి గేటు దగ్గర ఎవరూ లేరు. "కుక్కలున్నవి జాగ్రత్త!" అన్న బోర్డు కూడా లేదు. లోపల విశాలమయిన ఆవరణలో అందమయిన పూలమొక్కల మధ్యన పెద్ద భవనము. ధైర్యంగా లోపలికి అడుగు పెట్టాను.

"ఎవరు కావాలి?" అని నన్ను మధ్యలోనే ఆపి అడిగాడు ఒక కాకీ బట్టల మనిషి. బహుశా అతను ఏదో పిలుపు మీద లోపలికి వెళ్లి ఉంటాడు, గేటు దగ్గర నుంచి.

వారి పేరు చెప్పాను. మొహము అదోలా పెట్టి వికృతంగా నవ్వాడు. "ఇది కాదు. అవతలేమో కనుక్కోండి." అని, ఇక దయచెయ్యమన్నట్టు చెయ్యి చూపి గేటు వైపుకి దారి తీశాడు.

"ఎవరదీ?" అంటూ కర్టెన్ దగ్గర్నుంచి సన్నని గొంతు వినిపించి అటు చూశాను. హాలు గుమ్మానికి కట్టిన 'కర్టెన్' తొలగించి వరండా లోనికి మొహం మాత్రము తొంగి చూస్తూ ఉంది. మెరుపు తీగ లాటి పిల్ల అని మొహం చూస్తేనే చెప్పవచ్చు. నోట మాట లేక అలాగే చూస్తూ ఉండి పోయాను. మరుక్షణం ఆ మొహం మాయ మయింది. నా మెదడులో కలవరం చెలరేగింది.

ఆ అమ్మాయిని ఇది వరకు చూశానని అనిపించింది. కాని, ఎంత ప్రయత్నించినా ఆమె ఎవరో నా మెదడుకి తట్ట నే లేదు. 'ఎవరు?' అన్న ప్రశ్న నా మనస్సుని పూర్తిగా ఆవరించు కుంది. ఎంత ఆలోచించి, కృతకృత్యుడను కాలేక పోయాను. అప్పటికే నా వంక 'మిర్రి మిర్రి' చూస్తున్నాడు గేటు దగ్గర మనిషి. ప్రమాదం గ్రహించి రోడ్డు మీద పడ్డాను నిముషాలలో. ఆ గోడ మీద ఏమయినా పేరులాంటిది ఉందేమోనని చూశాను. కాని అలాంటి దేమీ నా కంటికి ఆనలేదు.

మరొక గంటకి ఆదినారాయణమూర్తి గారి ఇల్లు వెదకి చివరకు పట్టు కున్నాను. ఎంతో సంతోషమయింది. ఇంత సేపూ ఆ అమ్మాయి నా ఆలోచన్లని పూర్తిగా ఆక్రమించుకునే ఉంది. అందువలన నేమో నాకు మరి అంతగా అలసట అనిపించ లేదు.

నా అదృష్టం కొద్దీ ఆదినారాయణ మూర్తి గారు ఇంట్లోనే ఉన్నారు. నేను ఇచ్చిన ఉత్తరం బాగా పనిచేసింది. ఒకటి రెండు రోజులలో 'ఆర్డర్' చేతికి వచ్చేలా చేస్తానని ఆయన నాకు మాట ఇచ్చేరు. కాసేపు కూర్చుని కాఫీ తాగి వచ్చేశాను.

వచ్చిన పని సగం పూర్తయి నట్లే. ఆదినారాయణ మూర్తి గారు మాట ఇచ్చేక ఇక భయానికి ఆస్కారము లేదు. ఆయనకి దేశములో చాలా చోట్ల అనేక కంపెనీలలో వాటా లున్నాయి. కొన్నిటికి ఆయనే యాజమాన్యము నిర్వహిస్తుంటారు. అంతటి మనిషి నన్ను, సాదరంగా మాట్లాడి, భరోసాతో పాటు కాఫీ కూడా ఇచ్చి, ఆదరించారంటే ఇదంతా నేను తెచ్చిన ఉత్తరం మహిమే గదా అనుకుని ప్రాణం లేని (?) ఆ ఉత్తరానికి ధన్యవాదాలు అర్పించు కున్నాను.

బయట పడ్డాక, తిరిగి రెక్కలు వచ్చిన పక్షిని అయ్యాను. భాగ్యనగరంలో రెండు రోజులు గడప వలెనని ముందే అనుకుని ఉండటము వలన, తీరిక లేని కార్యక్రమము ఇది వరకే ఏర్పాటు అయి వుంది నాకు.

కాని నన్ను ఒకే ఒక ప్రశ్న ప్రొద్దుటి నుంచి ఊపిరాడకుండా చేస్తున్నది.

ఆ ఇంట్లో మెరుపులా కనబడి, మొహం మాత్రమే చూపి మాయ మయిన అమ్మాయిని నేను నిశ్చయంగా ఇది వరకు ఎరుగుదును. ఆమె ఎవరు? ఎవరు??

నాలుగు చోట్లా సాయంత్రం దాకా తిరిగి ఆరు గంటల సినిమాకి వెళ్ళాను. నేను వెళ్ళే సరికే సినిమా మొదలయింది. 'ఇంటర్ వెల్' లో బయటికి వచ్చి సిగరెట్ కాల్చు కుంటూన్న నా బుజం మీద బరువయిన చెయ్యి పడింది. వెనక్కి తిరిగి చూశాను.

లావు పాటి మనిషి. ఉలిపిరి కాగితంలో చుట్టిన యాపిల్ పండులా ఉంది, ఖరీదయిన బట్టల్లో ఉన్న అతని శరీరము. నున్నగా పుష్టిగా ఉన్న మొహములో సన్నగా చిరునవ్వు. నాకు తెలిసిన చిరునవ్వు! అయోమయంగా చూస్తున్న నన్ను, "మరిచి పోయావేంరా?" అన్నాడు అతను, కుదుపుతూ.

అతను సీతారామరావేనా? అవును. లావెక్కడము వలన పోల్చుకో లేక పోయేను. మనిషి ఎర్ర బడ్డాడు. ఒళ్ళు మనుపు దేలింది.

"నన్ను క్షమించరా. పోల్చుకో లేక పోయేను" అని వాడిని కావిలించు కున్నాను, చేతిలో సిగరెట్టు అవతలపారేసి.

"నీ మొహం లే" అంటూ నన్ను వదిలేసి ప్రశ్నలతో ముంచెత్తేడు. నేనూ అంతే. వాడిని చూసి ఏడేళ్ళు కావస్తున్నది. కాని వాడిలో, నన్ను ఆశ్చర్యంలో ముంచి వేసే విషయం ఒకటి చూశాను. ఆ సంగతి అడగటానికి నాకు నోరు రాలేదు, ఎంత సేపటికీ.

సీతారామరావు నాకు చిన్న నాటి స్నేహితుడు. ఆ కాసేపట్లోనే చాలా విషయాలు మాట్లాడు కున్నాం.

ఇంతలో 'సినిమా' మొదలవటము వలన లోపలికి వెళ్ళేము. కాని ఇక, మా దృష్టి 'సినిమా' మీద లేదు. మా గొడవలో మేము పడిపోయేము. విసుగుతో కూడిన ఛీత్కారము ప్రక్కనున్న ప్రేక్షకుల నుంచి వచ్చింది. అదీ ఆడ ప్రేక్షకుల నుంచి అవటము వలన నోళ్ళు మూసుకున్నాము బుద్ధిగా ఇద్దరమూ.

సినిమా అయింతరవాత 'లైట్లు' వెలిగేయి. సీతారామరావు ప్రక్కన మరో ఇద్దరు ఆడవాళ్ళు ఖరీదయిన దుస్తులలో ఉండటము అప్పుడు గమనించేను. అతను పరిచయం చేసేడు. ఒకామె అతని భార్య. రెండవ ఆమె!? ప్రొద్దున నేను చూసి, ఎవరా? అని జ్ఞాపకం తెచ్చుకోవటానికి నానా యాతన పడి, చివరికి మెదల కుండా ఊరుకున్నది ఈ అమ్మాయిని గురించే అని తెలుసుకుని నా మతిమరుపుకి తిట్టుకున్నాను.

"మా మరదలు" అని పరిచయం చేశాడు. ఆ అమ్మాయి పేరు శ్యామలట. అవును ఆ అమ్మాయి నాకు ఇది వరకే తెలుసును.

దానికి కథ కొంత ఉన్నది.

అయితే ప్రొద్దున నేను చూసిన విశాలమయిన, ఖరీదయిన భవంతి ఎవరిది? ఎక్కడి సీతారామరావు? నేను ఆశ్చర్యపడుతూనే ఉన్నాను. నాచెయ్యి పట్టుకొని నడిపించుకుని వెళ్ళేడు సీతారామరావు, తన ఖరీదయిన కారు దగ్గరకు. "మొన్నే కొన్నాను. రా. నిన్ను 'డ్రాప్' చేస్తాను." అని లోపలికి లాగేడు. వెనక సీట్లోకి ఆడవాళ్ళు వెళ్ళేరు. వాడికి హొటలు పేరు చెప్పి మెరిసే 'టాంక్ బండ్' మీది లైట్ల వంక చూస్తూ ఉండి పోయేను.

కారు ఆగింది. "రేపు ప్రొద్దున వస్తాను" అని, నా రూము నంబరు కనుక్కున్నాడు. నా ఆలోచనల్లో నన్ను వదిలి 'గుడ్ నైట్' చెప్పి వెళ్ళి పోయాడు సీతారామరావు వాళ్ళతో.

నాకు తెలిసిన ఏడేళ్ళ కిందటి సీతారామరావుని వూహించుకుంటూ గది చేరు కున్నాను.

శ్యామల— సీతారామరావు— వాళ్ళ మామ గారు— అతని భార్య నా మస్తిష్కంలో తిరుగుతూనే ఉన్నారు.

అవును. ఏడేళ్ళ కిందటి సీతారామరావుకీ, ఇప్పుడు నేను చూస్తున్న సీతారామరావుకీ చాలా తేడా ఉంది. ఇతనే అతనా అన్న అనుమానమూ నాకు కలగక పోలేదు. మావూరు ఒకటే: నేనూ, సీతారామరావూ 'స్కూల్ ఫైనల్' దాకా కలిసి చదువు కున్నాము. అతను 'స్కూల్ ఫైనల్' రెండు సార్లు తప్పాడు. నేను 'ఇంటర్మీడియట్' పాసయేసరికి ఇంకా సీతారామరావు 'స్కూల్ ఫైనల్' పూర్తి చెయ్యనే లేదు. తరవాత నేను బి. ఏ. కి బందరు వెళ్ళవలసి వచ్చింది.

సీతారామరావుకి తల్లీ తండ్రీ చిన్నప్పుడే పోయారు. అందువలన అతన్నీ, అతనికి మిగిల్చి పోయిన కొద్ది ఆస్తినీ వాళ్ళ మేనమామలు చూశారు. ఆ రోజుల్లోనే అతనికి పెళ్ళయిందని తెలిసింది.

ఆ తరువాత అతని గురించి కొన్నాళ్ళు నాకు ఏమీ తెలియ లేదు.

నేను బి. ఏ. చదువుతూ వుండగా ఒకసారి వేసవి సెలవులలో మా మామయ్య గారి వూరు వెళ్ళాను. అక్కడ ఉన్నన్నాళ్ళూ నాకు ఏమీ తోచేది గాదు వేళకి ఇంత తిని తోటల వెంటా, పొలం గట్ల వెంటా తిరుగుతూ ఉండే వాడిని. పంట కాలవల పక్కన ఎత్తయిన తాటి చెట్లూ మామిడి చెట్లూ పట్టుకు తిరగటం, కాసేపు కాలవలో ఈత కొట్టడము, 'బోర్' కొట్టినప్పుడు గొంగెలి, బిగ్గరిగా పాటలు పాడటం చేసే వాణ్ణి. ఒక్కోసారి నా ఈ చేష్టలు గమనించి ఎవరైనా నవ్వుకొనటము చూసి కంగారు పడి సిగ్గు పడే వాడిని.

ఒకసారి అట్లా తిరుగుతూ ఉన్న నేను, సాయంత్రపు నీరెండలో, మామిడి చెట్టు నీడన, కాలవ గట్టు మీద తల కింద చెయ్యి పెట్టుకుని పడుకుని కూనిరాగం తీస్తున్న ఒక మనిషిని గమనించాను. తెల్లని బట్టలు, అతని కూనిరాగం, నా ఒంటరి తనం నన్ను అతని దగ్గరకు వెళ్ళేలా చేశాయి. దగ్గరకు వెళ్ళి చూసి ఆశ్చర్య పోయాను.

అతను సీతారామరావు. అతుకులు ఉన్నా అతని బట్టలు, శుభ్రంగా ఉన్నాయి. నన్ను చూసి నవ్వి కావిలించు కున్నాడు ఆనందంతో. సీతారామరావు అత్తవారి వూరు అదేనట! "ఏం చేస్తున్నావ"ని అడిగేను. "ఉద్యోగం ఇచ్చే వాళ్ళు లేరు. నానా కష్టమూ పడి 'స్కూల్ ఫైనల్' పూర్తి చేశాను. వ్యవసాయం చెయ్యటం చాత కాదు. ప్రస్తుతం తినటం తిరగటం తప్ప వేరే పని లేదు." అని నవ్వాడు. ఆ నవ్వు వెలితిగా కనబడింది నాకు. ఆ రోజు నుంచి ఇద్దరం కలిసి తిరిగే వాళ్ళము, జంటగా తోపులలో.

అతని మాటల వెనక అగాధం, నవ్వులో వెలితి ఉన్నట్టని పించేది నాకు.

ఆ నాడు బాగా పొద్దు పోయింది, మేము వూళ్ళోకి వెళ్ళేప్పటికి. అతన్ని ఇంటి వద్ద దిగబెట్టాను దారి లోనే అవటం మూలాన వాళ్ళ ఇల్లు. నిశా చరుల్లాగా వెడుతున్న మేము కటిక చీకటిలో తెల్ల తెల్లగా ఉన్నాము.

# బంధితుడు

వాళ్ల మామ గారు గాబోలు అంటు న్నారు "ఇంకా దొరగారు రాలేదా?" అని. ఆ మాటలు విన నట్టుగా, నాకు వీడ్కోలు చెప్పి అతను లోపలికి వెళ్లి పోయాడు వెళ్లటానికి నాలుగడుగులు వేసిన నాకు, అతని మామగారి మాటలు వినిపించేయి. "ఏం బాబూ! దమ్మిడీ పని లేక పోయినా, ఇంత పొద్దు పోయే దాకా రాచకార్యాలు అవలేదా? ఇంటి దగ్గర మనుష్యుల్ని కంగారు పెట్టడ మెందుకయ్యా పనీ పాటా లేని వాళ్లు కూడా. ఎవరా మనిషి?" అని. సీతా రామారావు మెల్లగా ఏదో చెబుతున్నాడు.

నాకు సిగ్గు వేసింది. గబ గబా నడిచి వెళ్లి పోయాను.

సీతారామరావు జీవితం ఇట్లా అయిం దన్న మాట చివరికి. సంపాదన లేని పురుషుడికి ఇంట్లో ఇచ్చే గౌరవం నాకు తెలియంది కాదు. అలిగి అత్తవారి ఇంటికీ, చెడి చెల్లెలు ఇంటికీ వెళ్ల కూడ దంటారు. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోక పోయినా ఉన్న మాట అది. అట్లాంటిది సీతారామరావు ఇలా విలువ లేని జీవితం గడుపుతూ అత్తవారినే పట్టుకుని ఎందుకు వేళ్లాడుతున్నాడో నాకు అర్థం కాలేదు. ఎవరు ఉండ వలసిన చోట వారు ఉంటేనే ఆద ర్శాలూ, స్నేహాలూ, బంధుత్వాలూను. ఈ సంగతి సీతారామరావుకి తెలియదా?

అదే అడిగేను అతన్ని మర్నాడు. "మన వూరికి వచ్చేసి నీ ఇంట్లోనే ఉండి పోగూడదా?" అన్నాను. అతను నవ్వి అన్నాడు. "ఇవన్నీ నాకు తెలీక కాదు. నా పెళ్లయి నప్పటి నుంచీ మా మేన మామలకీ మా అత్త వారికీ చెడింది. ఒకళ్లంటే ఇంకొకరికి మంట. అందు కని ఆ వూళ్లో తన కూతురు కాపురం చెయ్యటం మా అత్త గారికి ఇష్టం లేదు. ఏదైనా ఉద్యోగం చూసుకో మంటారు వీళ్లు. అప్పుడే వాళ్ల అమ్మా యిని కాపరానికి పంపిస్తారట. ఈ సమస్య ఇట్లా కొన్నాళ్లు నలిగింది. అది ఇక్కడా, నేను అక్కడా బాధ పడటం నాకు ఇష్టం లేక పోయింది. ఎంత ప్రయత్నం చేసినా ఉద్యోగం దొరక లేదు. 'ఎస్. ఎస్. ఎల్. సీ.' కి సిఫారసు లేకుండా ఈ రోజుల్లో ఏమి ఉద్యోగం దొరుకుతుంది? అందుచేత, నా మకామే, మార్చేశాను. మొదట్లో బాగానే చూశారు. కాని రోజులు గడచిన కొద్దీ కృష్ణ పక్షపు చంద్రుడులాగ ఆ గౌర వమూ ఆవిరయి పోయింది.

ఇక వేరే దారిలేదు. అందుకని ఒక 'పాలసీ'ని నిర్ణయించుకున్నాను. అయిం దేదో అయింది. అన్నింటికీ చెడ్డాను. ఇంక లెక్క ఏమిటి? నాకు. మొండివాడు రాజు కంటె గొప్పవాడన్నారు.

అల్లుడు, కడు స్వతంత్రుడు అన్నాడు. నా బలహీనత ఏమంటే మా వాళ్లను విడిచి ఉండలేకపోతున్నాను. ఇప్పుడు నేనూ వాళ్లలో ఒకణ్ణి అయిపోయాను. పెద్దవాళ్లు మతి చాంచల్యంతో ఏవో అంటారు. మనము అవన్నీ పట్టించుకుంటే ఎట్లా? సర్దుబాటు ఏదో ఒక వైపు నుంచైనా ఉండాలి గదా!"

ఆశ్చర్యంతో అతన్ని చూస్తూ ఉండి పోయేను. అతను, ఆ సాయంత్రము నన్ను వాళ్ల ఇంటికి తీసుకుపోయాడు. వాళ్ల మామగారు నన్ను గుచ్చి గుచ్చి చూసి యక్ష ప్రశ్నలు వేసేరు. నాకు చమటలు పట్టి నంత పనయింది. దీర్ఘమూ, ఉన్నతమూ అయిన కాయముతో బుంగమీసాలు కదు పుతూ ఆయన అడిగే ప్రశ్నలూ, చూపే చూపులూ నన్ను ఇబ్బంది పెట్టాయి.

"ఉద్యోగం చేస్తున్నావా?" అని అడిగేరు ఆఖర్న. లేదని తలాడించేను. నిరసనగా నా వేపు చూసి పైపంచ దులిపి అవతలికి వెళ్లిపోయే రాయన. నాకు సంతోషమైంది. తేలిగ్గా ఊపిరి పీల్చేను. బంధం వొదిలి పోయి నందుకు.

నేను కూర్చుని ఉండగానే, "ఇప్పుడే వస్తాన"ని చెప్పి భార్యతో మాట్లాడ టానికి లోనికి వెళ్లేడు సీతారామరావు. యధాలాపంగా తలతిప్పి దొడ్లోకి చూసిన నేను ఆశ్చర్యంతో, ఆనందంతో ఉబ్బితబ్బిబ్బ య్యాను. నా కన్నులకు విందు అయినది!

మెరుపు తీగలాటి ఒక అందాల బాలిక పూలుకోసుకుంటూ ఉన్నది. ఆమె నన్ను గమ నించనే లేదు. పసిమి పచ్చని బంగారు ఛాయ. చంపకు చారడేసి కళ్లు. అంద మైన సన్నని ఎర్రని పెదిమలు. అద్భుత మయిన అందంతో మెరిసిపోతున్నది ఆ అమ్మాయి. అంత అందం నేను ఎప్పుడూ చూడలేదు.


తరవాత సీతారామరావు వచ్చాడు. ఆ అమ్మాయిని చూపించి ఎవరని అడిగేను

"ఏం?" అని కొంటెగా నవ్వి, "మా మరదలు. శ్యామల." అన్నాడు. అప్పటినుంచీ నా మనసంతా ఆ అమ్మాయే ఆక్రమించేసింది. మనసులో మధనపడ్డాను. నిద్రలేని రాత్రులు గడిపాను. వోడిపోయాను. ఒకటి రెండు రోజులలో నేను ఆవూరు వొదిలి వెళ్ళిపోతానగా, ఇక ఆగలేకపోయాను. "నువ్వు ఏమీ అనుకోనంటే ఒక టడుగుతాను సీతారామారావు!" అన్నాను. నా వంక కుతూహలంగా, ఆశ్చర్యంగా చూశాడు. "మీ శ్యామలని నాకు ఇచ్చి పెళ్ళి చెయ్యటానికి మీ వాళ్ళకేమయినా అభ్యంతరం ఉంటుందా?" అన్నాను నోరు పెగల్చుకుని. సీతారామారావు నా బుజం చరిచి పగలబడి నవ్వాడు. "వోరి నీ! ఇదా నువ్వడిగేది?" అని వెక్కిరించాడు. నాకు సిగ్గేసింది వాడి మీద కోపం వచ్చింది. "సీరియస్‌గా అడుగుతున్నాను. నవ్వుతా వెందుకు?" అన్నాను కోపం తెచ్చుకుని.

"ఈమాత్రం దానికి అంత ఇదెందుకు? మన చేతులలో పనే గదా! నేనే ఆయన్ని కదలేస్తాను. నిన్నూ, నీ ఆస్తినీ చూసి ఇవ్వక ఏం చేస్తారురా పిచ్చివాడా!" అన్నాడు. "నేను రెండురోజులలో వెళ్ళిపోతున్నాను. నువ్వు ఇవాళే ఈ విషయం కదిపి, సరే ననిపిస్తే, తరవాత ఆయన్ని మా వాళ్ళ దగ్గరికి పంపవచ్చు. వీళ్ళు సరేనంటే ఈలోగా నేను మా వాళ్ళని దారికి తీసుకు రావటానికి వల వేస్తాను." అన్నాను.

"వో యస్. 'అల్లుడు కడు స్వతంత్రుడు' అన్నారుగా? ఇవాళే మాట్లాడతాను. వాళ్ళకీ ఇష్టమే అనిపించి నీ కోరిక నెరవేరుస్తాను." అన్నాడు. నాకు చాల సంతోషమయింది. వాడిని మెచ్చుకున్నాను.

ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు కలలలోకి శ్యామల వచ్చి అల్లరి చేసింది. మర్నాడు సీతారామారావు నాకు కనబడి, నప్పుడు ఆముదం మొహము పెట్టాడు "మిగతా విషయాలు ఎట్లా ఉన్నా వాళ్ళ 'చదువుకున్న నిరుద్యోగి'కి శ్యామలని ఇవ్వరట. ఈ విషయం వాళ్ళకి ఎంతగానో నచ్చచెప్పటానికి ప్రయత్నించాను. 'ససేమిరా' అన్నారు. అందులో నువ్వు నా స్నేహితుడవటం వలన మా మామగారు మొదట్లోనే కొట్టి పారేశారు. 'నువ్వు ఒకడివి ఉన్నావు. చాలు. ఇంకా నీకు జత ఎందుకు?' అన్నారు. నా వలన కాలేదు బ్రదర్" అని ముక్కు చీదుకున్నాడు విచారపడి.




# బంధితుడు

నా ఆశలు మొదట్లోనే తుంచివేయ బడ్డాయి. అవమానంతో వాడి మొహంలోనికి సరిగా చూడలేకపోయాను. ఆ మర్నాడే ఆ వూరు వొదిలి వొచ్చేశాను. తిరిగి ఆవూరి మొహం చూడలేదు. ఎవరెంత బలవంతం చేసినా.

అప్పట్నించీ తిరిగి సీతారామారావు సంగతి తెలియలేదు. ఆనాటి ఆ సీతారామారావు తిరిగి ఈ రూపంలో కనబడేసరికి నాకు ఆశ్చర్యం కలిగిందంటే అసహజత్వం ఏమీ లేదు గదా!

ఈ ఆలోచనలతో బుర్ర వేడెక్కిపో యింది. ఏ వొంటి గంటకో నిద్రపట్టింది. మర్నాడు ఉదయం ఏడు గంటలకే తలుపు దబదబా కొట్టాడు, హోటలు కుర్రాడు. "మీ కోసం ఎవరో వచ్చారంటూ. ఎదు రుగా నవ్వుతూ సీతారామారావు కన బడ్డాడు. పైనుంచి కిందవరకూ అన్నీ ఖరీద యినవి ధరించి ఉన్నాడు. అతన్ని గాభరాగా లోపలికి రమ్మని పిల్చుకు వెళ్లేను. "తొంద రగా, కానీ. పనుంది." అన్నాడు కూర్చుంటూ. ఒక అర గంటలో అన్నీ ముగించేను. కింద అతని కారు ఉన్నది.

"ఎక్కడికి?" అని అడిగాను, స్టీరింగు తిప్పుతున్న అతని చేతుల వొంక చూస్తూ, చిన్నగా నవ్వాడు. కారు పరుగెత్తింది. నా ఆశ్చర్యము వాడు, గమనించాడు కాబోలు అన్నీ వివరంగా చెప్పాడు. 'సిరిదా వచ్చిన వచ్చును సలిలంబులు నారికేళ ఫలముక్క భంగిన్' అంటూ మొదలుపెట్టి.

ఆ పల్లెటూళ్లో, అత్తవారింట విలువ లేని నిరుద్యోగిగా, సోమరిపోతు అల్లుడుగా మరో ఏడాది గడిపేడట. కొన్నాళ్లకి తిక్క వచ్చి మా వూళ్లో తనకి మిగిలి వున్న ఆస్తిపాస్తులు అన్నీ అమ్మేశాడట. ఓ పది వేలు చేత్తో పట్టుకుని ఝుమ్మని హైదరా బాదు వచ్చేశాడట. ఆ పదివేలూ పెట్టి దొరికినన్ని స్థలాలు చవగ్గా కొనేశా డట! ఐదేళ్లలో వాటి ధరలు ఎంత గానో పెరిగిపోయి చూస్తూ ఉండగానే 'లక్షలు' వచ్చిపడ్డాయిట. ఇక ఆ వ్యాపా రము తన తాహతుకి తగదని, అదంతా రక రకాల 'బిజినెస్సుల'లో పెట్టాడట. మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఆ వ్యాపారాలన్నీ పెరిగేయట. ఇప్పుడు అతనికి నాలుగు, మేడలూ, ఒక సినిమా హాలూ, మూడు పెద్ద పెద్ద పరిశ్రమలలో వాటాలూనట! ఈమధ్యనే నలభైవేలు పోసి ఈ కారు కొన్నారట!

"ఇదీ బ్రదర్! నా చరిత్ర" అని నవ్వాడు సీతారామారావు. ఆ రోజుల్లో అతను వెలితిగా నవ్వేవాడు. కానీ ఈ నవ్వులోనూ ఎంతో వెలితి ఉన్నట్టు కనబడింది నాకు. ఎందుకు?

"ఇంతకీ ఇప్పుడెక్కడికి, మనము వెళ్ళ డము?" అని అడిగేను. "ప్రస్తుతము తిన్నగా మా ఇంటికి. తరవాత నీ ఇష్టం" అన్నాడు సీతారామారావు.

నా మనస్సులో ఇంకా కొన్ని సందేహాలు మిగిలిపోయేయి. మరో అయిదు నిముషా లలో గమ్యస్థానం చేరేము. గేటు కాపలా వాడు నన్ను చూసి తెల్ల మొహం వేసేడు. నాకు నవ్వు వచ్చింది.

హాలులోకి వెళ్లేటప్పటికి, సిల్కు లాల్చీలో మునిగి, మెడలో బంగారు గొల్సుతో విశ్రాంతిగా కూర్చుని, చుట్ట కాల్చుకుం టున్న ఒక భారీ విగ్రహాన్ని చూసి అదిరి పడ్డాను నేను. నా సందేహం వొదిలిపోయింది.

"రండి. రండి" అని ఆహ్వానించేడాయన నవ్వుతూ. నిదానంగా మాట్లాడే డాయన నాతో. ఎన్నాళ్ళుగానో తెలిసిన మనిషిలా ప్రవర్తించా డాయన. లోపల నుంచి గాజుల గలగలలు వినిపించేయి. ముసలా యనలో అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు!

ఆయన నన్ను చాలా చాలా విషయాలు అడిగేడు. ఉద్యోగ వివరాలూ అవీ విచా రించాడు. నేను ప్రయత్నిస్తున్న ఉద్యోగం గురించి విని సంతోషం ప్రకటించాడు. లోపల్నించి కాఫీలూ అవీ వచ్చాయి. అప్పటికి సీతారామారావు బయటికి ఊడిపడ్డాడు.

కాసేపు మాట్లాడిన తరవాత సీతారామా రావుతో కలిపి బయటపడ్డాను. నన్ను ఆదినారాయణ మూర్తిగారి ఇంటి దగ్గర దించి నాతో అవసరంగా మాట్లాడాలనీ, సాయంత్రము నాలుగు గంటలకి తను వస్తా ననీ, కనుక నన్ను గదిలోనే ఉండమనీ చెప్పి సీతారామారావు వెళ్లిపోయాడు.

ఆదినారాయణమూర్తి గారు ఇంటిలోనే ఉన్నారు. నేను వెళ్లగానే పదినిముషాలలో నా చేతికి 'ఆర్డర్సు' వచ్చాయి. మరుసటి రోజే నేను ఉద్యోగంలో చేరాలని చెప్పా రాయన. ఆయనకి కృతజ్ఞత చెప్పి బయ టికి వచ్చాను సంతోషంగా. హోటల్‌కి వెళ్లి సామాను సర్దేశాను. నాలుగ్గంటల

దాకా ఇష్టము వచ్చినట్టు ఊరంతా తిరిగి చూశాను. ఆవాళే నేను వెళ్లిపోవాలి.

ఆ సాయంత్రము నాలుగు గంటలికి చెప్పినట్టుగానే, సీతారామరావు వచ్చాడు. కాఫీలు తాగి 'టాంక్ బండ్' వైపు వెళ్లేము అతని కారులో. అప్పుడు మొదలెట్టేడతను. "నువ్వేమీ అనుకోకుండా ఉంటే ఒక సంగతి చెప్తానురా" అని నా వంక చూశాడు. చెప్పమన్నట్టు తలాడించేను నవ్వుతూ. "నీ కోరిక మీద ఆనాడు నేను అడిగితే వాళ్లు అంత ఇదిగా నిరాకరించేరు. ఇన్నాళ్లనుంచీ ఎన్నో సంబంధాలు చూస్తూనే ఉన్నాము గాని, ఏదీ కుదరలేదు. ఒకటి సరిగా ఉంటే ఇంకోకటి బాగా ఉండటం లేదుట! అందులో ఈ ఆడవాళ్లని గొంతెమ్మ కోరికలు గదా!" అని ఆగాడు. నేను నవ్వాను. "కాని ఇన్నాళ్ల తరవాత మా వాళ్లందరూ ఎంతో కష్టపడి ఏకగ్రీవాభిప్రాయానికి వచ్చారు. ఇది నిజంగా గొప్పసంగతి. నిన్ను చూశాక ఇప్పుడు మా వాళ్లకి, మా శ్యామలని నీకు ఇచ్చి పెళ్లి చేద్దామని ఉద్దేశ్యం కలిగింది. అయితే ముందు నీవు వొప్పుకోవాలిగదా! అప్పుడు అంతగొడవ జరిందాయెను. నువ్వు "ఊఁ' అంటే నేను మీ వాళ్ళని కలుసుకుని మాట్లాడతాను. ఈ విధంగానయినా మనము దగ్గరవాళ్ళను ఆవొచ్చు. ఏమంటావు?" అంటూ తన చేతిలో ఉన్న నా చేతిని ఆదర పూర్వకంగా నిమిరేడతను.

నాకు ఆశ్చర్యమూ, ఆనందమూ, ఒక్కసారిగా కలిగేయి! ఉక్కిరిబిక్కిరి అయిపోయేను!!

"అంతా బాగానే ఉందిరా. ఆనాడు అవమానం జరిగిందని నేనేమీ మనసులో పెట్టుగోవటం లేదు. కాని, ఇప్పుడు పరిస్థితి నా చేతిలోలేదు. అంతా అయిపోయింది." అన్నాను.

"అదేమిటో నాకు చెప్పు. నేను ప్రయత్నిస్తాను." అన్నాడు.

"చెబుతాను, తప్పకుండా. ముందు నాకు ట్రెయినుకి టయిమవుతున్నది. రేపే బెజవాడలో ఉద్యోగంలో జాయినవాలి." అని తొందర పెట్టి వాడ్ని లేవదీశాను. వాడి మొహం తెల్లబోవటము నేను గమనించాను. హోటల్లో సామాన్లు తీసుకున్నాము. దారిలోనే గదా, కాఫీ తాగి పోదాము అని బలవంతం చేసి ఇంట్లోకి తీసుకపోయేడు నన్ను 'నేను కారులో డ్రాప్ చేస్తాను గదా!' అంటూ.

అతని మామగారు ఎంతో ఆదరంగా పలకరించేడు, హాలులో ఎదురు పడి, మొహం నిండుగా నవ్వుతూ. కాసేపటికి లోపలి నుండి ఊడిపడి సీతారామారావు, వచ్చి నా ప్రక్కన కూర్చున్నాడు. కాఫీ, ఫలహారాలు పట్టుకుని, సీతారామారావు భార్యా, శ్యామలా, వచ్చారు. నేను 'టయిమ'యి పోతూందని తొందరపడటము గమనించిన ముసలాయన "ఇంకా అరగంట టయిముంది. మన కారులో అబ్బాయి వచ్చి దిగబెడతాడు. ఫరవా లేదు." అని నవ్వాడు. నేను తేలిగ్గా ఊపిరి పీల్చాను.

నాకు నమస్కారాలు చేసిన ఆడవాళ్లకి నేను సిగ్గుతో చేతులు కలిపి ప్రతినమస్కారం చేశాను. కాఫీలయ్యేయి. ఆఖర్న ముసలాయనే విషయం కదిపేడు సూటిగా.

"మా శ్యామలని మీకిద్దామనుకుంటున్నాము. మీకు అభ్యంతరం లేకపోతే, మిగతా విషయాలు మీ వాళ్లతో మేము మాట్లాడుతాము" అని. ఇక లాభంలేదు. వీళ్లు అందరూ కలిసి నిలబెట్టేశారు.

తెగించి ఉన్నమాట చెప్పక తప్పదు ఇకనైయినా. లేకుంటే పాపం మూటగట్టుకున్నా వాడినవు తాను. "మీ అందరిలో ఆ అభిప్రాయం కలిగించినందుకు క్షంతవ్యుణ్ణి. మీ ఆదరాభిమానాలకి నేను ఎంతో కృతజ్ఞుణ్ణి.

# బంధితుడు

సీతారామారావుకి చెప్పాల్సిన అవసరం లేదనుకోండి. ఇంతకీ, విషయమేమిటంటే, నాకు పెళ్ళయి ఏడాదయింది. ఒక పసిపిల్లాడికి తండ్రిని కూడాను." అని నాటకంలో లాగ ఉన్నమాట అని, మొహాన పట్టిన చమటని 'కర్చీఫ్'తో తుడుచుకున్నాను.

అందరి మొహాలూ వెలవెలపోయేయి.. ఆడవాళ్ళు లోపలికి వెళ్ళిపోయేరు. వాళ్ళతో బాటు సీతారామారావూను. "మరి నాకు సెలవిప్పించాలి తమరు." అన్న నా మాటలకి ముసలాయన వంచిన తలని ఎత్తకుండానే అటూ ఇటూ ఊపేడు. నేను 'సూట్ కేసు' పట్టుకొని బయటికి వచ్చాను. సీతారామారావు నాతో పాటు బయటికి వచ్చాడు. గేటు దగ్గర నిలబడి అటు పోతూన్న 'టాక్సీ'ని కేకేశాడు. షెడ్డులో అతని కారు కనబడుతూనే ఉంది. కారులో దిగబెడతాడేమోననుకుంటున్న నేను ఆశ్చర్యపడక తప్పలేదు, ఇది చూసి. ఇద్దరమూ టాక్సీలోకి ఎక్కాం. తిరిగి ఆ మేడ వైపు చూడటానికి నేను సాహసించలేదు. నన్ను రైలెక్కించి, చెయ్యి వూపుతూ ఉన్న సీతారామారావు కళ్ళలో చిప్పిలిన ఒకటిరెండు కన్నీటి బొట్లు చూసి విచలితుడనయ్యాను.

ఏదో పోగొట్టుకున్నట్లు బాధగా ఉంది వాడి మొహము.

సంపాదనాపరుడై, ఐశ్వర్యంలో మునిగి తేలుతూ ఉన్న సీతారామరావు దేనికోసము బాధపడుతూ ఉన్నాడో నాకు అప్పుడు తట్టలేదు.

ఒకొకప్పుడు, విపరీతమయిన ఆరాధనా భావమూ, సర్వమూ సమర్పించుకోగలిగిన, అనురాగమూ అవి ఎంత ఉన్నతమైనవయినప్పటికిన్నీ, సరైన గుర్తింపు లేకపోతే పరిణామాలు విపరీతంగా ఉంటాయి. అలాగని భార్యని ప్రేమించి ఆరాధించటం తప్పని నా అభిప్రాయం కాదు. నా దృష్టిలో నిజంగా అదొక అదృష్టము. కాని మితము లేకపోతే వెగటు అనిపిస్తుందేమో, ఏదయినా. నిజంగా,ధార్ష్టికం చలాయించకపోతే మగవాడికి విలువ ఉండదేమో?

నా స్నేహితుడు సీతారామరావుని, అతని ఆరాధనాభావమే, భార్య ఎడల అతనికి గల అపరిమితమయిన ప్రేమభావమే బంధముగా మారి బానిసను చేసినదా? ఏది ఏమయినప్పటికిన్నీ, ఆ నాటికీ ఈ నాటికీ కూడా, ఆ ఇంట్లో నా స్నేహితుడు సీతారామరావుకి గల స్థానములో కించిత్తయినా వ్యత్యాసము, నాకు ఎంత జాగ్రత్తగా చూపినా, కనబడలేదు... ●




చిన్నతనంలో ఒకసారి నసీరుద్దీన్‌కి వ్యాపారం చేసి బాగా డబ్బు గడించాలని కోరిక కలిగింది. తనకన్న వయసులోనూ, అనుభవంలోనూ చిన్నవాడైన స్నేహితుణ్ణి జతచేసుకున్నాడు — వ్యాపారంలో భాగస్వామిగా. తాము ఉంటున్న పల్లెటూళ్ళో చవగ్గా ఒక కుండెడు పాలు కొని, దగ్గరలో ఉన్న పట్టణానికి మోసుకుపోయి అమ్మేశారు.

మళ్ళీ తమ వూరికి తిరిగి వస్తూ ఆకుండనిండా షర్బత్తు కొన్నారు పల్లెటూళ్ళో అమ్మడానికి. కొనగా ఒక్క పావలా మిగిలింది. రెండోవాడి కన్న తాను పెద్దవాడు కనుక ఆ పావలా తన జేబులో వేసుకున్నాడు నసీరుద్దీన్.

"పాల అమ్మకం లాభసాటిగానే ఉంది. షర్బత్తు కూడా చవగ్గానే దొరికింది. దిష్టి తగలదు కదా!"

"షర్బత్తు మన వూళ్ళో బాగా అమ్ముడైతే మనం రోజూ ఈ పనిచేసి, దోసిళ్ళతో సంపాదించవచ్చు"

**మౌల్వీనసిరుద్దిన్ — కథలు**

**మహీధర్ నళినీ మోహన్**

"దీనితో దరిద్రం వదిలి పోవాలి" ఇలా మాట్లాడు కుంటు న్నారు కుండను కావిడి వేసి మోస్తూ.

దారిలో నసీరుద్దీన్‌కి దాహం వేసింది.

"ఈ వేళ పొద్దుటి నుంచీ ఒకటే తిరుగుడు అయిపోయింది. మహా చెడ్డ దాహం వేస్తోంది నో గ్లాసెడు షర్బత్తు తాగాలి. ఏదీ కావిడి దింపు"

రెండోవాడు ఒప్పుకోలేదు.

"స్నేహం స్నేహమే. వ్యాపారం వ్యాపారమే. గ్లాసెడు షర్బత్తు పావలా అవుతుంది. కావాలంటే పావలా ఇచ్చి కొనుక్కుని తాగు"

న్యాయమే మరి! నసీరుద్దీన్ తన జేబులో ఉన్న పావలా కాసు తీసి, స్నేహితుడికిచ్చి, నో గ్లాసెడు షర్బత్తు తాగేడు.

మరో నాలుగు అడుగులు వేసే సరికి ఆ స్నేహితుడికి దాహం వేసింది. నసీరుద్దీన్‌కి ఒక పద్ధతి, తనకో పద్ధతి కాదు కదా! న్యాయం న్యాయమే ఎవరయేది.

తన జేబులో నుంచి పావలా కాసు తీసి, నసీరుద్దీన్‌కి ఇచ్చి, తానో గ్లాసెడు షర్బత్తు తీసుకుని తాగేడు.

మరో నాలుగు బారలు నడిచే సరికి నరుసీద్దీన్‌కి షర్బత్తు మీద మనసు అయింది. వెంటనే తన జేబులో ఉన్న పావలా తీసి, స్నేహితుడి చేతిలో పెట్టి, గ్లాసుడంటే గ్లాసుడే షర్బత్తు తీసుకు తాగేశాడు.

తరువాత ఆ దోస్తు, తరువాత నసీరుద్దీన్, మళ్ళీ అతడు......

పావలాకాసు గబగబా చేతులు మారింది. వూరు చేరే సరికి కాళీ కుండ, పావలా కాసు మిగిలాయి. ●

# చైనాలో 'పార్టీశుద్ధి' కార్యక్రమం

( 8వ పేజీ తరువాయి)

లోనూ మితవాదులు చేసిన దాడిని 1959 లో జరిగిన 'లుషాన' సమావేశంలో ఎదుర్కొని అధిగమించటం జరిగింది.

(3) 1966. జిత్తుల మారులైన శత్రువులు తమ నిజరూపాన్ని, తెచ్చి పెట్టుకున్న కృత్రిమ సనాతనవాదంలో దాచి పెట్టుకున్నారు. పెట్టుబడి దారీ వ్యవస్థను పునరుద్ధరించటమే వారి లక్ష్యం. పరిస్థితులు వక్కానికి వస్తే కృశ్చేవ్‌లాగానే ప్రతి విప్లవపు కుట్రకు పూనుకొని ఉండేవారు. అలా జరుగక పోవటం మావో ఆలోచనా శక్తికి ఒక కొత్త విజయం

## ఏ: వేత కొనసాగింపు

జులై, 1. 1966: సాహితీ వేత్తల, కళాకారుల వర్గంలోని ప్రత్యర్థులకు ప్రచారశాఖ డిప్యూటీ డైరెక్టరే నాయకుడని 'రెడ్ ఫ్లాగ్' విమర్శించింది.


జులై, 7. 1966: సాంస్కృతిక శాఖ, పార్టీ ప్రచార శాఖల మంత్రిని బర్తరఫ్ చేసి నట్లు పీకింగ్ నుండి వార్త లందాయని జపాన్ ప్రకటించింది. పరిదిద్దే ఉద్యమానికి సైన్సు అకాడమీ ఉపాధ్యక్షుడు చెనపోటా, 'రెడ్‌ఫ్లాగ్' సంపాదకుడు, డిప్యూటీ ప్రధానులలో ఒకరూ అయిన టావోచులు నాయకులని తెలుస్తున్నది.

జులై మధ్య, 1966: అదృశ్యులైపోయిన సైనిక సిబ్బంది ప్రధానాధికారి జనరల్ లోజుయి చింగ్ స్థానంలో మార్షల్ యుహ్ భియెన —ంగ్‌ను నియమించ మున్నారని తెలుస్తున్నది. ●

## చెన్నపురి ఆంధ్రమహాసభ స్వర్ణోత్సవ సంచిక

చెన్నపురి ఆంధ్రమహాసభ మద్రాసు యాభై సంవత్సరాల సాంస్కృతిక జీవితమును పూర్తి చేసుకున్న శుభసందర్భాన సభవారువెలువరించిన స్వర్ణోత్సవ సంచిక మాకార్యాలయం చేరింది.

అందమైనముఖచిత్రంతో, ఆకకర్షణీయమైన అచ్చుతో,చక్కనికాగితంమీదముద్రింపబడిన 237 పేజీలుగల ఈసంచికలో సభను గురించిన వివరాలు, ప్రముఖులెందరో వ్రాసిన చక్కనివ్యాసాలు, మద్రాసు పూర్వచరిత్రను వివరించేరచనలు, విజ్ఞాన వినోదాలనందించే ఇతర శీర్షికలూ ఉన్నయి. ●



'గూఢచారి 116'' లో జయలలిత, కృష్ణ

చిత్రసమీక్ష

# గూఢచారి 116

దేశంలో దౌర్జన్యకాండలు, విధ్వంసక చర్యలు జరుపుతూ శత్రువులకు సాయం చేసే విద్రోహుల ముఠాను అంతం చేయడానికి పంపబడిన ఏజంట్ 303 కొన్ని వివరాల్ని సేకరించి మధ్యలోనే శత్రువ్యూహంలో చిక్కుకుని మరణిసాడు. అతని తర్వాత నియమింపబడిన స్పెషల్ ఏజంట్ 116 అసమాన ధైర్య సాహసాలతో శత్రువ్యూహాలను ఛేదించి వాళ్ల కీలకస్థావరంతోబాటు ఆ ముఠాకు సర్వాధికారియైన 'సుప్రిమో'ని కూడా నాశనం చేసాడు.

ఇంతవరకూ తెలుగు తెరపై కన్పించని కథా సంవిధానం, ట్రిల్స్ విజయలక్ష్మీ పిక్చర్స్‌వారి గూఢచారి 116 లో మనకి కన్పిస్తాయి.

ఈ చిత్రంలో కృష్ణ, శోభన్‌బాబు (గెస్ట్),ముక్కామల,రేలంగి,రాజనాల,రమణారెడ్డి, రాజ్‌బాబు, వేణుమాధవ్, జయలలిత, గీతాంజలి, నిర్మల, సుధామాల మొదలగువారు నటించారు.


స్పెషల్ ఏజంట్‌గా కృష్ణ, రాధగా జయలలిత చక్కని నటనను ప్రదర్శించారు. ఏజంట్ 303 గా శోభన్‌బాబు తన పాత్రకు న్యాయం చేశారు. గీతాంజలి, సుధామాల పాత్రోచితమైన నటనను ప్రదర్శించారు. ముక్కామల, రాజనాల నిండుగా నటించారు. రమణారెడ్డి, రేలంగి, రాజ్‌బాబు, వేణుమాధవ్ చక్కని హాస్యాన్నందించారు.

ఊటీ, కేరళలలో చిత్రీకరించిన అవుట్‌డోర్ దృశ్యాలు మనోహరంగా ఉన్నాయి. చిత్రీకరణ విషయంలో ఛాయాగ్రాహకులు మంచి నేర్పును చూపారు.

ప్రతి అడుగూ ఉత్కంఠ కల్గించే విధంగా రూపొందించడంలో దర్శకుని ప్రతిభ చిత్రంలో ప్రతిబింబిత మవుతుంది. పాటలన్నీ విన సొంపుగా ఉన్నాయి. సంగీత దర్శకులు శ్రీ టి. చలపతిరావు ఈ చిత్రంలో ఒక కొత్త ప్రయోగాన్ని చేశారు.

ఈ చిత్రానికి ఛాయాగ్రహణం శ్రీ రవికాంత్ నగాయిచ్, దర్శకత్వం శ్రీ ఎం. మల్లికార్జునరావు నిర్వహించారు. నిర్మాతలు: శ్రీయుతులు సుందర్‌లాల్ నహతా—డూండీ.

—మాధవ్ ●



"శ్రీకృష్ణతులాభారం"లో జమున, యన్. టి. రామారావు.

# చిత్రలహరి

అనంతలక్ష్మి ప్రొడక్షన్స్ వారి "కాంభోజ రాజు కథ" చిత్రం షూటింగు వాహినిలో జరుగుతున్నది. ఇటీవల వెల్లూరుకు ఆరు మైళ్ళ దూరాన గల నరసింహ స్వామి కొండవద్ద అవుట్ డోర్ షూటింగు జరిపి వచ్చారు. గుమ్మడి, అంజలీదేవి, రాజశ్రీ, శోభన్ బాబు, చలం, రాజ్ బాబు, ధూళిపాళ, సూర్యకాంతం, రమణారెడ్డి, చదలవాడ కుటుంబరావు, వాణిశ్రీ యీ చిత్రంలోని ముఖ్య భూమికలలో ఉన్నారు. సంభాషణలు: ఏ. పిచ్చేశ్వర రావు, గీతాలు: కొసరాజు, సి. నారాయణరెడ్డి, సంగీతం: టి. వి. రాజు, కళ: వి. వి. రాజేంద్ర కుమార్, నృత్యాలు: వెంపటి సత్యం కెమెరా: యస్. వెంకటరత్నం, ఎడిటింగ్: సత్యం, దర్శకత్వం: తిలక్, నిర్మాతలు: భాస్కరరావు, కొసరాజు భానుప్రసాద్.

## ఉమ్మడి కుటుంబం

రామకృష్ణ యన్. ఏ. టి. కంబైన్ వారు తమ మూడవ చిత్రంగా "ఉమ్మడి కుటుంబం" అనే సాంఘికం నిర్మిస్తున్నారు. యన్. టి. రామారావు, రేలంగి, ప్రభాకరరెడ్డి, సత్యన్నారాయణ, అల్లు రామలింగయ్య, రాజ్ బాబు, బాలకృష్ణ, సావిత్రి, యస్. వరలక్ష్మి, కృష్ణకుమారి, యల్. విజయ లక్ష్మి, వాణిశ్రీ, హేమలత యింత వరకు ఎన్నుకోబడినారు. ఈ నెల 22 న పాట రికార్డ్ చేసి, సెప్టెంబరు మొదటి తేదీ నుంచి షూటింగు ప్రారంభిస్తారు. సంభాషణలు: సముద్రాల (జూనియర్), గీతాలు: సి. నారాయణ రెడ్డి, కొసరాజు, సంగీతం: టి. వి. రాజు, కళ: యస్. కృష్ణారావు, కెమెరా: రవికాంత్, దర్శకత్వం: డి.యోగానంద్, నిర్మాత: యన్. త్రివిక్రమరావు.

*   *   *


కృష్ణకుమారి, సుకన్య, సంధ్యారాణి, కాంతారావు, కృష్ణ, యస్. వి. రామదాసు, రమణారెడ్డి, ధూళిపాళ, బాలకృష్ణ, రాజ్ బాబు మొదలయిన వారితో మధు పిక్చర్స్ వారి 'రెండవ' చిత్రం వాహినిలో ప్రారంభించారు. సంభాషణలు: సీటూరి, గీతాలు: సి. నారాయణరెడ్డి సంగీతం: కోదండపాణి, కళ: యస్. కృష్ణారావు, కెమెరా: రవికాంత్, దర్శకత్వం: బి. విఠలాచార్య ఈ సాహసోపేత జానపద చిత్రానికి నిర్మాత పి. మల్లికార్జున రావు.

## శ్రీ కృష్ణావతారం

యన్. టి. రామారావు శ్రీ కృష్ణునిగా, యస్. వి. రంగారావు దుర్యోధనునిగా, కాంతారావు నారదునిగా, శిశుపాలునిగా రాజనాల, రుక్మిణిగా దేవిక సత్యభామగా కాంచన నటించేందుకు తారకరామ పిక్చర్స్ వారి, "శ్రీ కృష్ణావతారం" చిత్రంలో ఎన్నుకోబడినారు. రచన: సముద్రాల రాఘవాచార్య, గీతాలు: సముద్రాల, సి. నారాయణ రెడ్డి, సంగీతం: టి. వి. రాజు, కళ: గోఖలే, కెమెరా: అన్నయ్య, దర్శకత్వం: కె. కామేశ్వర రావు, నిర్మాత: ఏ. పుండరీకాక్షయ్య.

## మనసే మందిరం

గతించిన జ్ఞాపకాలు డాక్టర్ రఘును నీడలా వెంటాడుతున్నవి. సీత తలపులు అతన్ని వీడి పోవటంలేదు. ఆమెఫొటోను తీసి చూసుకొంటూ —"చల్లగ ఉండాలి! నీమది నెమ్మది పొందాలి, నిండుగ నూరేళ్ళూ నువు నిత్య సుమంగళి కావాలి" అంటూ ఆశీర్వదించి ఆ ఫొటోను అక్కడే టేబిలు మీదున్న పత్రికలో దాచాడు. ఇంతలో రాము వచ్చాడు. కూచో మన్నాడు డాక్టరు. పొద్దుపోక, నిద్రరాక యిలా వచ్చానని— చదువుకుందుకు ఏవేనా పుస్తకాలుంటే యివ్వ



బత్తమీజ్ హిందీచిత్రంలో సాధన...షమ్మీకపూర్

మని అడిగి, ఆ టేబిల్ మీది వున్న కంప్లైట్ దృష్టిపడి దాన్ని తీసుకు వెళ్ళేందుకు ఉద్యుక్తుడయినాడు రాము. అది పాతదని వారించ బోయాడు రఘు. అయినా పర్వాలేదంటూ పట్టు కెళ్ళాడు. డాక్టరు హృదయం ఆందోళనా పూరితమయినది. రాము పత్రిక తీసుకు వస్తుండగా సీత హార్లిక్స్ కప్పుతో ఎదురయింది. భర్త చేతిలోని పత్రికను తీసుకొని తన చేతిలోని కప్పు అతనికి అందించింది. సీత పత్రిక తిరగేస్తుండగా అందులో వున్న ఫోటో చూసి కలవర పడ్డది. ఆ కంగారులో ఫోటో కింద పడింది. ఇంతలో రఘు కూడ మెట్లు దిగి వస్తూ వాళ్ళిద్దర్నీ చూసి ఆగి పోయాడు. జారి కింద పడిన ఫోటో భర్త కంట ఎక్కడ పడుతుందోనని— సీతకు చెమటలు పోస్తున్నవి. చేతులు వణుకు తున్నవి. అయినా తమాయించుకుని బయట మంచు కురుస్తోందని భర్తను లోపలికి తీసుకు వెళ్ళి— మళ్ళీ తాను యివతలికి వచ్చింది ఫోటో కోసం. కాని అది అక్కడ లేదు. భయ పడింది. తలెత్తి చూసింది. ఎదురుగా రఘు మేడ మీదకు వెళ్తూ కని పించాడు. బాధగా వెనక్కి తిరిగి వెళ్ళింది సీత.

—అత్యంత ఆసక్తి కరమయిన యీ సన్నివేశం శ్రీ కృష్ణసాయి పిలిమ్స్ వారి "మనసే మందిరం" చిత్రంలోనిది. డాక్టర్ రఘుగా నాగేశ్వరరావు, రాముగా జగ్గయ్య, సీతగా సావిత్రి నటించారు. మాటలు, పాటలు: ఆత్రేయ, సంగీతం: ఎం. ఎస్. విశ్వనాథం, కళ: గంగా, కెమెరా: బాలు, ఎడిటింగ్: ఎన్. ఎం. శంకర్, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: శ్రీధర్, నిర్మాత: యర్రా అప్పారావు.

* * *

ఆగస్టు 1 వ తేదీన భాను పిక్చర్స్ వారి కార్యాలయంలో దర్శకుడు శ్రీ కె. ప్రత్యగాత్మను కలిశాను. ఆయన ప్రస్తుతం ఒలింపిక్ పిక్చర్స్ (మద్రాసు) వారి "అన్నపూర్ణ" హిందీ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. నూతన్, రెహమాన్, మాస్టర్ మహేష్, లలితా పవార్ నటిస్తున్నారు. ఈ మాసాంతానికి యీ చిత్రం షూటింగు పూర్తి అవుతుంది. కె. యస్. పిక్చర్స్ అనే బొంబాయి సంస్థ కులగోత్రాలు చిత్రం హక్కులు కొని హిందీలో పునర్నిర్మిస్తున్నది. దీనికి శ్రీ ప్రత్యగాత్మే దర్శకులు. ఈ చిత్రం షూటింగు సెప్టెంబరు నుంచి ఆరంభిస్తామనీ— అక్టోబరులో భాను పిక్చర్స్ చిత్రం, ఆత్మా ఆర్ట్స్ చిత్రం ప్రారంభించడం జరుగుతుందనీ చెప్పారు ప్రత్యగాత్మ. కులగోత్రాలు హిందీ వెర్షన్ లో — తెలుగులో నాగేశ్వరరావు వేసిన పాత్రను బిశ్వజిత్, కృష్ణకుమారి వేషాన్ని మాలాసిన్హా పోషిస్తారు. సంగీతం: లక్ష్మీకాంత్ ప్యారేలాల్. భాను పిక్చర్స్ చిత్రంలో కృష్ణకుమారి, కృష్ణంరాజు, ఆత్మా ఆర్ట్స్ చిత్రంలో నాగేశ్వరరావు, కృష్ణకుమారి ముఖ్య భూమికలు ధరిస్తారు.



'పిడుగురాముడు'లో వాణిశ్రీ

## వసంతసేన


శకారుని అనుచరులు వసంతసేనను బంధించి — అతని దర్బారుకు తీసుకు వచ్చారు. శకారుడు విలదీస్తున్నాడామెను "ఏ అనాథ రక్షకు డొస్తాడో చూస్తాను" అన్నాడు గుడ్లురిమి చూస్తూ. భీత హరిణలా చూస్తున్నది వసంతసేన. చారుదత్తుడు మారు వేషంతో వచ్చాడు. ద్వారపాలకుల్ని తోసుకుని ముందుకు వస్తూ "ఆగు!" అంటూగద్దించాడు. "ఆగను!" శకారుడు యిటు తిరిగాడు. చారుదత్తుడు దగ్గరికి వచ్చి "ఆమెను వదిలెయ్!" అన్నాడు. వసంతసేన కన్నుల్లో విచిత్రమయిన వెలుగు ద్యోతకమయింది. "బాలా ఎవడురా వీడు!" అడిగాడు శకారుడు తన అనుచరుణ్ణి. "వాడికేం తెలుసు, నేనే ఆలేకుణ్ణి!" అన్నాడు గంభీరంగా మారు వేషంలో వున్న చారుదత్తుడు. శకారుడతన్ని నిశితంగా పరిశీ



"శ్రీకృష్ణతులాభారం"లో యల్. విజయలక్ష్మి

# చిత్రలహరి

లిసూ "సువ్వా, అలేకుడంటే ఏ భూతమో, దెయ్యమో అనుకున్నాను. భటులారా పట్టుకోండి!" అన్నాడు. చారుదత్తుడు మెరుపులా ముందుకు వచ్చి కత్తి ఝళిపిస్తూ "తలుచుకుంటే విన్నాక్షణంలో తుద ముట్టించ గలను." బదులు చెప్పాడు. శకారుడు నవ్వాడు. "అది వసంతసేన వచ్చింతర్వాత. ఆమె ప్రాణాలు కాపాడాలంటే ముందు నువ్వు కత్తి పారేసి, నాకు బందీవికావాలి!" 'కట్' అన్నారు దర్శకులు శ్రీ బి. యస్. రంగా. ఈ సన్నివేశం విక్రమ్ ప్రొడక్షన్స్ వారు ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిసున్న



'నాగజ్యోతి'లో అనితాగుహ

"వసంతసేన" చిత్రంలోనిది. చారుదత్తునిగా నాగేశ్వరరావు శకారునిగా యస్. వి. రంగారావు, వసంతసేనగా పద్మిని, శకారుని అనుచరుడుగా బాలకృష్ణ నటించారు. ఆగస్టు 12 న ఇది విక్రమ్ స్టూడియోస్‌లో చిత్రీకరించారు. రేలంగి, అంజలీదేవి, కృష్ణకుమారి, గిరిజ, సత్యన్నారాయణ, బేబి ప్రశాంత్, సవితాదేవి కూడ ఈ చిత్రంలోని ముఖ్య భూమికలలో ఉన్నారు. సంభాషణలు: సదాశివబ్రహ్మం, గీతాలు: దాశరధి, కొసరాజు, సంగీతం: యస్. రాజేశ్వరరావు, కళ: సుధేందురాయ్, నృత్యాలు: హీరాలాల్, సహకార దర్శకులు: టి. దయాసాగర్, కె. ధర్మరాజు, ఛాయాగ్రహణం, నిర్మాణం, దర్శకత్వం: బి. యస్. రంగా. ఇంతవరకు 11 రీళ్లు పూర్తి అయింది.

మోహన్‌కుమార్

# పుస్తకాలు

## ఆదర్శ శిఖరాలు:

ఆదర్శ శిఖరాలు : (నవలిక). రచన : రుద్రభట్ల నరసింగరావు. ప్రతులకు: సుషమా ప్రచురణ. 6—2—959/1, ఖైరతాబాద్, హైదరాబాద్—4. పేజీలు : 85. వెల : 1—25.

పుటల గణాన్నిబట్టికాక, గుణాన్నిబట్టి, కథకూ, కథానికకూ, నవలకూ నవలికకూ మధ్యగల భేదాన్ని గుర్తించడం దుస్తరమైన విషయం. ఇంతవరకూ వచ్చిన తెలుగు నవలికలకు ఆదర్శప్రాయమైన ఉదాహరణాలు గోపీచంద్‌గారి "అసమర్థుని జీవయాత్ర" విశ్వనాథశాస్త్రిగారి "అల్పజీవి" రచనలు. సరిక్రొత్తగా వెలువడిన నరసింగరావుగారి నవలిక "ఆదర్శ శిఖరాలు" పై రెండింటితోనూ కథా కథనంలోనూ, విషయ విశ్లేషణం లోనూ విభేదిస్తున్నది. కొన్ని క్రొత్త లక్షణాలను ప్రదర్శిస్తూ, ఆలోచనకు వీలు కల్పిస్తున్నది. భానుమతి, కామేశ్వర్రావుల మధ్యగల అప్రకటిత ప్రణయాన్ని అక్షరం అక్షరంలోనూ హృద్యంగా ప్రకటిస్తున్నది. రఘురామయ్య స్నేహితుడుకొడుకు కామేశ్వర్రావు. రఘురామయ్య గారాబుపట్టి భానుమతి. రఘురామయ్యతమకు ఆత్మీయుడివి తెలియకనే వారి పంచ చేరిన చిత్రకారుడు, కవి, విద్యార్థి, బీదవాడూ అయిన కామేశ్వరావు భానుమతిని తనకు తెలియకనే ఆకర్షిస్తాడు. అంతకు ముందే అతనికి రమణవంటి రమణులతో ఆంతరంగికమైన స్నేహ సంబంధమున్నా, అతనికి భానుమతి వంటి యువతిలో మాత్రమే తనను కదలించగల సౌందర్యరేఖ కనుపించి, మమతాపద్మం వికసించి చివరకు పరిణయబంధంలో పరిసమాప్తి చెందుతుంది. ఈకథలో నిజానికి క్రొత్తదనంలేదు. అయితే కథనంలో ఒకానొక ఝుటితస్ఫూర్తి, ఒక బిగువు, చిన్న మాటలు, చిన్న చిన్న వాక్యాలూ, సంభాషణా చతురిమ ఉండడంతో పాఠకుడికి కథమీదకు మనసుపోక, పాత్రలచుట్టూ అతని ఆసక్తి అవృతమవుతుంది. పాత్రలన్నీ మంచితనానికి మారుపేర్లు కావడంతో ఒక ఆదర్శలోకం కళ్లముందు నిలుస్తుంది. కథానాయకుడి 'నోట్ పుస్తకం' చదివి కథానాయికి, తన ప్రియుని మానసికస్థితిని తెలుసుకోవడంలో క్రొత్తదనం లేకపోయినా, 'నోట్‌పుస్తకం'లోని విషయాలను పాఠకులముందు పరచడంలో రచయిత "చైతన్య ప్రవంతి పద్ధతి" నవలంబించి కృతకృత్యులయారు. కానీ కొన్ని కొన్నిచోట్ల రచయిత తన భాషమీద తగినంత శ్రద్ధ చూపించనందువల్ల, పండితుడైన పాఠకుడికి మనసు చివుక్కుమంటుంది. "హృదయం పిట్ట", "పంచసీలలు", "పైత్యాధర్మ", "నవలాతర్మ" వంటివి రచనలోని గంభీరతను చెడగొట్టుతున్నాయి. వీటికితోడు నవలికకు "ఆదర్శ శిఖరాలు" అన్న పేరుగాక మరొకటి ఏదైనా పెట్టివుంటే బావుండేది! ఈ నవలిక లోగడ ఒక పత్రికలో ప్రకటింపబడినట్లు జ్ఞాపకం. ఆపత్రిక పేరు ఎక్కడా ఉదాహరింప బడలేదు.

—శ్రీరామచంద్రమూర్తి.


Edited Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6&7 Thambu chetty Street Madras-1. Phones Editoria 21747; Other depts ; 29766. Chief Editor: S Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA